మార్క్సిస్టు

ఏప్రిల్
2022

192

సంపుటి : 16 సంచిక : 11 వెల రు. 15/-

## ఈ సంచికలో........

పోరాట స్ఫూర్తి ప్రదాత మల్లు స్వరాజ్యం

ఈ దశాబ్దపు మార్క్సిస్టు : ఐజాజ్ అహ్మద్

పపంచీకరణ యుగంలో సాంస్కృతిక రంగం

గొప్ప మార్క్సిస్టు మేధావి, విప్లవకారుడు : ఐజాజ్

ఆధునికానంతరవాదం : పూర్వాపరాలు

మహాజ్ఞాని, నిజమైన మార్క్సిస్టు మేధావి

భారత్‌పై ఆధునికానంతరవాద ప్రభావం

మౌర్య సామ్రాజ్య స్థాపన

సమకాలీన సామ్రాజ్యవాద సంస్కృతులు



epaper.prajasakti.com

నివాళి

# పోరాట స్ఫూర్తి మల్లు స్వరాజ్యం

**పోతినేని సుదర్శనరావు**



**దోపిడీ పాలనను అంతం చేసి ప్రజారాజ్యాన్ని స్థాపించడానికి నేను దృఢ నిశ్చయంతో ప్రతినబూనుతున్నాను. ఎన్నడూ పిరికితనాన్ని ప్రదర్శించను. అవసరమైతే ప్రాణాలిస్తాను కానీ శత్రువు ముందు తలవంచను. ఆయుధాలను ప్రాణాలకంటే విలువైనవిగా భావిస్తాను. అమరవీరులను స్మరిస్తూ, అరుణపతాకం ఎదుట నేను ఈ ప్రమాణం చేస్తున్నాను.**

సాయుధ పోరాటానికి సన్నద్ధమైన 16 ఏండ్ల మల్లు స్వరాజ్యం ఆనాడు చేసిన ప్రమాణం ఇది. చేసిన బాసకు కట్టుబడి ఎనిమిది దశాబ్దాల పాటు ప్రజారాజ్య స్థాపనకై అలుపెరుగని పోరాటం చేసిన ధీశాలి. అన్నింటా ఆమె ఆదర్శమే. పూవు పుట్టగానే పరిమళిస్తుంది అన్నట్లు పసివయసులోనే పోరాట పంథా ఎంచుకొన్నారు. 11 సం॥ల వయసులో ఆమె తండ్రి చనిపోయారు. ఆయన మినహా ఆ కుటుంబంలో అందరూ విప్లవకారులే. అక్క శశిరేఖ కూడా పోరాటంలో ఉన్నారు. పోలీసులకు పట్టుబడి 3సం॥ల జైలు జీవితం గడిపారు. అమ్మ చొక్కమ్మ ఇచ్చిన గోర్కీ "అమ్మ నవల", అన్న భీమిరెడ్డి, ఆయన సహచరులు బద్దం ఎల్లారెడ్డి, రావినారాయణ రెడ్డి చేస్తున్న పోరాటం ఆమెను విప్లవమార్గం వైపు నడిపించాయి. 600 ఎకరాలున్న భూస్వామ్య కుటుంబంలో ఆమె పుట్టింది. అత్యంత దుర్మార్గమైన భూస్వామ్య వ్యవస్థ సమాజంలోని ప్రజలను పీడిస్తున్నది. భూ కేంద్రీకరణ, వెట్టి చాకిరి, దోపిడీ, అణచివేత, అగ్రకుల ఆధిపత్యం, మహిళల పట్ల మరీ చిన్నచూపు ఇవీ ఆ వ్యవస్థ ప్రధాన లక్షణాలు. ఈ అన్ని లక్షణాలపైన జీవిత పర్యంతం అలుపెరుగని పోరాటం చేసిందీ వీరవనిత. ఆడది వరదాల మాటున ఉండాలి. పురుషుల ఎదుట మాట్లాడకూడదు. ఎదురసలే మాట్లాడకూడదు. ఇటువంటి సాంప్రదాయ సంకెళ్ళను పటాపంచెలు చేసి, కదన రంగంలోకి దూకింది కామ్రేడ్ స్వరాజ్యం.

తన చిన్ననాడే అన్నను పోలీసులు వెంటాడుతుంటే పట్టుబడకుండా తప్పించింది. "నేను పాలేర్లకొక సంఘం పెట్టి, సమావేశం జరిపి, జీతాలు పెంచాలని, వెట్టి చాకిరీ చెయ్యబోమని, పనికి తగ్గ ప్రతిఫలమివ్వాలనీ డిమాండ్లు పెట్టాను. అది కుదరదంటే సమ్మెకు పిలుపిచ్చామని అప్పుడాయన చెప్పాడు. ఆ సమావేశం నచ్చని భూస్వాముల ఫిర్యాదుతో పోలీసులొచ్చారు. నేను వేరే చోట మొదలు పెడతాను. నువ్వు ఈ పోరాటం కొనసాగించు అన్నాడు. అన్న ఇచ్చిన ఆ పోరాట కర్తవ్యాన్ని నెరవేర్చే బాధ్యత తీసుకొంది. పాలేర్లకు అండగా తాను నిలబడింది. పని బంద్ చేయించింది. దీనితో ఆ గ్రామ భూస్వాముల అహంకారం దెబ్బతిన్నది. ఆనాడు వారిమాటే శాసనం. పాలేర్లను గ్రామ కూడలిలోని బొడ్రాయి వద్దకు పిలిపించారు. వారిపై దాడికి సిద్ధమయ్యారు. హంటర్‌తో కొట్టడానికి రడీ అయ్యారు. స్వరాజ్యం అక్కడకు వెళ్ళింది. "మీ చేతనైతే ముందు నన్ను కొట్టండి. తరువాత వాళ్ళ వంటిమీద చెయ్యి వేయండి" అని సవాల్ విసిరింది. స్వరాజ్యం పట్టుదల గమనించిన భూస్వాములు ఈ సమస్య ఎక్కడిదాకా వెళ్తుందో అని భావించి. ఇప్పుడు కుదరదులే, వీళ్ళ సంగతి తర్వాత చూద్దాం అని జారు కున్నారు.

అలా మొదలైన పోరాట జీవితంలో ఆమె ఏనాడు వెనుదిరిగి చూడలేదు. భూమికోసం, భుక్తికోసం, వెట్టిచాకిరి నుండి విముక్తి కోసం సాగిన వీర తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటంలో తనదైన పాత్ర నిర్వహించింది. ప్రపంచ విప్లవాల చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన ఆ పోరాటం దేశంలో భూ పంపకం సమస్యను ఎజండా మీదకు తెచ్చింది. నీ బాంచన్‌దొరా, కాల్మొక్తా, అన్న అర్ధబానిస లతో బందూకు పట్టించింది. వెట్టిచాకిరీ రద్దుచేయాలనీ, దున్నేవాడికే భూమి కావాలనే ప్రధాన నినాదాలతో సాగిందా పోరాటం. ఆ పోరాటంలో 4,000 మంది యువకిశోరాలు తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారు. 3,000 గ్రామాలలో గ్రామ స్వరాజ్యాన్ని స్థాపించి, దొరల గడీలను బద్దలు కొట్టి, 10 లక్షల ఎకరాల భూమిని పంచి, భూస్వాముల కోరలు తీసిందా పోరాటం.

కామ్రేడ్ స్వరాజ్యం ఆ పోరాటంలో ఒక ముఖ్యమైన భూమిక నిర్వహించింది. తన మాటతో, పాటతో ప్రజలను కూడగట్టింది. చరిత్రలో వీరనారులుగా చెప్పుకొనే రాణి రుద్రమ, ఝాన్సీ లక్ష్మీభాయి, సమ్మక్క-సారక్కలను తలపించింది. చిన్నతనంలో నేర్చుకొన్న గుర్రపు స్వారీని పోరాటంలో ఉపయోగించింది. కర్తవ్య నిర్వహణలో నదులు, వాగులు ఈదుకుంటూ ముందుకు సాగింది. సాయుధపోరులో కీలకమైన దళ కమాండర్ బాధ్యతను నిర్వహించటానికి సైతం సిద్ధమైంది. రాజక్క పేరుతో ఏడు సం॥ల అజ్ఞాత జీవితం గడిపింది. అందులో నాలుగున్నర సం॥లు తుపాకీతో సహజీవనం చేసింది. తనకంటే ముందే పోరుబాట పట్టిన ఆరుట్ల కమలాదేవి, తనతో పాటు పోరాటం సాగించిన చాకలి ఐలమ్మలతో కల్సి మహిళా దళాలు నిర్మించింది. నేటి ఖమ్మం జిల్లా, నాటి వరంగల్ జిల్లాలోని పిండిప్రోలులో తొలిదశలోనే 100 మంది మహిళలకు ఆయుధాలు ఉపయోగించడంలో శిక్షణ ఇప్పించారు. సైన్యంలో పనిచేసిన అనుభవం ఉన్న మేజర్ జైపాల్‌సింగ్, మంచికంటి రాంకిషన్‌రావు శిక్షకులుగా పని చేశారు. శిక్షణానంతరం నిజాంకు, రజాకారు సైన్యాలకు సింహస్వప్న మయ్యారు. యూనియన్ సైన్యాలకు కంటిమీద కునుకు లేకుండా చేశారు. అందుకే ఆమె ఇంటిని పూర్తిగా దహనం చేశారు. ఆ రోజుల్లోనే స్వరాజ్యాన్ని పట్టిస్తే 10,000 (నేడు సుమారు 10 కోట్లు) రూపాయలు ఇస్తామని నిజాం ప్రకటించాడు.

అయినా ఆమె ప్రజల మనిషి. నిత్యం ప్రజలనంటిపెట్టుకొనే ఉండేది. అందుకే ఆమెను కాపాడుకోవటం కోసం ప్రజలు కూడా ఏ త్యాగానికయినా సిద్ధపడేవారు. అలాంటి ఘటనలలో ఒక ఘటన గురించి కామ్రేడ్

(మిగతా 35వ పేజీలో)



epaper.prajasakti.com

## ఈ సంచికలో...


1. పోరాట స్ఫూర్తి ప్రదాత మల్లు స్వరాజ్యం

పోతినేని సుదర్శనరావు ......2

2. ఈ దశాబ్దపు మార్క్సిస్టు : ఐజాజ్ అహ్మద్

ప్రకాష్ కారత్ ......4

3. ప్రపంచీకరణ యుగంలో సాంస్కృతిక రంగం

ప్రొ॥ ఐజాజ్ అహ్మద్ .....5

4. గొప్ప మార్క్సిస్టు మేధావి, విప్లవకారుడు: ఐజాజ్

బి.వి.రాఘవులు .....10

5. ఆధునికానంతరవాదం : పూర్వాపరాలు

ప్రొ॥ ఐజాజ్ అహ్మద్ ........15

6. మహాజ్ఞాని, నిజమైన మార్క్సిస్టు మేధావి.

ప్రభాత్ పట్నాయక్ .....21

7. భారత్‌పై ఆధునికానంతరవాద ప్రభావం

ప్రొ॥ ఐజాజ్ అహ్మద్ ..........22

8. మౌర్య సామ్రాజ్య స్థాపన

ఎం.వి.ఎస్.శర్మ .......28

9. సమకాలీన సామ్రాజ్యవాద సంస్కృతులు

ప్రొ॥ ఐజాజ్ అహ్మద్ .......31



**సంపాదకుడు:**

**ఎస్.వెంకట్రావు**

**సంపాదక వర్గం:**

**పాటూరు రామయ్య**

**బి.వి.రాఘవులు**

**తమ్మినేని వీరభద్రం**

**ఎస్.వీరయ్య**

**తెలకపల్లి రవి**

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : ఎస్. వెంకట్రావు
**ఫోన్: ఎడిటర్ : 9490099333**

**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**మేనేజర్: కె.హరికిషోర్: 9490098977**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at : cpim.org


# జేజేలు

నరేంద్ర మోడీ నాయకత్వంలో జరుగుతున్న నయా-ఉదారవాద విధానాల దాడి నుండి కార్మికవర్గాన్నే కాకుండా రైతాంగాన్నీ, మొత్తం దేశ ప్రజానీకాన్నీ రక్షించేందుకు రెండు రోజుల పాటు జయప్రదంగా జరిగిన దేశవ్యాపిత కార్మిక సమ్మె భారతీయ కార్మికవర్గ మహత్తర ఐక్యతకు నిదర్శనంగా నిలిచింది. కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు దాదాపు 20 కోట్ల మంది కార్మికులు సమ్మె పోరాటంలో పాల్గొనడమే కాకుండా పలు రాష్ట్రాల్లో బంద్‌పాటించడం ద్వారా నయా-ఉదారవాద ఆర్థిక విధానాలనూ, క్రోనీ క్యాపిటలిస్టు లూటీని భారతీయ ప్రజానీకం ముక్త కంఠంతో వ్యతిరేకిస్తున్నదని లోకానికి చాటి చెప్పారు. 10 కేంద్ర కార్మిక సంఘాలు కార్మిక, రైతాంగ, సామాన్య ప్రజానీకానికి చెందిన 12 డిమాండ్ల సాధనకోసం ఇచ్చిన సమ్మెకు భారతావని స్పందించిన తీరు అంతర్జాతీయ దృష్టిని కూడా విశేషంగా ఆకర్షించి మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక, రాజ్యాంగ వ్యతిరేక, నిరంకుశ విధానాలను ఎండగట్టింది. ఇంతటి మహత్తర సమ్మెను జయప్రదంగా నిర్వహించిన భారత కార్మికవర్గానికి జేజేలు.

కార్పొరేట్ మీడియా సమ్మె వార్తలను పూర్తిగా తొక్కిపట్టి ప్రభు భక్తిని చాటుకుంది. కాస్తోకూస్తో వార్తలు ఇచ్చిన చోట వ్యతిరేకంగా ఇచ్చిందే మినహా కార్మికుల సమ్మె డిమాండ్ల వెనుక ఉన్న సమంజసత్వాన్ని ప్రజలకు వివరించడానికి ఏమాత్రమూ ప్రయత్నించలేదు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో ప్రభుత్వ యంత్రాంగం సమ్మెను అణచివేయడానికి శత విధాలా ప్రయత్నించింది. ఎస్మా బెదిరింపులకు పాల్పడింది. న్యాయ వ్యవస్థ కూడా సమ్మెను అడ్డుకోడానికి ఒక చేయి వేసిందని కేరళ హైకోర్టు ఇచ్చిన తీర్పు తెలియజేస్తోంది. రాజ్య వ్యవస్థలు వ్యతిరేకించినప్పటికీ కార్మికులు ఎంతో పట్టుదలగా రెండు రోజుల సమ్మెలో పాల్గొని పోరాట దీక్షను ప్రదర్శించారు. రైతాంగం, పట్టణ, గ్రామీణ ప్రజానీకం అనేక చోట్ల మద్దతు తెలపడం ద్వారా అపూర్వ ఐక్యతను ప్రదర్శించారు. ముఖ్యంగా బ్యాంకు, బీమా సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలు పూర్తిగా స్తంభించాయి. ఆర్థిక వ్యవస్థకు కీలకమైన విద్యుత్తు, పెట్రోలియం, బొగ్గు రంగాల్లో సమ్మె విజయవంతంగా జరిగింది. అనేక ప్రాంతాల్లో రోడ్డు రవాణా స్తంభించింది. మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, అస్సాం, హర్యానా, ఢిల్లీతో సహా అనేక రాష్ట్రాల్లో పారిశ్రామిక యూనిట్లు మూతపడ్డాయి. పోస్టల్‌తో సహా అనేక కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు. సుమారు 80 దేశాల్లో పనిచేస్తున్న భారతీయ నావికులు సమ్మెకు సంఘీభావం తెలపడం స్వాతంత్ర్య పోరాటం నాటి స్ఫూర్తి దాయకమైన రోజులను గుర్తుకు తెస్తున్నాయి.


దేశవ్యాపితంగా రెండు రోజుల పాటు ఇంత పెద్ద ఎత్తున సమ్మె జరగడం, అన్ని సెక్షన్ల శ్రామిక ప్రజానీకం నుండి ఇంత పెద్ద ఎత్తున సంఘీభావం రావడం నరేంద్ర మోడీ ప్రభుత్వ నయా-ఉదారవాద ప్రజా వ్యతిరేక విధానాల పట్ల ప్రజల్లో పెరుగుతున్న ఆగ్రహానికి నిదర్శనం. కళ్లుండీ చూడడానికి సిద్ధపడని, చెవులుండీ వినడానికి ఇష్టపడని నరేంద్ర మోడీ ప్రభుత్వానికి సమ్మె హెచ్చరిక గట్టిగానే తాకి ఉంటుంది. అయినప్పటికీ పట్టించుకోకుండా ప్రభుత్వం కార్మికులపైనా, రైతాంగంపైనా, సామాన్య ప్రజానీకంపైనా దాడులు కొనసాగిస్తే, దేశ వనరులను లూటీ చేసి క్రోనీల చేతుల్లో పెట్టే విధానాలను విడనాడకపోతే రానున్న కాలంలో పోరాటం మరింత ఉధృతం అయి తీరుతుంది. ఆకాశాన్నంటుతున్న ధరలు, పెరుగుతున్న నిరుద్యోగం, అసమానతలు, ఆకలి, దారిద్ర్యం, పీడన, నిరంకుశత్వం నుండి విముక్తి కల్పించే ప్రత్యామ్నాయ విధానాల కోసం మరింత ఐక్యతతో, మరింత పట్టుదలతో సుదీర్ఘ పోరాటాలకు కార్మికవర్గాన్ని సంసిద్ధం చేయాల్సిన బాధ్యత వామపక్ష, ప్రజల తంత్ర శక్తులపై ఉంది.



epaper.prajasakti.com

**నివాళి**

# ఈ దశాబ్దపు మార్క్సిస్టు : ఐజాజ్ అహ్మద్




రచయిత సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు

**ప్రకాష్ కారత్**

ఐజాజ్ అహ్మద్ ఇరవయ్యో శతాబ్దపు ద్వితీయార్థ భాగంలో గొప్ప మార్క్సిస్ట్ సిద్ధాంతకర్తలలో ఒకడు. ఆయన ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్‌లో భూస్వామ్య కుటుంబంలో జన్మించాడు. పన్నెండేళ్ల వయసులో కుటుంబంతో కలిసి పాకిస్థాన్‌కు వెళ్లారు. కాలేజీ విద్య అక్కడే సాగింది. పాకిస్తాన్‌లో కమ్యూనిస్టు పార్టీని నిషేధించిన సమయం అది. అక్కడ వామపక్ష ఉద్యమంలో క్రియాశీలకంగా వ్యవహరించారు. కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో అనేక ఆందోళనల్లో పాల్గొన్నారు.

ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లారు. అక్కడ యూనివర్సిటీ టీచర్‌గా చేరారు ఆయన గాలిబ్‌పై మొదటి వ్యాసం రాశారు. అక్కడి నుంచి విమర్శనాత్మక సాహిత్య వ్యాసాల పరంపర మొదలైంది. అనతి కాలంలోనే అమెరికన్ అకడెమిక్ కమ్యూనిటీలో మార్క్సిస్ట్ సిద్ధాంతకర్తగా గుర్తింపు పొందారు. సాంస్కృతిక అధ్యయనంపై కూడా గట్టి పట్టు సంపాదించారు. మార్క్సిస్ట్ సిద్ధాంతాలపై ఆధారపడిన విమర్శనాత్మక సాహితీ విమర్శకుడిగా పేరొందారు.

భారతదేశానికి రాకముందు, ఆయన 'ఇన్ థియరీ: క్లాసెస్, నేషన్స్ అండ్ లిటరేచర్' అనే పుస్తకాన్ని రాశారు. సోవియట్ యూనియన్ పతనం తర్వాత వచ్చిన ప్రసిద్ధ మార్క్సిస్ట్ గ్రంథంగా ఇది నిలిచింది. మార్క్సిజం అప్రస్తుతమని, మనకు కొత్త సిద్ధాంతాలు అవసరమని వాదించే పోస్ట్ మాడర్నిజం వంటి అన్ని పోస్ట్-మార్క్సిస్ట్ సిద్ధాంతాలను ఇది ఖండించింది.

80, 90 దశకాలలో పశ్చిమ దేశాలలో పోస్ట్ మోడర్నిజాన్ని విద్య, అకడమిక్ క్యాంపస్‌లలో పోస్ట్ మాడర్నిజం ఒక ఆధిపత్య భావజాలంగా చలామణిలో ఉంది. మార్క్సిస్ట్ సిద్ధాంతాన్ని సమర్థిస్తూ పోస్ట్ మోడర్నిజంలోని లోపాలు, బలహీనతలను ఎత్తి చూపడం ద్వారా మార్క్సిజాన్ని సమకాలీన సందర్భాలతో ముడిపెట్టడం ద్వారా ఐజాజ్ అహ్మద్ చేసిన కృషి ప్రశంసనీయం.

ఇజాజ్ ఇండియాలోనే ఉండాలనుకున్నారు. భారతదేశంలో జన్మించిన ఆయన తనను తాను భారతీయుడిగా భావించారు. 1991 నుండి 2014 వరకు ఇరవై ఐదు సంవత్సరాలు భారతదేశంలో గడిపారు. ఈ కాలంలో గొప్ప రచనలు చేశారు. సోవియట్ అనంతర ప్రపంచంలో సామ్రాజ్యవాదం లేదని వాదించిన కాలం అది. సామ్రాజ్యవాదం లేని ఏకధ్రువ ప్రపంచ భావన బలంగా ఉన్న కాలం అది. సామ్రాజ్యవాదం ప్రపంచంపై ఎలా ఆధిపత్యం చెలాయిస్తున్నదో బయటపెడుతూ ఆయన అనేక వ్యాసాలు, పుస్తకాలు రాశారు.. ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్ లపైన, అలాగే ఇతర సామ్రాజ్యవాద దండయాత్రల గురించి విశ్లేషణాత్మక వ్యాసాలు రాశారు. ఆధునిక సామ్రాజ్యవాద లక్షణాలను ఐజాజ్ అద్భుతంగా వివరించాడు.

ఆయన భారతదేశంలోని రాజకీయ, సామాజిక మార్పులను అధ్యయనం చేశారు. హిందుత్వ భావనలోని లక్షణాలను ముందుగా విశ్లేషించి, దాని పిండం ఫాసిజం అని తేల్చారు. భారతదేశంలోని హిందుత్వ ధోరణిని ఇటాలియన్ ఫాసిజంతో పోల్చారు.. జర్మనీ వంటి ఆధునిక పెట్టుబడిదారీ దేశం కానప్పటికీ ఇటలీలో ఫాసిజం మొలకెత్తింది. ఇటలీలో ఫాసిజం అభివద్ధికి దారితీసిన అనేక సామాజిక, సాంస్కృతిక అంశాలు భారతదేశంలో ఉన్నాయని ఆయన ఎత్తి చూపారు.

1992లో బాబ్రీ మసీదు కూల్చివేతకు గురైనప్పుడు ఆయన 'అయోధ్య శిథిలాల మీద' అనే వ్యాసం రాశారు. తక్కువ అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశంలో కూడా ఫాసిజం వచ్చే ప్రమాదముందని హెచ్చరించారు. గుత్తాధిపత్య పెట్టుబడిదారీ విధానం సంక్షోభంలో చిక్కుకున్న సమయంలో ఫాసిజం పుడుతుంది. ఇలాంటి పరిస్థితుల్లోనే పాలకవర్గం లేదా బూర్జువా వర్గం ఫాసిజం వైపు మొగ్గు చూపుతుంది. అయితే, ఫాసిజం ఇటలీ వంటి తక్కువ అభివద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలలో పుట్టిందని, దాని సంకేతాలు భారతదేశంలో కూడా స్పష్టంగా కనిపిస్తున్నాయని ఐజాజ్ ఎత్తి చూపారు.

ప్రపంచ పెట్టుబడిదారీ విధానం యొక్క వ్యవస్థాగత సంక్షోభానికి, ప్రపంచవ్యాపితంగా మితవాద శక్తులు తలెత్తుతుండడానికి మధ్య లింకును వివరించారు.. ఈ అంశంపై అనేక వ్యాసాలు పుస్తకాలు రాశారు. ఫ్రంట్‌లైన్ పత్రికలో ఆయన వ్యాసాలు పరంపరగా వచ్చాయి. మార్క్సిస్ట్ భావజాలం, వామపక్షాలు ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి సమావేశాలు సదస్సుల్లో మాట్లాడారు. అన్నిటినీ కలిపి చూస్తే, ఐజాజ్ నిస్సందేహంగా అద్భుతమైన మార్క్సిస్ట్ సిద్ధాంతకర్త, ప్రముఖ ఆలోచనాపరుడు.

ఐజాజ్ అహ్మద్ చిన్నతనంలో పాకిస్తాన్ పౌరుడిగా మారవలసి వచ్చింది. భారత ప్రభుత్వం ఇక్కడి చటాల వల్ల ఆయనకు పౌరసత్వం లభించలేదు. వీసా సాయంతో భారత్‌లో కొంత కాలం ఉన్నారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, దీర్ఘకాలిక వీసాపై ఉండేందుకు అనుమతించబోమని చెప్పడంతో 2014లో అమెరికాకు వెళ్లి, కాలిఫోర్నియా యూనివర్సిటీలో అధ్యాపకుడిగా మళ్లీ మారారు. గత ఎనిమిదేళ్లుగా, ఐజాజ్ తన మాతభూమి నుండి తనను తాను ప్రవాసిగా ఉండాల్సి వచ్చింది. అమెరికాలో ఉన్న సమయంలో చివరి దాకా రాయడం, ఉపన్యాసాలు ఇవ్వడం తరగతులు బోధించడం వంటివి కొనసాగించిన ఐజాజ్ అహ్మద్ ధన్యజీవి. ❀



epaper.prajasakti.com



# ప్రపంచీకరణ యుగంలో సాంస్కృతిక రంగం

ప్రొ॥ ఐజాజ్ అహ్మద్

వార్తల వాణిజ్యీకరణ యొక్క అంతర్జాతీయీకరణ రూపాలను మనం ప్రధానంగా క్రీడారంగంలో గమనించవచ్చు. దీనికి ఉదాహరణగా క్రికెట్‌ను చూడవచ్చు. క్రికెట్ నేడు ఒక ఆటగా ఉన్న స్థితి పోయి బ్రహ్మాండమైన టీవీ దృశ్యంగా మారడం ఈ ప్రపంచీకరణ కాలంలోనే- అంటే ఇంతకుముందు చెప్పుకున్న సామ్రాజ్యవాదపు తాజా ఘట్టమైన ఈ పాతికేళ్ళలోనే. ఇప్పుడది అచ్చంగా అమెరికన్ బేస్‌బాల్ మాదిరిగా తయారై కూర్చుంది. లక్షల కోట్ల రూపాయలు కురిపించే బహుళజాతి క్రీడగా మారిపోయింది. మీరు టీవీలో క్రికెట్ చూసేట్లయితే దాన్ని చిన్న చిన్న ముక్కలుగా చేసిన తీరు అర్థమవుతుంది. కచ్చితంగా చెప్పాలంటే ఆరు బాల్స్. మీరు దాని గురించి చూసేది, వినేది అంతే. ప్రతి ఓవర్ పూర్తి కాగానే కామెంట్రీ ఆగిపోతుంది. వెంట వెంటనే అడ్వర్టయిజ్‌మెంట్లు దర్శనమిస్తాయి. వికెట్ పడిపోతే చాలు ఎవరి వికెట్ అయినా సరే. దాంతో కార్పొరేట్ పంట పండుతుంది. ఎందుకంటే ఆ స్థానంలో మరో బ్యాట్స్‌మెన్ వచ్చే వరకూ అడ్వర్టయిజ్‌మెంట్ల వరద. నిజంగానే మీరు అడ్వర్టయిజ్‌మెంట్లు లేకుండా క్రికెట్‌ను చూడటమనే ప్రసక్తి ఉండదు. ఎందుకంటే ప్రతి ఆటగాడి శరీరంపైనా ఏదో ఒక అడ్వర్టయిజ్‌మెంట్ ఉంటుంది. అతని దుస్తులకు అది అతికించి ఉంటుంది. చాలా విజయవంతమైన ఆటగాళ్ళు, ఉదాహరణకు టెండూల్కర్ వంటి వారైనా సరే. నేను ఆ అడ్వర్టయిజ్‌మెంట్లను ధరించబోను అని తిరస్కరించడం ఊహకందని విషయం. ఈ కార్పొరేట్ స్పాన్సర్‌షిప్ లేకపోతే ఒక టెస్ట్ కూడా నడవదు. మొత్తం మైదానమంతా భారీ అడ్వర్టయిజ్‌మెంట్ బోర్డుల మయమై పోతుంది. ఇప్పుడు సామ్రాజ్యవాదం ప్రత్యేకించి అమెరికా సైనిక, ఆర్థిక బలం ఇందులో ప్రత్యక్షంగా పాత్ర వహించకపోవచ్చు. కాని పెట్టుబడిదారీ విధానపు తాజా ఘట్టంగా సామ్రాజ్యవాదం ఈ మొత్తం ప్రక్రియ అడుగడుగునా ఉండనే ఉంటుంది. అమ్మకము, కొనుగోళ్ళు, సరుకులు, ధనార్జనకు సంబంధించిన చైతన్యం వీటన్నింటిలోనూ ఇది దర్శనమిస్తుంది. ఇదంతా క్రీడల పేరుతో చెలామణీ అవుతుంది. ఇది పూర్తిగా అమెరికా నుంచి ఎరువు తెచ్చుకున్నదే. నా ఉద్దేశంలో చెప్పాలంటే భారతదేశంలో క్రికెట్ ఆడే లక్షలాది మంది పిల్లలు ఆటమీద ప్రేమతో కాక ఒక భ్రమతో ఆడుతున్నారు. తాము నిజంగా ధోనీ లాగానో, సెహ్వాగ్‌లాగానో తయారై అన్ని సరుకుల పైనా, టీవీ తెరపైనా, అడ్వర్టయిజ్‌మెంటు బోర్డుల పైనా ప్రచారం చేస్తున్నామనీ, ఈ ప్రచారంలో కోట్ల రూపాయలు కూడగట్టుకుంటున్నామని వారు ఊహా జగత్తులో తేలిపోతున్నారు.

సంస్కృతి, నాగరికత అన్నప్పుడు చాలామంది మనం కళ, విద్య రంగాలలో చూసే ఉన్నతస్థాయి విషయాలతో దాన్ని అనుసంధానించుకుంటారు. శాస్త్రీయ సంగీతం, మహత్తరమైన శిల్ప సంపద, నిర్మాణ కౌశలం, ఆధ్యాత్మిక సాంప్రదాయాలు వగైరాలను దృష్టిలో ఉంచుకుంటారు. క్లుప్తంగా చెప్పాలంటే అవన్నీ ఉన్నత సంస్కృతికి గొప్ప సంప్రదాయం అని మనం భావిస్తాము. కాని ఏ సమాజంలో అయినా సరే ఈ గొప్పదనమంతటినీ నిజంగా ప్రభావితం చేసే శక్తివంతమైన అంశాలు అవే. ఈ గొప్పతనం, ఈ ఉన్నత సాంస్కృతిక సీమలు స్వతహాగానే అల్ప సంఖ్యాకులకు పరిమితమై ఉంటాయని నా వాదన. ఒక సమాజంలోని అల్ప సంఖ్యాకుల సంస్కృతులు గతం నుంచి విస్తారమైన సాంస్కృతిక సంపదను వారసత్వంగా స్వీకరిస్తాయి. ఈ అల్ప సంఖ్యాకులు చాలా వరకు సమాజంలోని ధనాఢ్య వర్గాలకు చెందినవారై ఉంటారు. ఆ వివరాలు చర్చించే ముందు మాస్ మీడియా, క్రీడల గురించి మరికొన్ని వివరాలు చర్చించుకోవచ్చు. ఆధునిక పెట్టుబడిదారీ సమాజంలో అవే అతి పెద్ద ప్రభావ క్షేత్రాలుగా ఉన్నాయి. వర్గ సరిహద్దులకు అతీతంగా ప్రజా బాహుళ్య చైతన్యాన్ని ప్రభావితం చేస్తున్నవి. ప్రజా బాహుళ్య సంస్కృతి, జనరంజక సంస్కృతి అన్నప్పుడు నిజమైన అర్థం ఇదే. స్పష్టంగా చెప్పాలంటే అవి ఒకే కేంద్రం నుంచి రూపొందించబడతాయి. కార్పొరేట్ పెట్టుబడి వాటిని నడిపిస్తుంది. ఇందులో బహుళజాతి పెట్టుబడి కూడా ఉంటుంది. అయితే వాటి తాలూకు దీర్ఘకాలిక ప్రభావం ఉన్నత వర్గాలకు చెందిన అల్ప సంఖ్యాకులపైనే గాక, విస్తారమైన జనబాహుళ్యంపైన, శ్రామిక వర్గంపైన కూడా పడుతుంది.

ఇప్పుడు పెట్టుబడి ముట్టుకోకుండా వదిలిపెట్టిన రంగం ఒక్కటైనా లేదు. క్రికెట్‌కు వర్తించేదే ఉన్నత సంస్కృతిగా చెప్పబడే రంగాలకు కూడా వర్తిస్తుంది. ఉదాహరణకు ఎం.ఎఫ్. హుస్సేన్, డిసౌజా లేదా రాజా వంటి వారు సృష్టించే ఆధునిక నైరూప్య చిత్రకళను తీసుకోండి. వారు సృష్టించే కళాఖండాలు అదే సమయంలో పెట్టుబడిదారీ సరుకులుగా అంతర్జాతీయ కళా మార్కెట్‌లో చెలామణి అవుతాయి. అత్యాధునిక ఫ్యాషన్ రంగానికి చెందిన మార్కెట్‌లో ఫ్రెంచి డిజైనర్ల సంతకాలకు ఎంత విలువ ఉంటుందో చిత్రకళలో వీరికి అంతే ఉంటుంది. ఇటీవల కాలంలో కొద్ది మంది భారతీయ చిత్రకారులు అంతర్జాతీయ మార్కెట్‌లో ఆధిక్యత సంపాదించడం వల్ల భారతదేశంలో కూడా దానిపట్ల ఆకర్షణ పెరిగింది. అంతకంతకూ ఎక్కువమంది భారతీయ చిత్రకారులు ఈ మార్కెట్‌లో పాలు పంచుకుంటున్నారు. ఇప్పుడు చాలామంది యువత చిత్రకళాశాలల్లో చేరడం లేదా చిత్రకారులుగా తయారవ్వాలని



epaper.prajasakti.com

కోరుకోవడం ఈ మార్కెట్ తాలూకు విపరీత ఆకర్షణ కారణంగానే జరుగుతోంది. ఇప్పుడు ప్రపంచ చిత్రకళా మార్కెట్ వివిధ ప్రాంతాలలోని చిత్రకారులను ఆకర్షిస్తున్నది. ఎలాంటి కళ సృష్టించబడుతున్నదనేదాన్ని అంతకంతకు ఎక్కువగా ఈ కళా మార్కెట్ శాసిస్తున్నది.

నిజంగానే ప్రతిదీ అంతర్జాతీయాక రించబడింది. మతాన్నీ రాజకీయలానూ కలిపివేసే ప్రమాదకర ధోరణి కూడా అంతర్జా తీయాకరించబడింది. సంస్కృతినీ, నాగరికతనూ సంరక్షించే యుద్ధంగా దీన్ని అభివర్ణిస్తున్నారు. ఉదాహరణకు ఆర్ఎస్ఎస్‌ను తీసుకకంటే అది రాజకీయ అధికారాన్ని చేజిక్కించుకునేందుకు ఒక క్రమపద్ధతిలో పనిచేసింది. అయినా అది తనను తాను సాంస్కృతిక సంస్థగానే చెప్పుకుం టుంది. ఆర్ఎస్ఎస్ కూటమిలో ద్వితీయ శక్తిగా వున్న విశ్వహిందూ పరిషత్ తనను తాను భారతీయమైందిగా కాక హిందువుల ప్రపంచ కూటమిగా చెప్పుకుంటుంది. అనేక దేశాలలో దానికి శాఖలున్నాయి. విదేశాల నుండి, ముఖ్యంగా అమెరికా, బ్రిటన్‌లలో స్థిరపడిన ఎన్ఆర్ఐల నుండి దానికి భారీగా విరాళా లందుతాయి. మత ప్రేరేపణ, సామ్రాజ్య వాదాల కలయికకు సంబంధించి ఇంకా ఉదాహరణలున్నాయి. ఆఫ్ఘనిస్తాన్‌లో ఏర్పడిన కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని కూలద్రోసేందుకు అమెరికా ఇస్లామిక్ జీహాద్ పేరుతో దొంగచాటు యుద్ధం ప్రారంభించింది. 1970 యుద్ధం తరువాత అమెరికా ఇండోనేషియా నుండి అల్జీరియా వరకు గల 12 దేశాల నుండి 40వేల మంది ముస్లిం యువకులను సమీకరించింది. వారికి సౌదీ అరేబియా, కువైట్ వంటి దేశాలు పెట్టుబడి పెట్టాయి. అమెరికా సామగ్రితో పాకిస్తాన్‌లో శిక్షణ లభించింది. వీరంతా ఆఫ్ఘన్‌లో ఏర్పడిన సరికొత్త కమ్యూనిస్టు ప్రభుత్వంపై దాడికి మరలారు. ఆఫ్ఘనిస్తాన్‌లో కమ్యూనిస్టు ప్రభుత్వం కూలిపోయాక అధికారం చేపట్టిన తాలిబాన్‌లు సామ్రాజ్యవాదం సృష్టిం చిన ఈ జిహాదీ యంత్రాంగం నుంచి పుట్టిన వారే. ఆ యంత్రాంగంలోని కొన్ని భాగాలు కాశ్మీర్ తిరుగుబాటులో కూడా పాల్గొన్నాయి. కాశ్మీర్‌లో వాస్తవానికి ఉన్నది అచ్చమైన సూఫీ సంస్కృతి. అది అత్యంత సహనశీలమైన శాంతియుత ఇస్లాం. అలాంటి చోట ఇస్లాం సంస్కృతిని శుద్ధం చేసే పేరిట అత్యంత సనాతనమైన, భయానకమైన సున్నీ ఛాందసాన్ని ప్రవేశపెట్టారు. మధ్య ఆసియాలోనూ, చెచెన్యా, బోస్నియా వగైరా చోట్ల ఇస్లాంను శుద్ధి పరిచే పేరిట ఈ జిహాదీలనే అమెరికా రహస్యంగా పంపించింది. మరో విధంగా చెప్పాలంటే ఎక్కడెక్కడ సోషలిస్టు సమాజాలు నిర్మించే ప్రయత్నం జరిగిందో అక్కడికంతా వీరిని తరలిం చింది. అమెరికన్ సిఐఎ సృష్టించిన ఈ అంతర్జాతీయ టెర్రరిస్టు దళం ఆ తరువాత కాలంలో అమెరికాకే వ్యతిరేకంగా తయారైంది. దాంతో పరిస్థితి మారింది. ఇందిరాగాంధీ సృష్టించిన బింద్రన్‌వాలే ఆమెకే అడ్డం తిరిగిన పరిస్థితి వంటిదే ఇది. ఈ మార్పు తరువాత అమెరికా వైఖరి కూడా తలక్రిందులైంది. ఒకప్పుడు రోనాల్డ్ రీగన్ ఆఫ్ఘన్ జిహాద్ నాయకులను అమెరికా టీవీలో పరిచయం చేస్తూ తమ దేశ వ్యవస్థాపక పితామహులతో సమానమైన నైతిక శక్తులుగా వారిని అభివర్ణించాడు. జఫర్సన్, వాషింగ్టన్‌లతో సమాన నైతిక శక్తులుగా చెప్పబడిన వీరు అమెరికాకే అడ్డం తిరిగిన తరువాత జార్జి బుష్ వారిని ఇస్లామిక్ ఫాసిస్టులుగా పిలవడం మొదలుపెట్టాడు. మనుషుల అంతర్గత విశ్వాసాలలో అతి పవిత్రమైనదిగా పరిగణించబడుతూ, ఒకరి సాంస్కృతిక అస్తిత్వాన్ని నిర్దేశించే మతం అనేది నేడు యుద్ధం-సామ్రాజ్యం యొక్క ఆటలో ప్రధాన అంశంగా తయారై కూర్చుంది.

సంస్కృతి, నాగరికత అనే పదాలు గతంలో చర్చించబడిన సందర్భాన్నీ, ఈ ప్రపంచీకరణ యుగంలో అవి మారిపోయిన తీరునూ ఇప్పుడు చూద్దాం. ప్రతి సంస్కృతికీ, ప్రతి నాగరికతకూ కొన్ని నిగూఢమైన, ప్రత్యేకమైన లక్షణాలు ఉంటాయని గతంలో భావించేవారు. ఇప్పుడు ప్రత్యేకించి ప్రపంచీకరణ ఒత్తిడి ఫలితంగా ఆ విధంగా ప్రత్యేకమైన స్వయం చలితమైన వ్యక్తిగత సంస్కృతికి తిలోదకాలివ్వ బడ్డాయి. అయితే ఈ పని అనేక విధాలుగా జరిగింది. జాతీయ సంస్కృతులు అన్న వాటిని వ్పుడు ఉపజాతులుగా సంబోధిస్తున్నారు. దీని దిగువన అనేక స్థానిక సంస్కృతులు ఉంటాయి. ఉపజాతి అన్న పదానికి ప్రస్తుత అర్థం ఇచ్చినవారు అమెరికా సామాజిక శాస్త్రజ్ఞులు. దానికే ఉపజాతీయత అని పేరు పెట్టారు. ప్రస్తుత ప్రపంచంలో తన హంగుదారుల ద్వారా అత్యధిక ప్రభావం ప్రసరిస్తున్న దేశం అదే. అయితే అమెరికా బలగంలో అన్ని దేశాల నుంచి తీసుకురాబడిన వారు ఉంటారు. వీరికి అక్కడ శిక్షణ ఇచ్చి తిరిగి ఆయా దేశాలలో ఉన్నత స్థానాలు అలంకరించేందుకు పంపిస్తూ ఉంటారు. అలాగే ఫోర్డ్ ఫౌండేషన్ వంటి సంస్థలు కూడా ఉంటాయి. ఇవన్నీ ఉపజాతీయ తకు ప్రోత్సాహం ఇస్తామంటాయి. దాంతో ఇప్పుడు ఉపజాతి బృందాలు మాత్రమే కాక ఉపజాతి ఆహారం, ఉపజాతి వస్త్రాలు వగైరా కూడా వచ్చాయి. ఇక సంపన్న వర్గాలు భిన్నత్వంలో ఏకత్వం అనే మహత్తర రాజకీయ దార్శనికతతో ఈ వివిధ ఉపజాతులకు సంబంధించిన వాటిని వినియోగ వస్తువులుగా వాడుతుంటాయి. దేశీయంగా వివిధ ఉపజా తుల వస్తువులను వాడే ఈ పద్ధతి వినియోగ తత్వంతో విడదీయరానంతగా పెనవేసుకు పోతుంది. ఆ తర్వాత విలాసవంతమైన సరుకు లను దిగుమతి చేసుకోవడం సాంస్కృతిక బహు దేశీయతకు సంకేతమవుతుంది. ఈ విధంగా అంతర్జాతీయ స్థానిక అంశాలు రెండూ సరుకుకు రెండు ముఖాలై కూర్చుంటాయి.

ఇదే ధోరణికి మరికొన్ని ప్రతిస్పం దనలు కూడా వున్నాయి. అమెరికా ఉదారవాద సామాజిక శాస్త్రజ్ఞుడు లూయిస్ మమ్‌ఫోర్డ్ 40 ఏళ్ళ క్రిందట మనకు ప్రపంచ కుగ్రామం అనే ప్రసిద్ధ పదాన్ని అందించాడు. విశ్వ సహజీవన సమిష్టి క్షేత్రానికి ఇది సంకేతం. సోవియట్ యూనియన్‌లోనూ, వార్సా సంధి దేశాలలోనూ, యుగోస్లోవేవియాలోనూ కమ్యూనిస్టు ప్రభుత్వా లు కూలిపోయాయి. వాటితో పాటే ఏకధృవ ప్రపంచం వంటి కొత్త పదాలు కూడా పుట్టు కొచ్చాయి. ఇది అమెరికా ఆర్థిక, సైనిక ఆధి పత్యం నీడలో కొత్త తరహా ఏకీకరణకు సంకేతం. 1980వ దశకం మధ్య కాలం వరకు పెద్దగా వాడకంలో లేని ప్రపంచీకరణ అనే పదం తర్వాత- నయా ఉదారవాదం గత 20 ఏళ్ళ లోనూ ఒక్కో దేశాన్ని ఆక్రమిస్తున్న కొద్దీ- బాగా చెలామణీలోకి వచ్చింది. ఈ భావాలన్నింటిలో ఆంతర్యం ఒక్కటే. ప్రపంచం మహత్తర ఐక్యత, స్వేచ్ఛల వైపు నడుస్తున్నదన్నమాట. మార్క్సిస్టులు, కమ్యూనిస్టులు మినహా మిగిలిన వారందరు కూడా ఇలాగే భావించారు. కమ్యూనిస్టు ప్రభు త్వాలు అదృశ్యమయ్యాయి గనుక మనం ఉదార వాద పెట్టుబడిదారీ సమైక్య ఏకీకృత ప్రపంచంలో జీవిస్తున్నామని చెబుతున్నారు.

కానీ వాస్తవంలో సోవియట్ యూని



epaper.prajasakti.com

యన్ కుప్పకూలిన వెనువెంటనే 1992లోనే ఆ భావం సవాలు చేయబడింది. మితవాది, మంచి పలుకుబడి గల అమెరికన్ సామాజిక శాస్త్రజ్ఞులు శామ్యూల్ హంటింగ్‌టన్ నాగరికతల యుద్ధం అనే తన పుస్తకంలో దాన్ని సవాలు చేశారు. అందులో ఆయన సంస్కృతి – నాగరి కత అన్న పదాలను సమాన అర్థంలో వాడాడు. ప్రపంచం కొన్ని నిర్దిష్ట నాగరికతలుగా విభజింప బడిందని చెప్పారు. 21వ శతాబ్దంలో యుద్ధాలు రాజకీయ, ఆర్థిక విషయాల పైన గాక సాంస్కృతిక రంగ సమరాలుగా జరుగుతా యన్నాడు. మరీ ముఖ్యంగా ఆయన ఇస్లామిక్, కన్ఫ్యూషియస్ నాగరికతలను పాశ్చాత్య దేశాల యూదు, క్రైస్తవ నాగరికతలకు అత్యంత శత్రు పూరితతమైనవిగా పరిగణించాడు. 20వ శతాబ్దం పొడుగునా పెట్టుబడిదారీ విధానానికీ, కమ్యూనిజానికీ మధ్యలో భీకర పోరాటం నడిచినట్లే ఇప్పుడు వీటి మధ్య భీషణ సంగ్రామం సాగుతుందని జోస్యం చెప్పాడు. ఈ విశ్లేషణలో ఇజ్రాయిల్ యూదు దేశం గనుక పాశ్చాత్యంలో భాగమైపోయింది. ఇప్పుడు సవాలు చైనాలో అమలులో వున్న కన్ఫ్యూషియనిజం నుంచి వస్తుందన్నమాట. అంటే ఆర్థిక సామర్థ్యం పెంచుకుని అమెరికాను సవాలు చేస్తున్న చైనా, చమురు సంపన్నమైన దేశాలు గల ఇస్లాం శత్రువులుగా పరిగణించబడ్డాయి. పశ్చిమాసియా, ఉత్తర ఆఫ్రికా, కాస్పియన్ తీరం, ఇండోనేషియా కూడా. ఈ నాగరికతల చిత్రణ లో ఇండియా కేవలం హిందూ నాగరికతగా మారిపోయింది. ఈ హిందూ నాగరికత యూదు, క్రైస్తవ కూటమికి వ్యతిరేకమని చెప్పబడలేదు. అదే సమయంలో ఇండియాలోని హిందూయేతరుల సంగతేమిటో మాత్రం అది మాట్లాడలేదు. ఏమైనా ఇక్కడ గమనించవలసిన విషయం ఏమంటే అమెరికా విధాన నిర్ణేతల వ్యవస్థలో హంటింగ్‌టన్ ఒక కీలక వ్యక్తి. ఆయన ప్రధాన లక్ష్యం ఏమంటే ఇప్పటికే సోవియట్ యూనియన్ కూల్చివేత పూర్తయింది గనుక ఇక పెరుగుతున్న చైనా శక్తిని అమెరికా అడ్డుకోవాలని చెప్పడమే. అలాగే ప్రపంచంలోని చమురు, సహజవాయువు నిక్షేపాలను కైవసం చేసుకునేందుకు సిద్ధం కావాలి. అవి ప్రధానంగా ముస్లిం జనాభా ఎక్కువగా వున్న దేశాలలో ఉన్నాయి. అయితే సామ్రాజ్యవాద విస్తరణకు సంబంధించిన ఈ ఘరానా సిఫార్సులు, సంస్కృ తి – నాగరికతల పరిభాషలో వినిపించడమే విశేషం.

> “ సంస్కృతినీ, నాగరికతనూ మతంతో సరిసమానంగా చెప్పడం నాకు అర్థంలేనిదిగా కనిపిస్తోంది. ఉదాహరణకు యు.పి.లోని ముస్లింలు, కేరళలోని ముస్లింలు ఒకే ముస్లిం సంస్కృతికి చెందినవారని చెప్పడం కుదరదు. వారు మాట్లాడే భాష ఒకటి కాదు. తినే తిండి, వేసుకునే వస్త్రాలు ఒకటి కాదు. వారి మధ్య వివాహ సంబంధాలు కూడా వుండవు. రోజువారీ ఆచారాలు కూడా భిన్నంగా ఉంటాయి. ఇవన్నీ ఆయా ప్రాంతా'లోని ముస్లింయేతరులకు దగ్గరగా ఉంటాయి. ”

సంస్కృతినీ, నాగరికతనూ మతంతో సరిసమానంగా చెప్పడం నాకు అర్థంలేనిదిగా కనిపిస్తోంది. ఉదాహరణకు ఎలాంటి సామాజిక, మానవ శాస్త్ర ప్రమాణాన్ని ఉపయోగించి నప్పటికీ యు.పి.లోని ముస్లింలు, కేరళలోని ముస్లింలు ఒకే ముస్లిం సంస్కృతికి చెందినవారని చెప్పడం కుదరదు. వారు మాట్లాడే భాష ఒకటి కాదు. తినే తిండి, వేసుకునే వస్త్రాలు ఒకటి కాదు. వారి మధ్య వివాహ సంబంధాలు కూడా వుండవు. రోజువారీ ఆచారాలు కూడా భిన్నంగా ఉంటాయి. ఇవన్నీ ఆయా ప్రాంతాల లోని ముస్లింయేతరులలకు దగ్గరగా ఉంటాయి. కేరళలో వివిధ మతాలకు చెందిన ప్రజా సమూహాల మధ్య సాంస్కృతిక సమానత 80 శాతం వరకు ఉంటుందని భారతదేశ మానవ శాస్త్ర పరిశోధన చెప్పింది. అలాగే యు.పి.లోని మత బృందాలలో కూడా. కానీ ఈ రెండు చోట్లా ఉంటున్న ముస్లింల మధ్య సాంస్కృతిక పరమైన ఉమ్మడి అంశాలు 20 శాతం కన్నా తక్కువే. ఈ దేశంలో హిందూ మతతత్వం దారుణంగా, విషపూరితంగా వ్యాపించి వున్నప్ప టికీ వివిధ ప్రాంతాల ముస్లింలు ఏవో కొన్ని మత విషయాలలో తప్ప ఎలాంటి ఉమ్మడి లక్షణాలు ప్రదర్శించరు. ఇది నాగరికత బృందా లకు కూడా వర్తిస్తుంది. భారతీయ ముస్లింలకు, సూడాన్ లేదా నైజీరియాలోని ముస్లింలకు మతం తప్ప వేరే ఉమ్మడి అంశం ఏమీ ఉండదు. కానీ నాగరికమైన ప్రతిదీ భారతీయ హిందువులతో ఉమ్మడిగా ఉంటుంది.

ఆధునిక ప్రపంచంలోని ఇతర రంగాలలో కూడా మతానికీ, సంస్కృతికీ మధ్య సంబంధం చాలా బలహీనంగా ఉంటుంది. ఇదివరకు నేను హుస్సేన్, డిసౌజాల చిత్రాల గురించి మాట్లాడాను. వారు భారతీయ సంస్కృతిలోని గత, ప్రస్తుత అంశాల నుంచి ముడివనరులు తీసుకోవచ్చు. కాని వారి కళాఖండాలను ఇస్లామిక్, క్రైస్తవ నాగరికతలతో సమానంగా చూడటం సాధ్యం కాదు. మరో వైపున వారి చిత్రాలు ఆధునిక చిత్రకళకు సంబంధించిన అంతర్జాతీయ వ్యవస్థలో బాగా ఇమిడిపోతాయి. బాంబే నుంచి బోరాడా వరకు, పారిస్ నుంచి న్యూయార్క్ వరకు, టోక్యో నుంచి సావో పోలో వరకు ఇదే కనిపిస్తుంది. భారత దేశంలోని ఉన్నత విద్యా సంస్థలలో బోధన, పరిశోధన ప్రపంచంలోని ఇలాంటి ఇతర సంస్థ లకు, చాలా సంస్థలకు దగ్గరగా ఉంటుంది తప్ప హిందూ నాగరికతకు వ్యక్తీకరణగా కనబడదు.

ఇవన్నీ దృక్పథానికి సంబంధించిన ఒక అంశంతో ముడివడివున్నాయని చాలా గట్టిగా చెప్పదలిచాను. ఆ అంశం ఏమిటో చెప్తాను. సోవియట్ యూనియన్ కుప్పకూలి పోవడం, చైనాలో పెట్టుబడిదారీ విధానం పునరుద్ధరణ జరిగిన తర్వాత ఇప్పుడు సరుకుల ఉత్పత్తి ప్రపంచ సూత్రంగా మారిన శకంలో ప్రవేశించాము. నయా ఉదారవాద ప్రపంచీకరణ సాగుతున్నది. ఈ యుగంలో ప్రపంచ మార్కెట్ గ్రామీణ ప్రాంతాలలోకి కూడా లోతుగా చొరబడుతున్నది. ఈ దశలో సినిమాలు, టివి దృశ్యాల వంటి సాంస్కృతిక రూపాలు అత్యంత ప్రగాఢ ప్రభావం చూపే కళాంశాలుగా ఉన్నాయి. ఇవి పారిశ్రామికంగా ఉత్పత్తి అవుతున్నాయి. పెట్టుబడిదారీ సరుకుల్లాగా పంపిణీ అవుతున్నాయి. డబ్ల్యు.టి.ఓ. యుగం ఇది. ద్రవ్య పెట్టుబడి అంతర్జాతీయంగా సంధానించబడుతోంది. ఈ యుగంలో మొత్తం శ్రమ సరుకుగా మార్చివేయబడింది. మొత్తం ఉత్పత్తి, వినిమయం దాదాపుగా మార్కెట్


epaper.prajasakti.com

ద్వారానే జరుగుతున్నది. ఇలాంటి కాలంలో నాగరికత అన్నది ప్రపంచ నాగరికతగానే ఉంటుంది. అది పెట్టుబడిదారీ స్వభావం కలిగినదై ఉంటుంది. అన్ని జాతీయ సంస్కృతులు, ప్రాంతీయ సంస్కృతులు ఆఖరుకు స్థానిక సంస్కృతులు కూడా ప్రపంచీకృత పెట్టుబడిదారీ నాగరికత అనే మహా చట్రంలో ఇమిడి పోవలసి ఉంటుంది. తరచు అవి ఆ ప్రపంచీకృత నాగరికతకు మరో రూపంగా ఉండవచ్చు. జాతీయ మార్కెట్లనేవి ప్రపంచ మార్కెట్లో భాగాలుగా ఉంటున్న తరహాలోనే ఇది కూడా జరుగుతుంది. ఒకప్పుడు ముస్లిం నాగరికత అనేది హిందూ నాగరికత నుంచి కొన్ని మౌలిక వ్యత్యాసాలతో మనుగడలో ఉండి వుండవచ్చు. అలాగే యూదు, క్రైస్తవ నాగరికతలు కూడా ఉండివుండవచ్చు. కానీ ఇప్పుడు ఉన్న ముస్లిం లేదా హిందూ సమాజాలు వారి దైనందిన జీవిత ప్రక్రియలో అంతర్జాతీయ పెట్టుబడిదారీ నాగరికతకు మారు రూపాలుగా మాత్రమే మనగలుగుతాయి. వేరు వేరు ప్రార్థనలు చేసినంత మాత్రాన, వేరు వేరు సంస్కృతులు, నాగరికతలు వుంటాయనడానికి లేదు. మతపరమైన కారణాలతో ఒకరినొకరు చంపుకున్నప్పుడు కూడా సాంస్కృతికంగా తేడాలు ఉంటాయనలేము. ఎందుకంటే ఆ వ్యక్తి హిందువు లేదా ముస్లిం ఎవరైనప్పటికీ వారి మత చైతన్యపు మౌలిక నిర్మాణం ఒకే విధంగా ఉంటుంది. ఇంతకన్నా ముఖ్యమైన విషయం ఏమంటే మధ్యతరగతి భారతీయులందరూ ఏ తరహాకు చెందినవారైనా ఒకే విధమైన సరుకులు కోరుకుంటారు. ఒకే విద్య, ఉపాధి ఆశిస్తారు. ఒకే రీతిగా ఉండే గృహాలలో నివసిస్తారు. అందరూ అవే టివి దృశ్యాలు తిలకిస్తారు. వివాహం వంటి ఎంపికలు కూడా ఈ ప్రమాణాల ప్రకారమే చేసుకుంటారు. తమ పిల్లలను అలాంటి పాఠశాలలకే పంపుతారు. వీరంతా ఒకే మాల్స్‌కు వెళ్ళడం కూడా అంతకంతకూ పెరిగిపోతున్నది. మీరు ఉదాహ రణగా మతపరమైన పండుగలను తీసుకోండి. పాశ్చాత్య దేశాల క్రిస్మస్ కాని – ఇండియాలో దీపావళి కాని – క్రైస్తవులకో, హిందువులకో సంబంధించినవి అయినప్పటికీ, రెండు సందర్భాలలోనూ ఒకే విధమైన సరుకుల వినియోగం జరుగుతుంది. కాకపోతే మీ ఆదాయాన్ని బట్టి ఫ్యాషన్లపై పెట్టే ఖర్చు ఉంటుంది. మత భావనను ప్రేరేపించడం కూడా జరుగుతుంది కాని ఆ ఆధ్యాత్మిక సారం క్షీణించి పోతుంటుంది. ఇలాంటి నేపథ్యంలో నిజంగానే మతం అనేది, అర్థంలేని ఖర్చుల నుంచీ, బుల్లి తెర దృశ్యాల నుంచీ, మితవాద ఫాసిస్టు తరహా రాజ్యాధికార ప్రయోగం నుంచీ విడదీయరానిదవుతుంది.

ఉదాహరణకు మీరు ఎల్.కె. అద్వానీ ప్రసిద్ధ రథయాత్రను తీసుకోండి. రామజన్మభూమిని, హిందూ నాగరికతను పరిరక్షించేందుకు ఆయన దాన్ని తలపెట్టానన్నాడు. ఈ రథంలో కొట్టవచ్చినట్లు కనబడే అంశం ఏమిటి అంటే అది ఒక టయోటా ట్రక్. దాని లోపలి భాగం అత్యాధునిక సదుపాయా లతో తీర్చిదిద్దబడింది. దాని వెలుపలి భాగం హిందూ పురాణాల నుంచి సాధ్యమైనన్ని ముక్కలు తెచ్చి అలంకరించబడింది. మహా భారతం, రామాయణం అనే రెండు పూర్తి భిన్న మైన ఇతిహాసాలు అంతక్రితం సంవత్సరాలలో భారతీయ టివిలలో ప్రముఖంగా ప్రసారమయ్యాయి. ఇవి కూడా టయోటా ట్రక్కు హంగు, దర్పాలలో భాగాలయ్యాయి. ఎయిర్‌కండిషన్డ్ ట్రక్కులో విశ్రాంతి పూర్తి కాగానే వీటి మధ్య నుంచి అద్వానీ దర్శనమిస్తాడు. మరోవిధంగా చెప్పాలంటే మాస్ మీడియా యుగంలో మతమన్నది కూడా ఒక టెలివిజన్ దృశ్యరూపం లాంటిదై పోయింది. హిందూ దైవ స్వరూపాలను ఈ విధంగా ఆధునికాంతర రూపంలో ప్రదర్శించడం, అది కూడా ఒక అర్ధ ఫాసిస్టు రాజకీయ దురాశతో మీడియా స్పృహ గల వాణిజ్య ప్రక్రియల్లో సమర్పించడం వాస్తవానికి పెట్టుబడిదారీ యుగ పూర్వపు హిందూ నాగరికతతో ఏమాత్రం పొసిగే విషయం కాదు. టీవీ కేంద్రాల ద్వారా అమెరికాలో ఏవాంజలికల్ బోధకులు, వారి కార్పొరేషన్లు సాగించే ప్రచారంతో మాత్రమే దీన్ని పోల్చగలం. ఆ దేశంలో పచ్చి మితవాదిని అధ్యక్ష భవనంలో ప్రతిష్టించేందుకు ఈ శక్తులు గణనీయంగా సహాయపడ్డాయి. ప్రపంచీకృత పెట్టుబడిదారీ విధానపు ఈ తాజా ఘట్టంలోని ఒకానొక నిర్దిష్ట లక్షణం ఏమంటే ప్రపంచంలో అది ఆధిపత్యం చెలాయించే అన్ని ప్రాంతాల్లోనూ – వెనుక బడిన, అభివృద్ధి చెందిన ప్రాంతాలు రెంటి లోనూ – మతం అనేది నైతిక వ్యవస్థ పాత్రకు భరతవాక్యం చెప్పడం పెరిగిపోతున్నది. చాలా వరకు అది సరుకుగా మార్చివేయబడుతున్నది. భారీ ఎత్తున వాణిజ్య ప్రక్రియలతో, రాజకీయ గుర్తింపుతో మీడియా దృశ్యంగా రూపెత్తు తున్నది. అదే సమయంలో పొరుగువారి మతం పట్ల ద్వేషంగా మారుతున్నది.

ఈ ప్రసంగం ప్రథమ భాగంలో సామ్రాజ్యవాదం గురించి నేను చర్చించాను. స్థూలంగా చెప్పాలంటే 1945–75 మధ్య కాలంలో విప్లవకర, పెట్టుబడిదారీ వ్యతిరేక శక్తులు ముందుకు సాగుతుంటే సామ్రాజ్యవాదం చాలావరకు దెబ్బ కాచుకునే స్థితిలో ఉండిపోయిందన్నాను. ఆ తర్వాతి కాలంలో 1970ల మలి దశ నుంచి మరీ ముఖ్యంగా సోవియట్ యూనియన్ కుప్పకూలినప్పటి నుంచి బలాబలాల పొందిక మారింది. విప్లవ శక్తులు ముందంజ వేసిన దశాబ్దాలలో ప్రధానమైన లక్షణం ఏమంటే ప్రపంచ వ్యవహారాలలో మతపరమైన రాజకీయాల పాత్ర చాలా పరిమితంగా ఉండేది. జాతీయ సంస్కృతులను మత పరమైన భాష్యాలతో నిర్వచించాలనే భావనకు చాలా కొద్దిమంది మాత్రమే మద్దతునిచ్చేవారు. ఆ కాలంలో ముస్లిం దేశాలలో బ్రహ్మాండమైన కమ్యూనిస్టు పార్టీలు ఉండేవి. ముస్లిం ప్రపంచంలో చాలా వరకు లౌకిక శక్తుల పరిపాలన నడిచేది. వాటిలో అనేక దేశాలు తమ తమ తరహా సోషలిజాలను అంటే ఉదాహరణకు అరబ్ సోషలిజం వంటి వాటిని గురించి చెప్పేవి. ఈజిప్ట్, అల్జీరియా, ఇరాక్, సిరియా తదితర దేశాలు దాన్ని తమ అధికార సిద్ధాంతంగా పేర్కొనేవి. 1960లలో దక్షిణ ఎమెన్‌లోనూ, 1970లలో ఆఫ్ఘనిస్తాన్‌లోనూ వాస్తవంగా కమ్యూనిస్టు విప్లవాలే వచ్చాయి. ఆ మొత్తం కాలంలో బలమైన ఛాందస దేశంగా ఉన్నది అమెరికా ఆప్త మిత్రమైన సౌదీ అరేబియా ఒక్కటే. అరబ్ సైన్యాలపైన ఇజ్రాయిల్ గొప్ప విజయం సాధించడం, అరబ్ ప్రపంచంలో నాజర్ వామపక్ష వాదం క్షీణించడం జరిగిన తర్వాతే ఇస్లామిక్ బృందాలు ఆ ఖాళీని భర్తీ చేసేందుకై విస్తరించగలిగాయి. మన కాలంలోనే మనం ఇరాక్‌కు ఏ గతి పట్టిందో చూశాం. అమెరికా దురాక్రమణకు ముందు అక్కడ రాజకీయాలు పూర్తిగా లౌకిక వాదంతో వుండేవి. ఇప్పుడు అక్కడ పూర్తిగా మత, శాఖ, ఉపజాతి గుర్తింపుల ప్రాతిపదికపై ప్రభుత్వ ఏర్పాటు, రాజ్యాంగ రూపకల్పన జరగడం



epaper.prajasakti.com

పూర్తిగా దురాక్రమణ ఫలితమే.

ఆఫ్ఘనిస్తాన్‌లో కమ్యూనిస్టు ప్రభుత్వం పై పోరాడేందుకు డజనుకు పైగా దేశాల నుంచి 40వేల మంది జిహాదీలను సిఐఎ సమీకరించిన విషయం నేనింతకు ముందు ప్రస్తావించాను. ఇక్కడ ఒక్కటే ప్రశ్న. అన్ని దేశాల నుంచి అంత మందిని సిఐఎ గుర్తించడం, సమీకరించడం ఎలా సాధ్యమైంది? దీనికి సమాధానం చాలా సులభం. అక్కడ సమాచార సంబంధాలున్నాయి. అమెరికా ఏజెంట్లకు వివిధ దేశాలలోని ఇస్లామిక్ బృందాలకు మధ్య క్రియాశీల సహకారం నడిచింది. కమ్యూనిజానికి వ్యతిరేకంగా ఇస్లాంను రాజకీయ శక్తిగా వాడుకోవడం, 1950ల ప్రచ్ఛన్న యుద్ధ ప్రారంభంలో ప్రకటించబడిన ట్రూమన్ సిద్ధాంతంలో బహిరంగం గానే పేర్కొనబడింది.

భారతదేశంలో చూసినా 1920–30లలో తలెత్తిన ప్రధానమైన హిందూ మత తత్వ సంస్థలు కూడా వలసవాద వ్యతిరేక పోరాటంలో ముఖ్యపాత్ర వహిస్తున్న లౌకిక శక్తులకు వ్యతిరేకంగానే పెంపొందాయి. అలాగే అప్పుడే తలెత్తుతలున్న కమ్యూనిస్టు ఉద్యమానికి కూడా అవి వ్యతిరేకమైనవి. స్వతంత్ర భారతదేశపు తొలి సంవత్సరాలలో ఈ శక్తులు స్వతంత్ర పార్టీ వంటి సంస్థలతో జతకట్టాయి. కమ్యూనిస్టులను మాత్రమే కాక పాక్షిక సోషలిస్టు విధానాలు చెబుతున్న నెహ్రూను కూడా వ్యతిరేకిస్తూ స్వేచ్ఛా వాణిజ్యాన్ని అవి బోధించాయి. అదే సమయంలో కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా ఉమ్మడి పోరాటం చేద్దామని నెహ్రూ, పటేల్‌లకు ఆర్‌ఎస్‌ఎస్ ప్రతిపాదించింది. ఏమైనా ఎమర్జెన్సీ సంక్షోభం వచ్చేవరకు ఈ శక్తులు అంతంత మాత్రంగానే ఉండిపోయాయి. ఆ తర్వాతనే జనతా మిశ్రమ కూటమిలో జన సంఘం అతి పెద్ద భాగంగా ఆవిర్భవించ గలిగింది. ఎమర్జెన్సీ అనంతర ప్రభుత్వంలో ఆరెస్సెస్ సభ్యులు పలువురు కీలకమైన శాఖలు పొందగలిగారు. అమెరికాతో పూర్తి స్థాయి పొత్తుకు బాట వేస్తూ నయా–ఉదారవాద విధానాలను భారతదేశంలో ప్రవేశపెట్టిన నర్సింహారావు ప్రభుత్వమే బాబ్రీ మసీదు విధ్వంసాన్ని కూడా అనుమతించడం యాదృచ్ఛికం కాదు. టెలివిజన్‌లో ప్రసారమైన ఆ దృశ్యం బిజెపి ఉత్తరోత్తరా అధికారానికి ఎగబాకడంలో దోహదపడింది. భారతదేశంలో మతశక్తుల పెరుగుదలకు సామ్రాజ్యవాదం ప్రత్యక్షంగా పాత్ర

"భారతదేశంలో చూసినా 1920– 30లలో తలెత్తిన ప్రధానమైన హిందూ మత తత్వ సంస్థలు కూడా వలసవాద వ్యతిరేక పోరా టంలో ముఖ్యపాత్ర వహిస్తున్న లౌకిక శక్తులకు వ్యతిరేకంగానే పెంపొందాయి. అలాగే అప్పుడే తలెత్తుతలున్న కమ్యూనిస్టు ఉద్యమానికి కూడా అవి వ్యతిరేకమైనవి. స్వతంత్ర భారతదేశపు తొలి సంవత్సరాలలో ఈ శక్తులు స్వతంత్ర పార్టీ వంటి సంస్థలతో జతకట్టాయి."

వహించిందని చెప్పలేము. కానీ అవే చారిత్రక పరిస్థితులలో మతతత్వ శక్తులు అధికారం కైవసం చేసుకోవడానికి నయా– ఉదారవాద శక్తులు అవకాశమిచ్చాయనేది అంతే నిజం. ఎవాంజలికల్ తదితర ఛాందస క్రైస్తవ బృందాలు అమెరికాలో ప్రాబల్యంలోకి వచ్చింది కూడా 1980ల మధ్య కాలం నుంచే.

ఈ విధంగా మన ముందు ఒక వైరుధ్యపరిస్థితి ఉంది. మొత్తం కాలంలో వామపక్షం బలంగా ఉన్న సమయంలో మతతత్వ శక్తులు ప్రపంచవ్యాపితంగానే సమాజంలో స్వల్ప ప్రభావమే చూపించాయి. ఇటీవలి కాలంలో అంతర్జాతీయంగా వామ పక్షాల శక్తి తగ్గుముఖం పడుతున్న కొద్దీ అవే ప్రతీఘాత శక్తులు ప్రబల స్థానంలోకి చేరగలుగుతున్నాయి. వామపక్షాలు ముందంజ వేసిన కాలంలో సమానత్వం కోసం పోరాటాలు ప్రధాన పాత్ర వహిస్తే సామ్రాజ్యవాదం విజయం సాధించిన ఇటీవలి కాలంలో అస్తిత్వ, ఉపజాతి మత రాజకీయాలు ప్రాబల్యంలోకి రాగలిగాయి. ఇవన్నీ సంస్కృతి – నాగరికతల పేరే చెబుతున్నాయి. సామ్రాజ్యవాదంలోని రెండు దశల మధ్య ఉన్న ఈ తేడాను గమనించినప్పుడు ఒక విషయం చెప్పవచ్చు. మనం సాంస్కృతిక అస్తిత్వానికి అభివృద్ధి నిరోధక భాష్యాలు చెప్పడాన్ని గట్టిగా వ్యతిరేకించాలి. అయితే అదే సమయంలో మన దేశంలోనూ, తక్కిన ప్రపంచంలోనూ కూడా వామపక్షాల శక్తిని పునరుద్ధరించడం ద్వారానే ప్రగతిశీల శక్తులు ఈ కర్తవ్యం నిర్వహించగలుగుతాయి. కొంతకాలం కిందటి వరకు అప్రధాన స్థానంలో ఉన్న మితవాద శక్తులను తిరిగి అక్కడికే నెట్టగలుగుతాయి. మనం ఒక సామ్యవాద సమాజం కోసం, ప్రగతిశీల పాదార్థిక సంస్కృతి కోసం పోరాడకుండా మితవాద సాంస్కృతికత పైన, మత మౌఢ్యం పైన పోరాడ లేము.

మాస్ మీడియా ద్వారా సాంస్కృతిక పరిశ్రమ ఎలా పనిచేస్తున్నదో వివరించడానికి నేను ఎక్కువగా ప్రయత్నించాను. సంస్కృతి, రాజకీయాలను నిర్వచించడంలోనూ, ఆఖరుకు మీడియా దృశ్యాలలోనూ కూడా మతాన్ని ఎలా ఉపయోగించుకుంటున్నారో చెప్పేందుకు ప్రయత్నించాను సామ్రాజ్యవాదం మన సాంస్కృతిక జీవితానికి విఘాతం కలిగిస్తున్న విస్తార రంగాలు ఇంకా చాలా వున్నాయని నాకు తెలుసు. ఉదాహరణకు మన విద్యారంగంలో ఏం జరుగుతుందో నేను కనీసంగానైనా ప్రస్తావించలేదు. విద్యారంగంలో ప్రభుత్వాలు ప్రపంచబ్యాంకు సూత్రాలను అమలు చేస్తు న్నాయి. అనేక రూపాలలో స్వంతంగా నిధులు సేకరించుకోమని విద్యా సంస్థలను ఒత్తిడి చేస్తున్నాయి. విదేశీ విశ్వవిద్యాలయాలు భారత భూభాగం నుంచే పనిచేసే పరిస్థితికి మనం చేరుకున్నాం. ఇవి ఉన్నత శ్రేణులకు ఖరీదైన విద్యను అందిస్తుండగా మనవైన ప్రభుత్వ సంస్థలు హరించుకుపోతున్నాయి. మానవాభివృద్ధి రంగాలకు నిధులు కొడిగడుతున్నాయి. నేనింతకుముందే చెప్పినట్లుగా సామ్రాజ్యవాద హస్తం సోకని సాంస్కృతిక రంగం ఒక్కటైనా లేదు. అయితే అవన్నీ ఒకే పత్రంలో పేర్కొనడం అసాధ్యం. అందుకే సమకాలీన సామ్రాజ్య వాదానికే సంబంధించిన కొన్ని సమస్యలను మాత్రమే ఎంచుకున్నాము. విస్తార ప్రజారాసుల జీవన ప్రక్రియలో అత్యంత వినాశకర రీతుల్లో సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారీ విధానం చొచ్చుకు వస్తున్న ఒకటి, రెండు రంగాలనే నేను స్పృశించాను.


**(అనువాదం : తెలకపల్లి రవి)**



epaper.prajasakti.com

# గొప్ప మార్క్సిస్టు మేధావి, విప్లవకారుడు: ఐజాజ్

**బివి రాఘవులు**



రచయిత సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు

**ప్రముఖ మార్క్సిస్టు మేధావి ఐజాజ్ అహ్మద్ స్మారకార్థం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం నిర్వహించిన సభలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులుగారు ఆన్‌లైన్‌లో చేసిన ప్రసంగం సారాంశాన్ని పాఠకులకు అందిస్తున్నాం - సంపాదకుడు.**

ఐజాజ్ అహ్మద్ ప్రపంచంలోని ప్రముఖ మార్క్సిస్టు మేధావులు, విప్లవకారులలో ఒకరు. సాహితీవేత్త. ప్రజలు, ప్రజా ఉద్యమాల కోసం పనిచేసిన ప్రజా మేధావి. జర్నలిస్టు కూడా. ఇన్ని గొప్ప లక్షణాలు కలిసివున్న వ్యక్తి ఐజాజ్ అహ్మద్. ఒకదేశానికే పరిమితం కాకుండా ప్రపంచదేశాలన్నింటిలోనూ తెలిసిన వ్యక్తి. దక్షిణాసియా, అరబ్బు, యూరోపియన్ దేశాలు, అమెరికా, చైనా, ముఖ్యంగా సామ్రాజ్యవాదం గురించి విస్తృతంగా రాశారు. భారతదేశంలో మతోన్మాదం పెరుగుదల గురించి లోతైన అధ్యయనం చేశారు. వివిధ అంశాలపై విస్తృతంగా అధ్యయనం చేసి, అనేక పుస్తకాలు రాశారు. అటువంటి గొప్ప మేధావిని మనం చాలా అరుదుగా చూస్తాం. అందువల్లే ప్రపంచంలోని అనేకదేశాలకు చెందినవారు ఆయన మరణించినపుడు సంతాపం తెలియజేశారు. ప్రత్యేకంగా భారతదేశంలోని వామపక్ష ఉద్యమంతోనూ, మార్క్సిస్టు పార్టీతోనూ దగ్గరి సంబంధాలు కలిగి ఉన్నారు. సైద్ధాంతిక పత్రిక మార్క్సిస్టులో వ్యాసాలు రాస్తూ ఉండేవాడు. ప్రముఖ ఇంగ్లీషు రాజకీయ విశ్లేషణ పత్రిక ఫ్రంట్‌లైన్‌లో విస్తృతంగా వ్యాసాలు రాసేవాడు. ఢిల్లీలోని లెఫ్ట్‌వర్డ్ ప్రచురణ సంస్థతో సన్నిత సంబంధాలు కలిగి ఉన్నారు. ఆయన రాసిన అనేక పుస్తకాలను ఆ సంస్థ ప్రచురించింది. ఆయన చేసిన అనేక ఉపన్యాసాలను న్యూస్‌క్లిక్ వెబ్‌పోర్టల్ ప్రచురించింది. అంతర్జాతీయ ప్రఖ్యాతిగాంచిన సోషలిస్టు రిజిస్టర్, సోషల్ సైంటిస్ట్, మంత్లీ రివ్యూ, ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ, ఇంకా అనేక పత్రికలలో ఆయన వ్యాసాలు వచ్చాయి. ఇంకా అనేక విధాలుగా, మనం ఊహించలేనంతగా ఆయన సైద్ధాంతిక కృషి చేశారు. మార్క్సిజం దెబ్బతినిపోయిందని చెబుతూ అనేక మంది కొత్తకొత్త సిద్ధాంతాలు, వాదనలు ముందుకు తెస్తున్న సమయంలో ఆ వాదనలను ఖండించటం, మార్క్సిజాన్ని పునరుద్ధరించటం కోసం ఆయన ప్రధానంగా కృషి చేశారు. 1991లో సోవియట్ యూనియన్‌లో సోషలిజం కూలిపోయిన తర్వాత, ప్రపంచవ్యాపితంగా కమ్యూనిస్టు ఉద్యమం బలహీనపడుతున్న సమయంలో పెట్టుబడిదారీ విధానంలో సంక్షోభాలకు అంతం లేదని, వాటిని ఎవరూ నివారించలేరని చెబుతూ కొత్త తరానికి ఆత్మ విశ్వాసం కలిగించటానికి ప్రయత్నం చేశారు. అందువల్ల ఆయన ఒక గొప్ప మేధావి, విప్లవకారుల తరగతికి చెందినవాడని మనం భావించాల్సి ఉంటుంది.

**విద్యార్థి దశనుండే వామపక్ష ఉద్యమాలతో సంబంధం**

బ్రిటిష్ వారు భారతదేశాన్ని పాలిస్తున్న సమయంలో, 1941లో ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌పూర్ జిల్లాలో ఆయన జన్మించాడు. దేశ విభజన సమయంలో ఆయన కుటుంబం పాకిస్తాన్‌కు వలసపోయింది. తల్లిదండ్రులు పాకిస్తాన్‌కు వలస పోవటంతో ఆయన అక్కడే చదువుకుని, ఆంగ్ల సాహిత్యంలో పట్టా తీసుకున్నాడు. భారతదేశం నుండి వలస వెళ్ళిన కమ్యూనిస్టులు, అభ్యుదయవాదులు పాకిస్తాన్‌లో ట్రేడ్ యూనియన్ ఉద్యమం, సాహిత్య రంగాలలో కృషి చేశారు. అటువంటి వారితో సాన్నిహిత్యం ఏర్పడటంతో చదువుకునే రోజులలోనే వామపక్ష భావాలను వంట బట్టించుకున్నారు. పాకిస్తాన్ ఫోరం అనే పత్రికను ఏర్పాటు చేసి, కమ్యూనిస్టు, అభ్యుదయ భావజాలాన్ని ప్రచారం చేస్తున్నవారితో కలిసి ఆయన కూడా రచనలు చేయటం, ఇతర విధాలుగా కృషిచేశారు. పాకిస్తాన్ ఏర్పడిన తర్వాత పశ్చిమ, తూర్పు పాకిస్తాన్‌లుగా ఉండేది. పాకిస్తాన్ నిరంకుశ పాలకులు తూర్పు పాకిస్తాన్‌లో అభ్యుదయ, ప్రజా ఉద్యమాలను నిరంకుశంగా అణచివేస్తుండేవారు. పశ్చిమ పాకిస్తాన్‌లో కూడా మైనారిటీలు, ఇతర తెగల పట్ల కఠినంగా వ్యవహరించేవారు. మిగతా వారితో పాటు ఐజాజ్ అహ్మద్ కూడా ఇటువంటి వాటన్నింటి పట్లా నునిశిత వ్యాఖ్యలు చేస్తుండేవాడు.

యాహ్యాఖాన్ నియంతగా అధికారంలోకి వచ్చిన తర్వాత కమ్యూనిస్టులు, అభ్యుదయ వాదులపై తీవ్రమైన నిర్బంధాన్ని ప్రయోగించటం, అరెస్టులు, జైళ్ళలో పెట్టటంతో ఇక పాకిస్తాన్‌లో ఉండలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. దాంతో ఆయన అమెరికా వెళ్ళిపోయాడు. అక్కడ వివిధ యూనివర్సిటీలలో రకరకాల బాధ్యతలు నిర్వహించాడు. ఇంగ్లీష్ చదువుకున్నప్పటికీ ఆయనకు సాహిత్యం, కవిత్వం, ముఖ్యంగా ఉర్దూ కవిత్వం అంటే ఎనలేని ప్రేమ. గాలిబ్ రాసిన గజల్స్ అన్నీ ఆయనకు కరతలామలకంగా ఉండేవి. వాటిని ఇంగ్లీషులోకి అనువదించి, ఇతరులకు వివరించటం, వ్యాఖ్యానించటం చేసేవాడు. ఆ విధంగా చేసిన కృషిని ఆ తర్వాత పుస్తక రూపంలో తీసుకొచ్చారు. అందుకే ఆయనకు సాహిత్యం, రాజకీయాలు అంటే అమితమైన ప్రేమ అని అంటుంటారు. ఆయన మొదట యార్క్ యూనివర్సిటీ, తర్వాత 1985 వరకు


epaper.prajasakti.com

అమెరికాలో అనేక యూనివర్సిటీలలో ప్రొఫెసర్‌గా పనిచేశారు. 1985లో భారతదేశానికి వచ్చిన ఆయన 2014 వరకు ఇక్కడే ఉన్నారు. దేశంలోని అనేక యూనివర్సిటీలలో, పెద్ద ఇన్‌స్టిట్యూషన్స్‌లో ప్రొఫెసర్‌గానూ, ఇతర బాధ్యతలు నిర్వహించారు. ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ మ్యూజియంలో పనిచేశారు. తర్వాత జెఎన్‌యులో విజిటింగ్ ప్రొఫెసర్‌గా, జామియా మిలియాలో ప్రొఫెసర్‌గా పనిచేస్తూ అనేక తరాల విద్యార్థులను ప్రభావితం చేశారు. అయనను కలిసిన అనేక మంది ఆయనతో మాట్లాడటమే గొప్పగా భావించేవారు.

> “ అమెరికాలో ఉన్నపుడు కేవలం విద్యాబోధనకే పరిమితం కాలేదు. అక్కడ జరిగిన అనేక ఉద్యమాలలో పాల్గొన్నాడు. వియత్నాంపై అమెరికా చేస్తున్న దాడులను వ్యతిరేస్తూ జరిగిన ఆందోళనలు, యుద్ధ వ్యతిరేక ఉద్యమాలలో క్రియాశీలంగా పాల్గొన్నాడు. ఇతర ఉద్యమాలలోనూ భాగస్వామి అయ్యాడు. భారతదేశం వచ్చిన తర్వాత కూడా ఇక్కడ వామపక్ష ఉద్యమాలతో సన్నిహిత సంబంధాలు పెట్టుకున్నారు. ”

అమెరికాలో ఉన్నపుడు కేవలం విద్యాబోధనకే పరిమితం కాలేదు. అక్కడ జరిగిన అనేక ఉద్యమాలలో పాల్గొన్నాడు. వియత్నాంపై అమెరికా చేస్తున్న దాడులను వ్యతిరేస్తూ జరిగిన ఆందోళనలు, యుద్ధ వ్యతిరేక ఉద్యమాలలో క్రియాశీలంగా పాల్గొన్నాడు. ఇతర ఉద్యమాలలోనూ భాగస్వామి అయ్యాడు. భారతదేశం వచ్చిన తర్వాత కూడా ఇక్కడ వామపక్ష ఉద్యమాలతో సన్నిహిత సంబంధాలు పెట్టుకున్నారు. 1985 తర్వాత ఆయన తాను భారతదేశంలోనే పుట్టానని, తనకు భారతదేశ పౌరసత్వం ఇవ్వాలని అనేక సార్లు దరఖాస్తులు పెట్టుకున్నా ప్రభుత్వం దానిపై నిర్ణయం తీసుకోలేదు. అందువల్ల ఆయన వీసాను పదేపదే పొడిగించుకొంటూ ఇక్కడ ఉండవలసి వచ్చింది. 2014లో మోడి అధికారంలోకి వచ్చిన తర్వాత వీసాను పొడిగించుకోవటం సాధ్యంకాక తిరిగి అమెరికా వెళ్ళిపోయాడు. ఇక్కడ ఉండగా మతోన్మాదానికి సంబంధించిన వాస్తవాలను బట్టబయలు చేస్తూ ఆయన ప్రజా ఉద్యమాలకు సహాయం చేశాడు. 1991లో బాబ్రీమసీదును కూల్చివేసినపుడు, పోఖ్రాన్‌లో అణుబాంబును పరీక్షించినపుడు, 2002లో గుజరాత్‌లో మత మారణకాండ జరిగిన సందర్భాలలో వాటి వెనుక ఉన్న దుర్మార్గపు ఆలోచనలను ఆయన బయటపెట్టటం పాలకులకు, ముఖ్యంగా బిజెపి పాలకులు, మతోన్మాద శక్తులకు కంటగింపుగా మారింది. దానితో బిజెపి పాలకులు ఆయన ఇక్కడ ఉండటానికి అంగీకరించకపోవటంతో తిరిగి అమెరికా వెళ్ళి కాలిఫోర్నియా యూనివర్సిటీ సాహిత్య శాఖలో ప్రొఫెసర్‌గా చేరి, తుదిశ్వాస వరకు అక్కడే ఉన్నాడు. చివరి వరకు మార్క్సిజానికి కట్టుబడి, సిద్ధాంతాన్ని, ఆచరణను మేళవించటానికి, కార్యాచరణకు దోహదం చేసేశక్తిగా సిద్ధాంతాన్ని మలచటానికి తన మేధాశక్తిని ఉపయోగించిన ఆయన జీవితచరిత్ర మనకు ఉత్తేజం కలిగిస్తుంది. సమకాలీన సమస్యలకు మార్క్సిజాన్ని అన్వయించి, విశ్లేషించిన తీరు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

### సమకాలీన సమస్యలను విశ్లేషించిన రచనలు, ఉపన్యాసాలు

ఆయన ఎన్నో పుస్తకాలు రాశాడు. వాటిలో కొన్ని తెలుగులో కూడా వచ్చాయి. 1992లో “సిద్ధాంతం, వర్గాలు, జాతులు, సాహిత్యాలు” అన్న పుస్తకం రాశాడు. ఆ పుస్తకం ప్రపంచవ్యాప్తంగా సంచలనం కలిగించింది. అంత సంచలనం ఎందుకు కలిగించిందో రాసిన తేదీ చూస్తే తెలుస్తుంది. అప్పటికి 10 సంవత్సరాల క్రితం సరళీకరణ విధానాలు ప్రారంభమయ్యాయి. 1989-91 మధ్య సోవియట్ యూనియన్, సోషలిస్టు వ్యవస్థ కూలిపోయాయి. దానితో మార్క్సిజం తప్పని తేలిందని, మార్క్సిజం అనంతర కాలం ఇది, ఆధునికవాద అనంతర కాలం ఇది, వలసవాద అనంతర కాలం ఇది అని కొత్త సిద్ధాంతాల పేరుతో సాగిన ప్రచారాన్ని ఆయన తుత్తునియలు చేశాడు. ఇవి కొత్త సిద్ధాంతాలు కావని, పాత సిద్ధాంతాలకే కొత్త తళుకులు అద్దారని, ఈ సిద్ధాంతాలు నయా ఉదారవాదానికి ముసుగు అని ఆయన రుజువు చేశాడు. సమాజాన్ని మార్చటానికి సాహిత్య కృషి, పుస్తకాలు రాయటం సరిపోతుందని, రాజకీయ కార్యచరణ అవసరం లేదని కూడా ఈ సిద్ధాంతవేత్తలు చెప్పారు. దీన్ని థియరిటికల్ యాక్షన్ - పొలిటికల్ యాక్షన్ అంటారు. ఇతరుల సిద్ధాంతాలను విమర్శిస్తూ పుస్తకాలు రాస్తే సరిపోతుందని, అదే సమాజాన్ని మారుస్తుందని, రాజకీయ కార్యాచరణ అవసరం లేదని చెప్పటమే థియరిటికల్ యాక్షన్ సారంశం. మేధావులు సైద్ధాంతిక అంశాల వరకు పరిమితమైతే చాలని, రాజకీయ కార్యాచరణకు తోడ్పడటం, ఉద్యమాలలో పాల్గొనవలసిన అవసరం లేదని చెప్పారు. సిద్ధాంతం వరకే పరిమితమైతే వాస్తవాలను కూడా తెలుసుకోలేమని, రాజకీయ కార్యాచరణే సమాజాన్ని మారుస్తుందని, కార్యాచరణ ద్వారానే సిద్ధాంతం రుజుత్వం తెలుస్తుందని, రెండింటినీ మేళవించటం అవసరం అని నొక్కి చెబుతూ వారి సిద్ధాంతాలను ఆయన ఖండించాడు. ఇటువంటి సిద్ధాంతాన్ని ప్రతిపాదించటం, రాజకీయ కార్యాచరణను నిరాకరించటం అంటే అప్పటికి ఉన్న పాలకవర్గాలను, పెట్టుబడిదారీ విధానాన్ని రక్షించటం, సరళీకరణ విధానాలను సమర్ధించటం మినహా మరేమీ కాదని ఈ పుస్తకంలో చెప్పాడు.

ఆ రోజు ప్రపంచంలో ప్రసిద్ధిగాంచిన ఫ్రెడరిక్ జేమ్స్ అనే ఆయన మార్క్సిస్టునని చెప్పుకుంటూ సంస్కృతిని గురించి రాసేవాడు. ఆయన మార్క్సిస్టునని చెప్పుకున్నప్పటికీ ఆయన రచనలలో ఏ విధమైన లోపాలున్నాయో, మూడో ప్రపంచదేశాలపై ఆయన పరిశీలన ఏ విధంగా పొరపాటో ఐజాజ్ అహ్మద్ చెప్పాడు. ఎడ్వర్డ్ ఫెయిట్ అనే ఆయన మార్క్సిజం అనేది పశ్చిమ దేశాల సిద్ధాంతం అని, తూర్పు దేశాల సమస్యలను అర్ధం చేసుకోవటానికి పనికిరాదని చెప్పాడు. రాజకీయ కార్యాచరణ రీత్యా చూసినపుడు పాలస్తీనా ప్రజల విముక్తి కోసం కృషి చేసిన వ్యక్తి ఫెయిట్. కాని సిద్ధాంతంపై ఈ విధమైన పొరపాటు అభిప్రాయాలను వ్యక్తం చేశాడు. వీరందరికన్నా పివాక్, వీణాదాస్, ఆబా తదితర వలసవాద అనంతర సిద్ధాంతవేత్తలు మూడో ప్రపంచదేశాలలోని సాహితీవేత్తలు రాసేది సరైన సాహిత్యం కాదని, పశ్చిమదేశాలలో ఉంటున్న మూడో


epaper.prajasakti.com

ప్రపంచదేశాలకు చెందిన సాహితీవేత్తలు రాస్తున్నదే సరైన సాహిత్యం అని చెబుతూ, స్థానిక సాహిత్యాన్ని చులకన చేశారు. వలసానంతర సిద్ధాంతం పేరుతో చేసిన ఈ ప్రతిపాదనలను ఆయన తూర్పారబట్టాడు. ఈ పుస్తకం ద్వారా వాటిని తప్పని రుజువు చేసి, తిరిగి మార్క్సిస్టు అవగాహనను పునరుద్ధరించటానికి పూనుకున్నాడు. సైద్ధాంతిక అంశాలను ప్రముఖంగా చర్చించిన ఈ పుస్తకం ఆ రోజులలో సరైన మార్క్సిస్టు అవగాహన కోసం పోరాటం చేయటానికి తోడ్పడింది. సోషలిజం దెబ్బతిని, మార్క్సిజంపై తీవ్రమైన దాడి జరుగుతున్న రోజులలో దానిని ఎదుర్కోవటానికి మార్క్సిస్టులతో సహా చాలా కమ్యూనిస్టు పార్టీలే మీనమేషాలు లెక్కిస్తున్నపుడు ఏ కమ్యూనిస్టు పార్టీలోనూ భాగస్వామిగానూ, నాయకుడుగానూ లేకపోయినప్పటికీ మార్క్సిజంపై జరుగుతున్న దాడిని ఎదుర్కొనే కర్తవ్యాన్ని నిర్వహించినందువలననే ఆయనకు అంత గౌరవం లభించింది.

రెండో పుస్తకం 2001లో దక్షిణాసియా – భారతదేశంతో పాటు పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, ఆఫ్ఘనిస్థాన్, ఇరాన్ తదితర దేశాలు–లో సమకాలీన రాజకీయాలు, రాజకీయ వ్యవస్థల గురించి రాసినది. అప్పటికే భారతదేశంలో ఉన్నాడు కాబట్టి ఇక్కడ జరుగుతున్న పరిణామాలను పరిశీలించాడు. పోఖ్రాన్ ఘటన, బాబ్రీమసీదు కూల్చివేత తదితర ముఖ్యమైన ఘటనలు జరిగిన కాలం ఇది. ఒక మతోన్మాద సంస్థ ఆధ్వర్యంలో నడిచే బిజెపి అనేక రాష్ట్రాలలో అధికారంలోకి రావటం, మతోన్మాద చర్యలకు పాల్పడుతున్న నేపథ్యంలో ఈ పుస్తకం రాశాడు. ఇటువంటి ఫాసిస్టు, ఉన్మాద చర్యలకు పాల్పడుతున్న పార్టీల పుట్టు పూర్వోత్తరాలు, బలం పుంజుకుని అధికారంలోకి రావటానికి కారణాలను విశ్లేషించాడు. ఇటువంటి పార్టీల పెరుగుదల భారతదేశానికి సంబంధించిన అంశం మాత్రమే కాదని, ఇందుకు మూలాలు అంతర్జాతీయంగా ఉన్నాయని, దేశంలో ఈ శక్తుల పెరుగుదలను పరిశీలించటానికి ఇక్కడ ఉన్న ప్రత్యేకమైన పరిస్థితులను కూడా పరిగణనలోకి తీసుకోవాలని ఈ పుస్తకంలో పేర్కొన్నాడు.

తర్వాతి పుస్తకం ''మతోన్మాదం – ప్రపంచీకరణ, అభివృద్ధి నిరోధకశక్తుల దాడి'' భారతదేశ పరిస్థితులను అర్థం చేసుకోవటానికి బాగా ఉపయోగపడుతుంది. ఇది తెలుగులో కూడా వచ్చింది. మతోన్మాదం, దాని మూలాలకు సంబంధించిన లోతైన చర్చ ఈ పుస్తకంలో ఉంది. ఇటువంటి మతోన్మాదశక్తులు చాలాకాలం నుండి ఉన్నాయి. 1925 నుండి ఆర్ఎస్ఎస్ పనిచేస్తున్నది. అయినప్పటికీ 1990 తర్వాత ఎందుకు శరవేగంగా పెరిగింది, దాని నేపథ్యం ఏమిటి అనే చర్చ ఈ పుస్తకంలో ఉంది. ప్రపంచీకరణకు, అభివృద్ధి నిరోధక, మతోన్మాద శక్తులకు మధ్య ఉన్న సంబంధ ఏమిటి? ప్రపంచీకరణ, సరళీకరణ పెరుగుతున్న సందర్భంలోనే ఈ శక్తులకు నూతన జవసత్వాలు రావటానికి కారణమేమిటి అన్న అంశాలను చర్చించారు. ఆ తర్వాత 2004లో రాసిన "ఇరాక్, ఆఫ్ఘనిస్థాన్ అండ్ ఇంపీరియలిజం ఆఫ్ అవర్ టైం" అన్న పుస్తకంలో ఇరాక్‌లో సద్దాం హుస్సేన్, ఆఫ్ఘనిస్థాన్‌లో తాలిబన్లు, అనేక అరబ్బు దేశాలలో టెర్రరిస్టు శక్తులు ఎందుకు పుట్టుకొస్తున్నాయి? అమెరికాలో సెప్టెంబరు 11 ఘటనలు ఎందుకు జరిగాయి? అన్న అంశాలను విశ్లేషించాడు. ఈ దేశాలన్నీ అమెరికాకు వ్యతిరేక వైఖరిని తీసుకున్నాయి. మరోవైపు అత్యంత వెనుకబడిన, అభివృద్ధి నిరోధక సిద్ధాంతాలను బలపరిచే శక్తులు ఈ దేశాలలో అధికారంలో ఉన్నాయి. ఈ వైరుధ్యాన్ని ఎలా అర్థం చేసుకోవాలి అన్న అంశాలను ఈ పుస్తకంలో చర్చించాడు. ఇవే అంశాలను మళ్ళీ చర్చిస్తూ "లిబరల్ డెమొక్రసి అండ్ ఎక్స్‌ట్రీమ్ రైట్" అన్న పుస్తకం రాశాడు. ఈ పుస్తకాన్ని లెఫ్ట్‌వర్డ్ వారు ప్రచురించారు. చివరిది "నథింగ్ హ్యూమన్ ఈజ్ ఏలైన్ టు మి" పేరుతో ట్రైకాంటినెంటల్ సంస్థ ఛైర్మన్, లెఫ్ట్‌వర్డ్ ప్రచురణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ విజయప్రసాద్ ఆయనతో చేసిన ఇంటర్వ్యూను పుస్తకంగా వేశారు. ఇవి కాకుండా ఫ్రంట్‌లైన్‌లో అనేక వ్యాసాలు రాశారు అక్టోబరు విప్లవ శతవార్షికోత్సవ సందర్భంలో రాసిన ముఖ్యమైన వ్యాసాన్ని కూడా ఫ్రంట్‌లైన్‌లో ప్రచురించారు.

ఆయన రాసిన పుస్తకాలను చదవటం అవసరం. ఆయన చేసిన ఉపన్యాసాలు, ఆయనతో చేసిన ఇంటర్వ్యూలను న్యూస్‌క్లిక్ వారు యూట్యూబ్‌లో పెట్టారు. పుస్తకాలు చదవలేని వారు వాటిని వినవచ్చు. మార్క్సిజం ప్రధానాంశాలు ఎయిటీన్ బ్రూమైరి, కమ్యూనిస్టు ప్రణాళిక, ఫ్రాన్స్‌లో వర్గ పోరాటం, జర్మన్ సిద్ధాంతం తదితర ఒక్కొక్క అంశంపై విజయప్రసాద్ గారు ఆయనతో ఇంటర్వ్యూలు చేశారు. ప్రతి అంశంపై 40 నిమిషాల నిడివితో ఆయన వివరణ ఉంటుంది. వాటిని వింటే మార్క్సిజంపై ఆయనకున్న పట్టు తెలుస్తుంది. మనం ఆ అంశాలను అర్థం చేసుకోవటానికి ఇంటర్వ్యూలు దోహదం చేస్తాయి.

## సరళీకరణ విధానాల పర్యవసానాలను ప్రారంభంలోనే వెల్లడించాడు

ఆయన చెప్పిన అన్ని అంశాలను పరిశీలించటం ఇపుడు సాధ్యం కాదు. సమకాలీన పరిస్థితులను అర్థం చేసుకోవటానికి దోహదం చేసే కొన్ని ముఖ్యమైన అంశాలను మీ దృష్టికి తీసుకొస్తాను. ప్రపంచంలో సరళీకరణ విధానాలు ప్రారంభమైన తర్వాత అంతర్జాతీయ పరిస్థితి ఎలా మారింది, దానిని ఎలా అర్థం చేసుకోవాలి అని అంశాలకు సంబంధించి ఆయన మూడు ముఖ్యమైన విషయాలు చెప్పాడు. ఒకటి సోవియట్ యూనియన్ కుప్పకూలి పోవటంతో ప్రపంచంలో రాజకీయ పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. పెట్టుబడిదారీ విధానాన్ని సంస్కరిస్తూ ప్రజలకు కొన్ని రాయితీలు, సౌకర్యాలు కల్పించటం ద్వారా మెరుగైన సమాజాన్ని స్థాపించవచ్చునని ఆ రోజు ఐరోపాలో ప్రధాన రాజకీయ శక్తిగా ఉన్న సోషల్ డెమొక్రటిక్ పార్టీలు భావించేవి. అటువంటి పార్టీలు పూర్తిగా అంతరించిపోవటం మొదటి మార్పు. రెండవ పరిణామం ఏమిటంటే ప్రజాస్వామ్యం, హక్కులు, స్వేచ్ఛ, స్వాతంత్ర్యం తదితర భావాలుండే ఉదారవాద బూర్జువా పార్టీలు కూడా దెబ్బతిన్నాయి. మూడవ మార్పు ఏమిటంటే సాంప్రదాయకంగా స్థిరపడి, పార్లమెంటరీ వ్యవస్థలో పనిచేస్తున్న కమ్యూనిస్టు పార్టీలు కూడా కొన్ని పార్టీలను రద్దు చేసుకోవటం, కొన్ని పేరు మార్చుకోవటం, కొన్ని పేరు మార్చుకోకపోయినా సిద్ధాంతాన్ని వదులుకున్నాయి. ఆ విధంగా కమ్యూనిస్టు, వామపక్ష ఉద్యమం ప్రపంచవ్యాపితంగా బలహీనపడిపోయింది. భారతదేశంలో మార్క్సిస్టు పార్టి వలె ప్రపంచంలో అక్కడక్కడా కొన్ని చిన్న చిన్న పార్టీలు మిగిలాయి.

కమ్యూనిస్టు, వామపక్ష శక్తులు బలహీనపడిన తర్వాత ఆ ఖాళీని అభివృద్ధి నిరోధక, మితవాద పార్టీలు భర్తీ చేశాయి. అందువలననే 1990 తర్వాత ప్రపంచంలో మితవాద, అభివృద్ధి నిరోధక శక్తులు పెరిగాయి. మితవాద, అభివృద్ధి నిరోధక శక్తుల పెరుగుదలకు పునాది సోవియట్ యూనియన్ కూలిపోవటం, సరళీకరణ విధానాల ప్రారంభంలో ఉందని ఆయన


epaper.prajasakti.com

చెప్పాడు. సోవియట్ యూనియన్ కూలిపోవటంతో సామ్రాజ్యవాదానికి ప్రత్యామ్నాయ శక్తి లేకుండాపోయింది. దీనితో అలీన విధానం భగ్నమైపోయింది. ఫలితంగా అలీన విధానానికి కట్టుబడిన భారతదేశం లాంటి దేశాలు ఆ విధానాన్ని వదులుకొని, అమెరికా ఆధిపత్యంలోకి వెళ్ళిపోయాయి. ఇది అంతర్జాతీయ రాజకీయాలలో పెద్దమార్పుకు దారితీసింది.

> కమ్యూనిస్టు, వామపక్ష శక్తులు బలహీనపడిన తర్వాత ఆ ఖాళీని అభివృద్ధి నిరోధక, మితవాద పార్టీలు భర్తీ చేశాయి. అందువలననే 1990 తర్వాత ప్రపంచంలో మితవాద, అభివృద్ధి నిరోధక శక్తులు పెరిగాయి. మితవాద, అభివృద్ధి నిరోధక శక్తుల పెరుగుదలకు పునాది సోవియట్ యూనియన్ కూలిపోవటం, సరళీకరణ విధానాల ప్రారంభంలో ఉందని ఆయన చెప్పాడు.

రెండవ అంశం కొత్త సాంకేతిక పరిజ్ఞానం విస్ఫోటనం జరిగింది. ఈ కాలంలోనే ఇంటర్నెట్, కృత్రిమ మేధ, కంప్యూటర్‌లు, రోబోలు, బయో ఇంజనీరింగ్, సోషల్ మీడియా, జెనెటిక్స్ తదితరాలు అభివృద్ధి చెందాయి. ఇవి ప్రజల జీవితాలు, ఉత్పత్తి రంగంలో మార్పులు తీసుకువచ్చాయి. సరుకులను ఒకచోట నుండే ఉత్పత్తి చేయాల్సిన అవసరం లేకుండా గొలుసుకట్టు ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేసుకోవటానికి అవకాశం కల్పించాయి. ఒక వస్తువులోని వివిధ భాగాలు ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలో తయారు కావటానికి అవకాశం కలిగింది. సోవియట్ యూనియన్ పతనంతో పాటు ఇది కూడా కార్మికోద్యమం బలహీనపడటానికి కారణమైంది. ఉత్పత్తి ఒకచోట కేంద్రీకరించ బడినపుడు కార్మికులు ఐక్యంగా వ్యవహరించటానికి అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఉత్పత్తి వికేంద్రీకరణతో అందుకు అవకాశాలు తగ్గిపోయాయి. సమాచార సాంకేతిక పరిజ్ఞానం, ప్రచార యంత్రాంగం, మీడియా శక్తి విస్తరించటంతో పాటు పనిభారం పెరిగింది. ఉత్పత్తి, వ్యాపారం ప్రపంచవ్యాపితంగా విస్తరించటంలో ద్రవ్య పెట్టుబడులు ముఖ్యమైన పాత్ర నిర్వహించాయి. అన్నిటికన్నా మించి వేతనాలు పొందే ఉద్యోగాలను ఇది తొలగించింది. మొదట జాబ్‌లెస్ గ్రోత్ అనేవాళ్ళం. అంటే అభివృద్ధి జరుగుతున్నా ఉద్యోగాలు రాకపోవటం. తర్వాత జాబ్‌లాస్ గ్రోత్ అంటున్నాం. అభివృద్ధి జరుగుతున్నప్పటికీ ఉద్యోగాలు కోల్పోవటం. వచ్చే ఉద్యోగాల కంటే తొలగించే ఉద్యోగులే ఎక్కువ సంఖ్యలో ఉంటున్నారు. వేజ్‌లెస్ గ్రోత్ అంటే కార్మికులు అవసరం లేని ఉత్పత్తి విధానం ప్రధానం అవుతున్నదని ఐజాజ్ అహ్మద్ చెప్పాడు.

**ఉదారవాద ప్రజాస్వామ్యంపై దాడి**

ప్రజాస్వామ్యం, వాక్, సభా స్వాతంత్ర్యాలు, చట్టం, వ్యక్తి ప్రాధాన్యత, వ్యక్తిగత స్వాతంత్ర్యం, హక్కులు, విధులు తదితరాలు ఉదారవాద ప్రజాస్వామ్య లక్షణాలు. ఈ కాలంలో వీటిపై తీవ్రమైన దాడి చేసి, నామమాత్రంగా దిగజార్చారు. వ్యతిరేకతను వ్యక్తం చేయటం, విమర్శించటం తదితర ప్రజాస్వామిక హక్కులు లేకుండా బిజెపి ప్రభుత్వం చేస్తున్నది. ప్రజాస్వామిక సంస్థలైన పార్లమెంటు, న్యాయవ్యవస్థ, ఎన్నికల కమిషన్, ప్రణాళికా సంఘం తదితరాలను నిర్వీర్యం చేస్తున్నారు. నామకార్థమైన సంస్థలుగా దిగజార్చి, పెట్టుబడిదారుల ప్రయోజనాలను నెరవేర్చేవిగా వాటిని మారుస్తున్నారు. ఆ విధంగా ప్రజాస్వామిక వ్యవస్థను బలహీనపరుస్తున్నారు. గతంలో హిట్లరు, ముసోలిని తదితర ఫాసిస్టు పాలకులు ప్రజాస్వామిక సంస్థలను ధ్వంసం చేశారు. కాని మనకు ఆ సంస్థలన్నీ ఉన్నట్లుగానే కనిపిస్తున్నప్పటికీ సారాంశంలో ఇవి లేని పరిస్థితులను సృష్టిస్తున్నారు. ఈ అంశాలను ఐజాజ్ అహ్మద్ విశ్లేషించాడు.

మరో ముఖ్యమైన అంశం మారుతున్న రాజ్యం పాత్రను గురించి చెప్పాడు. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి పెరగటం వల్ల గొలుసుకట్టు ఉత్పత్తి ప్రపంచవ్యాపితంగా విస్తరించిన తర్వాత రాజ్యం, సామ్రాజ్యవాదం అవసరం తీరిపోయిందనే సిద్ధాంతం వచ్చింది. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ప్రపంచవ్యాపితంగా విస్తరించిన పరిస్థితులలో, ఇది ఒకదేశం పెట్టుబడి అని చెప్పటానికి అవకాశం లేని పరిస్థితులు ఏర్పడ్డాయని, అందువల్ల ఒక దేశం పెట్టుబడుల కోసం ఇతర దేశాలపై పెత్తనం చేయాల్సిన అవసరం లేదు. కాబట్టి సామ్రాజ్యవాదం అవసరం కూడా తీరిపోయిందని చెప్పారు. ఐజాజ్ అహ్మద్ ఈ రెండూ తప్పని ఖండించాడు. సామ్రాజ్యవాదం ఉన్నది అంతర్జాతీయ పెట్టుబడిని రక్షించటం కోసం మాత్రమే కాదని, దాని దోపిడీని కొనసాగించటం కోసమని, ప్రపంచంలో వనరులు, సంపదలను కొల్లగొట్టటానికి ఏ మూల ఆటంకాలు ఎదురైనా సామ్రాజ్యవాదులు జోక్యం చేసుకుంటున్నారు. మూడో ప్రపంచదేశాలు, ఆఫ్రికా, వెనుకబడిన దేశాలలోని సంపదలను సామ్రాజ్యవాదులు కొల్లగొడుతున్నారు. గతంలో లాగా సామ్రాజ్యవాదుల మధ్య వైరుధ్యాలతో ప్రపంచ యుద్ధాలు రాకపోవచ్చుగాని ఇరాక్, ఆఫ్ఘనిస్థాన్ యుద్ధాలు, యుగోస్లావియాపై దాడి, ఉక్రెయిన్ పరిణామాలు తదితరాలు సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ దేశాల మధ్య ఘర్షణలను వెల్లడిస్తున్నాయి. కాబట్టి సామ్రాజ్యవాదం సమసిపోయిందనేది తప్పని ఇవి రుజువు చేస్తున్నాయి. భారతదేశంలాగే అన్ని దేశాలలోనూ ప్రభుత్వాలు ఉన్నాయి. ఈ దేశాలలో ప్రభుత్వాల అవసరం తీరిపోయిందనేది కూడా సరికాదని ఆయన చెప్పాడు.

**తీవ్ర సంక్షోభంలో పెట్టుబడిదారీ విధానం**

2008 తర్వాత పెట్టుబడిదారీ విధానం తీవ్రమైన సంక్షోభంలో పడింది. ఈ సంక్షోభం పరిష్కారం కాకపోగా అనేక దేశాలలో ఉద్యమాలు, పోరాటాలు పెరుగుతున్నాయి. లాటిన్ అమెరికాలో వామపక్ష ప్రభుత్వాలు అధికారంలోకి వస్తున్నాయి. మళ్ళీ వెనక్కు తగ్గటం, తిరిగి అధికారంలోకి రావటం లాంటి పరిణామాలు జరుగుతున్నాయి. వీటన్నింటినీ ఆయన విశ్లేషించాడు. ఇస్లాం మతం ఉన్న దేశాలు కమ్యూనిజానికి, సోషలిజానికి అనువైనవి కాదనే అపోహలు మనకు ఉన్నాయి. కాని ఒకప్పుడు ఈ దేశాలలో కమ్యూనిస్టు పార్టీలు, వామపక్షాలు బలంగా ఉండేవి.


epaper.prajasakti.com

> **"2008 తర్వాత పెట్టుబడిదారీ విధానం తీవ్రమైన సంక్షోభంలో పడింది. ఈ సంక్షోభం పరిష్కారం కాకపోగా అనేక దేశాలలో ఉద్యమాలు, పోరాటాలు పెరుగుతున్నాయి. లాటిన్ అమెరికాలో వామపక్ష ప్రభుత్వాలు అధికారంలోకి వస్తున్నాయి. మళ్ళీ వెనక్కు తగ్గటం, తిరిగి అధికారంలోకి రావటం లాంటి పరిణామాలు జరుగుతున్నాయి. వీటన్నింటినీ ఆయన విశ్లేషించాడు."**

సోవియట్ యూనియన్ తర్వాత అత్యంత బలమైన కమ్యూనిస్టు పార్టీ ఇండోనేషియాలో ఉండేది. ఇరాక్, సూడాన్, టర్కీ, ఇరాన్‌లలో పెద్ద కమ్యూనిస్టు పార్టీలు ఉండేవి. ఆఫ్ఘనిస్థాన్‌లో పెద్ద కమ్యూనిస్టు పార్టీ ఉండటం మాత్రమే కాక సైన్యంలో ఉన్న కమ్యూనిస్టులు తిరుగుబాటు చేసి, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ఇటువంటి పరిస్థితులు మారిపోయి తాలిబన్లు, ఐఎస్, ఈజిప్ట్‌లో ముస్లిం బ్రదర్‌హుడ్ లాంటి మతోన్మాద శక్తులు పెరగటానికి కారణాలేమిటన్న అంశాన్ని కూడా ఆయన పరిశీలించాడు. మనదేశంలో హిందు మతోన్మాదం లాగే ఆయా దేశాలలో కమ్యూనిస్టులను బలహీనపరిచి, మతోన్మాదశక్తులు ఏ విధంగా ముందుకొచ్చాయనే అంశాన్ని విశ్లేషించాడు. సరళీకరణ విధానాల కాలంలో ఇస్లామిక్ దేశాలలో మతోన్మాద శక్తులను బలపర్చటం ద్వారా కమ్యూనిస్టులను బలహీనపరచటానికి సామ్రాజ్యవాదులు పూనుకున్నారని చెప్పాడు. అందువల్ల భారతదేశ పరిస్థితిని మాత్రమే పరిశీలిస్తే మతోన్మాద శక్తులకు పునాది ఎక్కడ ఉన్నదనేది మనకు అర్థం కాదు. ప్రపంచ స్థాయిలో, భారతదేశంలోనూ మతోన్మాదం గురించి ఐజాజ్ అహ్మద్ సమగ్రంగా విశ్లేషణ చేశాడని ఈ నిర్ధారణలు వెల్లడిస్తున్నాయి.

ఉద్యమాలను గురించి చర్చించే సందర్భంలో పెట్టుబడిదారీ సంక్షోభం పరిష్కారం అయే పరిస్థితులు లేవని, కాబట్టి మార్క్సిజం అంతమైపోయింది, పెట్టుబడిదారీ విధానమే శాశ్వత పరిష్కారం అనే పరిస్థితి లేదని ఆయన పేర్కొన్నాడు. పెట్టుబడిదారీ విధానాన్ని అంతం చేయటానికి అనుకూలమైన పరిస్థితులు ఉన్నప్పటికీ, ఉద్యమాలు పెరుగుతున్నప్పటికీ పెట్టుబడిదారీ విధానాన్ని అంతం చేసే పరిస్థితులు ఎందుకు ఉత్పన్నం కావటం లేదనేది ప్రధానమైన ప్రశ్న. మనదేశంలో రైతు, కార్మిక ఉద్యమాలు జరుగుతున్నాయి. అరబ్ దేశాలలో పింక్, బ్లూ, ఎల్లో, వయొలెట్ తదితర విప్లవోద్యమాలు జరిగాయి. అమెరికాలోనే పెద్ద వాల్‌స్ట్రీట్ ఉద్యమం జరిగింది. ఫ్రాన్స్‌లో ఎల్లోవెస్ట్ ఉద్యమం జరిగింది. లాటిన్ అమెరికాలో అనేక ఉద్యమాలు జరుగుతున్నాయి. చిలీలో జరిగిన పెద్ద ఉద్యమం రాజకీయ మార్పుకు కూడా దారితీసింది. ఈ విధంగా అనేక ఉద్యమాలు జరుగుతున్నప్పటికీ అవి మరింత ముందుకుపోయి, వ్యవస్థను మార్చేవిగా ఎందుకు మారటం లేదని విశ్లేషణ చేసిన ఆయన రెండు విషయాలు చెప్పాడు. ఒకటి ఈ ఉద్యమాలన్నీ విడివిడిగా జరుగుతున్నాయి. ఒకదానికి మరొకదానికి సంబంధం లేదు. ఇవన్నీ కలిసి ఒక మహోద్యమంగా రూపొందటం లేదు. వీటన్నిటినీ ఒకచోటికి తెచ్చి, వాటికి కేంద్రంగా ఉండి ఒకే మార్గంలో నడిపించే నిర్మాణాత్మక శక్తి లేకపోవటం ఇందుకు కారణం. గతంలో కమ్యూనిస్టులు ఆ విధంగా సమన్వయం చేసే పాత్ర నిర్వహించారు. కమ్యూనిస్టులే విప్లవాలన్నింటినీ తీసుకురాలేదు. విప్లవం కోసం పోరాటం చేస్తున్న వివిధ శక్తులను సమన్వయం చేసి, కార్మికవర్గానికి కేంద్రంగా ఉంటూ ఆ పోరాటాలను ముందుకు తీసుకుపోయేవారు. ఇపుడు అటువంటి శక్తి లేదు. అనార్కిస్టులు, ఇతరులు ఇపుడు ఉన్నప్పటికీ దీర్ఘకాలిక లక్ష్యంతో పోరాటాలను సమన్వయం చేసి ముందుకు తీసుకెళ్ళాలనే దృక్పథానికి వారు వ్యతిరేకం. అందువల్ల విడివిడి శక్తులు పోరాటాలు చేయటం, తర్వాత చల్లారిపోవటం జరుగుతున్నది. ఓడినా, గెలిచినా గుణపాఠాలు తీసుకొని, తిరిగి ముందుకుపోవాలనే కేంద్రశక్తి లేకపోవటం బలహీనతగా ఉన్నది. మరి దీనికి పరిష్కారం ఏమిటి? ఈ శక్తులు అటువంటి స్థాయికి పెరిగే విధంగా నిర్మాణాన్ని పెంచుకోవటం మినహా మరో పరిష్కారం లేదు. ఆయన నొక్కి చెప్పదలచుకున్నది ఏమిటంటే ఇపుడు ఉద్యమాలు లేకపోవటం, ప్రజలు పోరాటాలలోకి రాకపోవటం కాదు. వివిధ రూపాల్లో ఉద్యమాలు, పోరాటాలు ఎక్కువగానే జరుగుతున్నాయి. అవి కమ్యూనిస్టుల నాయకత్వంలో లేకపోవచ్చు. కాని అవీ వర్గ పోరాటాలే. వాటికి మార్గం చూయించి, అనుసంధానం చేయగలిగే శక్తి లేకపోవటమే సమస్య. అటువంటి శక్తిని పుంజుకోవటం కోసం కృషి చేస్తే అది సాధ్యం అవుతుంది. అది నేడోరేపో జరగకపోవచ్చు. కాని అటువంటి కృషి అవసరం. ఆ కృషి ముందుకు పోయేకొద్దీ పెట్టుబడిదారీ సంక్షోభాన్ని విప్లవ సంక్షోభంగా మార్చటం సాధ్యమౌతుంది.

''పెట్టుబడిదారీ విధానం ఎప్పుడూ సంక్షోభంలోనే ఉంటుంది. కాని సంక్షోభం వచ్చిన ప్రతిసారీ విప్లవానికి దారితీస్తుందని అనుకోవద్దు. సంక్షోభాలు రకరకాల పద్ధతులలో పరిష్కారం అవుతాయి. మొదటి పద్ధతి ఏమిటంటే సంక్షోభకాలంలో పెట్టుబడిదారీ విధానంలో ఉత్పత్తి అయిన సంపదను నాశనం చేసి, తిరిగి సంపదను సృష్టించటానికి పూనుకుంటారు. రెండవ పద్ధతి ఒక పద్ధతిలో పనిచేస్తుంటే సంక్షోభం వస్తే కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని, కొత్త ఉత్పత్తి పద్ధతులను అభివృద్ధి చేసి, తరిగిపోయిన లాభాన్ని తిరిగి సంపాదించటం ద్వారా సంక్షోభాన్ని అధిగమిస్తారు. మూడవ పద్ధతి తీవ్రమైన సంక్షోభకాలంలో చైతన్యవంతమైన ప్రజలు ఒక నిర్మాణాత్మక శక్తి నాయకత్వాన సమీకృతమై, సంక్షోభంలో ఉన్న పాలకవర్గాలను అధికారం నుండి కూలదోసి, నూతన వర్గాలు అధికారానికి రావటం. ఇది జరిగినపుడే విప్లవం జయప్రదం అవుతుంది. అది జరగకపోతే కార్మికులు, పెట్టుబడిదారులు కూడా నష్టపోతారు. పెట్టుబడిదారీ వర్గం తిరిగి తన విధానాలను ముందుకు తీసుకుపోవటం కొనసాగిస్తుంది. అందువల్ల సంక్షోభం వచ్చినంత మాత్రనే పెట్టుబడిదారీ విధానం దానంతట అదే నాశనమైపోతుందని భావించరాదు. దానిని నాశనం చేసే శక్తి ఉండి, ప్రజలను సమీకరించి, పాలకవర్గాలను అధికారం నుండి కూలదోయటానికి చైతన్య పూర్వకంగా ప్రయత్నం చేస్తేనే అది సాధ్యమౌతుంది. అలా జరగకపోతే

(మిగతా 30వ పేజీలో)



epaper.prajasakti.com

ఐజాజ్ అహ్మద్ వ్యాసావళి



# ఆధునికానంతరవాదం : పూర్వాపరాలు

**(ఆధునికానంతరవాదం (పోస్ట్ మోడ్రనిజం) నేటి రాజకీయ, సైద్ధాంతిక, సాంస్కృతిక, సామాజిక జీవితాన్ని పెద్దఎత్తున ప్రభావితం చేస్తున్నది. 2010 డిసెంబరు-2011 జనవరి నెలల్లో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కేంద్ర కమిటీ సభ్యులకు హైదరాబాదు, చెన్నయ్ నగరాల్లో నిర్వహించిన అఖిలభారత రాజకీయ తరగతుల్లో ఈ అంశంపై ప్రొఫెసర్ ఐజాజ్ అహ్మద్ పాఠం బోధించారు. ఈ పాఠ్యాంశాన్ని రెండు భాగాలుగా మార్క్సిస్టు పాఠకులకు అందజేస్తున్నాం..... సంపాదకుడు.)**

'ఆధునికాంతరవాదం' అనే పదంతో చాలా చిక్కులున్నాయి. సందర్భాన్ని బట్టి దీని అర్థాలు మారిపోతుంటాయి. తార్కికంగా చూస్తే అధునిక కాలానికి అనంతరం సంభవించేదిగా 'ఆధునిక' 'అనంతరవాదానికి' అర్థంగా చెప్పుకోవచ్చు.

కళలు, సాహిత్యంలో చోటు చేసుకున్న కొత్త పోకడలను ఆధునికానంతర వాదానికి ప్రతీ కలుగా చెప్పుకోవడం కద్దు. చిత్రకళలో క్యూబిజం, సర్రియలిజం వంటివి, జేమ్స్ జాయిస్, ప్రౌస్ట్, ఇలియట్ తదాది రచయితల రచనలు ఈ కోవ కిందకు వస్తాయి. కాని ఆధునికాంతర వాదం అనే పదానికి చాలా విస్తృతి ఉంది. ఫోకాల్ట్, డెరిడా వంటి అనేక మంది తత్వవేత్తల కు అధునికాంతర వాదులు అన్నపేరు. చిత్రం ఏమిటంటే వీళ్ళెవరికీ ఆధునికతతో పేచీ లేదు. వారికున్న పేచీ అల్లా సాంస్కృతిక పునరుజ్జీవనం దాని వారసత్వంగా పుట్టుకొచ్చిన మార్క్సిజం తోనే.

కళలు, సంస్కృతి, సాహిత్యాల్లో, ఆధునికానంతరవాదం గురించి మరోసారి చెప్పుకుందాం. ప్రస్తుతానికి తత్వశాస్త్రంలో అధునికానంతర వాదం గురించి మాట్లాడుకుందాం. ఎందుకంటే తత్వశాస్త్ర ఆధునికాంతర వాదం మార్క్సిజానికి ప్రత్యామ్నాయ తత్వశాస్త్రమనీ, మార్క్సిస్టు అనంతర రాజకీయాలకూ, కార్యాచరణకూ పుట్టినిల్లని చెబుతుంటారు. అందుకే మనం ఆధునికానంతరవాదపు సైద్ధాంతిక తాత్విక ఆలోచనలనూ, రాజకీయాలపై వాటి ప్రభావాలనూ అంచనా వేద్దాం.

**ఆధునికానంతరవాదం -అంతర్జాతీయం**

అధునికాంతరవాదం ప్రపంచవ్యాప్తం కావడానికన్నా ముందు తొలుత అమెరికాలోనూ తరువాత ఫ్రాన్స్‌లోనూ ఏ చారిత్రక నేపథ్యంలో తలెత్తిందీ మనం క్షుణ్ణంగా పరిశీలిద్దాం. చాలావరకు తాత్విక ఆలోచనలకు అంతో ఇంతో స్వయం ప్రతిపత్తిగల చరిత్ర ఉంటుంది. ఉదాహరణకు డెరిడా రాసిన తత్వశాస్త్ర వ్యాసాలు మొత్తంగా చూస్తే కౌర్ట్ ప్రతిపాదించిన తాత్విక 'హేతుబద్ధత' మీద విమర్శ రూపంలోనే ఉంటుంది. సరే వాటిని వదిలేద్దాం. డెరిడా స్వయంగా మార్క్స్ మీద ఒక పుస్తకం రాశాడు. అందులో అనేక రాజకీయ ప్రతిపాదనలు చేశాడు. ఆధునికానంతరవాదం లక్షణమే ఇది. మార్క్స్‌నూ, మార్క్సిజాన్నీ విమర్శించడమే దాని లక్ష్యం. అందుకే ఆధునికానంతవాదం ఏ రాజకీయాల నేపథ్యంలో, ఏ లక్షణాలతో ఆవిర్భవించిందీ తెలుసుకోవడం ముఖ్యం అని నేను అన్నది.

అమెరికాలో 1950 దశకంలో ఈ వాదానికి బీజం పడింది. ఆ కాలంలో పెట్టుబడిదారీ వ్యవస్థ నిలకడగా ఉంది. ఓ వెలుగు వెలుగుతూ ఉండేది. ఫ్రాన్స్‌లో మరో పదేళ్ళ తరువాత దానికి ప్రాభవం లభించింది. ఫ్రాన్స్ కార్మికో ద్యమం, వామపక్ష ఉద్యమాలు పూర్తిగా దెబ్బ తినిపోయిన నేపథ్యంలో అమెరికా ఆలోచనలతో అంటుకట్టి మరీ ఆధునికానంతర వాదాన్ని ఫ్రెంచ్ వారు తలకెత్తుకున్నారు. అధునికానంతర వాదం హవా ప్రపంచ మంతటా వీస్తున్నా, ఈ వాదం మూలాలు ఏ దేశంలో పుట్టాయో, ఎందుకు పుట్టాయో గుర్తిస్తే దాని లక్షణాలను ఇట్టే గ్రహించవచ్చు.

అధునికానంతవాదం అనే పదానికి ఫ్రెంచి భావజాలం” పుట్టిల్లు అని చాలా మంది భావిస్తున్నారు. కానీ ఈ పదం 1870ల నుండీ చలామణీలో ఉంది.

**బ్రిటన్‌లోనూ, అమెరికాలోనూ**

అయితే దాని అర్థ, తాత్పర్యాలు వేరు. ఇవాళ ఈ పదాన్ని ఏ ఉద్దేశంతో వాడుతున్నారో దానికి బీజం పడింది మాత్రం 1950వ దశకం లో. కొద్ది మంది అమెరికన్ సామాజిక వెత్తలు దీన్ని చలామణీలోకి తెచ్చారు. ప్రచ్ఛన్న యుద్ధం నెలకొన్న తొలి దశాబ్దంలోనే మార్క్సిజాన్నీ, వర్గపోరాట సూత్రాన్నీ పలుచన చెయ్యడానికి ఆధునికానంతర వాదాన్ని చలామణీలోకి తెచ్చారు. 1967 – 69 మధ్య కాలంలో ఫ్రాన్స్ తదితర యూరప్ దేశాలలో వామపక్ష ఉద్యమాలు బలంగా ఎగిసి, దెబ్బతిన్న కాలంలో అమెరికాలో చివురు తొడిగిన ఆధునికానంతర వాదాన్ని కొంత మంది ఫ్రెంచి తత్వవేత్తలు అందిపుచ్చుకున్నారు. ఫ్రెంచి తత్వశాస్త్రానికి అనుగుణంగా మెరుగులు దిద్ది ఆంగ్లో – సాక్సన్ (అమెరికా – బ్రిటన్) దేశాలకు ఎగుమతి చేశా రు. క్రమంగా ఈ రెండు దేశాల విశ్వవిద్యా లయాల్లో ఆధిపత్యం సంపాదించింది ఈ సంకర అధునికనంతర వాదం. అక్కడి నుండి క్రమంగా కమ్యూనిస్టు ఉద్యమాలు ఉన్న చోటికల్లా పాకింది. ఈ క్రమంలోనే భారతదేశ తీరాన్ని తాకింది.

అమెరికా ఈ ఆధునికాంతర భావజాలాన్ని ఎలాంటి పరిస్థితుల్లో అంటుకట్టిందో పరిశీలిద్దాం. రెండవ ప్రపంచయుద్ధం తరువాత అమెరికా ప్రపంచంలోనే అగ్రరాజ్యంగా అవతరించింది. యుద్ధ నేపథ్యంలో సాధించిన శాస్త్ర సాంకేతిక ప్రగతి (టెలికాం, విమానయాన, కంప్యూటర్ రంగాలు – అణుబాంబు తయారీ వంటివి) దన్నుతో ఆర్థికంగా బలీయమైన శక్తిగా అవతరించింది. దేశంలో పెద్ద ఎత్తున ఉపాధి కల్పించడంలో సఫలమయింది. యూరప్ ఖండమంతటా ఆర్థికంగా, సైనికపరంగా పట్టుబిగించింది. అక్కడి నుండి రెండు దశాబ్దాలలో జగద్విఖ్యాతిగాంచిన విశ్వవిద్యాలయ



epaper.prajasakti.com

వ్యవస్థను నెలకొల్పింది. ఈ విద్యాలయాల ద్వారా బూర్జువా భావజాలాన్ని విస్తృతంగా చలామణిలోకి తెచ్చింది. ఈ కాలంలో అమెరికా దన్నుతో ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ సుదీర్ఘ కాలంపాటు సంపదను విపరీతంగా పోగేసు కుంది. అత్యధిక వృద్ధిరేటు నమోదు చేసింది. ఉత్పత్తి, యాజమాన్యం, కమ్యూనికేషన్ రంగాల్లో పెను మార్పులు సంభవించాయి. యూరప్‌లో మాదిరి అమెరికాలో అంత బలమైన కమ్యూనిస్టు ఉద్యమమూలేదు, మార్క్సిస్టు సంస్కృతీ అంత ప్రభావం చూపేదిగా లేదు. రాజకీయంగా అత్యంత మితవాద సంస్కృతిని ప్రోది చేశారు. భవిష్యత్ పట్ల అపారమైన ఆశలు కల్పించారు. అమెరికాలో కాలు పెట్టడమే బంగారు భవిష్య త్తుకు బాటగా భావించే స్థితి ఏర్పడింది. వెరసి ప్రజా సంస్కృతి, ఉన్నతి సమాజం, అధునికా నంతర సమాజం, పారిశ్రామికీకరణానంతరం సమాజం (పోస్ట్ ఇండస్ట్రియల్ సొసైటీ), సమాచార సంపన్న సమాజం, జ్ఞాన సమాజం (నాలెడ్జ్ సొసైటీ) వంటి అనేక కొత్త పదబంధాలు చలామణీలోకి వచ్చాయి. ఈ నేపథ్యాన్ని మరిచి పోయి 'అధునికానంతర వాదం' ఫ్రెంచి తత్వ శాస్త్రం నుండి, ఉద్భవించింది అనే తప్పుడు సూత్రీకరణలు చేస్తున్నారు.

అధునికానంతరవాదం అనే పదాన్ని అమెరి కన్లు రెండు అర్థాల్లో వాడేవారు. సాహిత్యం, కళలు, సంస్కృతి విషయాల్లో విస్తృతంగా వాడటంతోపాటు శాస్త్ర సాంకేతిక రంగం, ఉత్పత్తి – ఆర్థిక రంగాలు, సామాజిక నిర్మాణం – ఈ విషయాల్లో కూడా అధునికానంతర వాదాన్ని బలంగా చొప్పించారు. ఈ మహా కథనానికి కేంద్ర బిందువు, ఒక రకంగా కథా నాయకుడిగా చెప్పుకోవాల్సింది కంప్యూటర్ గురించే. సామాజిక శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు, సైన్సు రచయితలు – వీళ్ళంతా నిత్యం కొలిచే దైవంగా మారిపోయింది కంప్యూ టర్. వీళ్ళ ఆరాధన ఎంత దాకా పోయిందంటే పెట్టుబడిదారీ విధానం ఇంత పెద్ద ఎత్తున సంపద సృష్టించడానికి మూలం, కీలకం కంప్యూటర్ రంగం ద్వారా సాధించిన శాస్త్ర సాంకేతిక ప్రగతియే అనీ, ఇక పెట్టుబడిదారీ విధానానికి ఎదురేలేదు. తిరుగేలేదు అని తాము నమ్మిందే గాక, ప్రపంచాన్నీ బలంగా నమ్మించారు. సరే పేదవాడి సంగతంటారా – వీళ్ళకీ ఏదో ఒక రోజు వస్తుంది. అప్పటిదాకా ఎదురు చూడాలి తప్పదు అని ఆశల ఊయల్లో ఊరేగింపు చేస్తూనే ఉన్నారు. పేదల సంగతి కాసేపు పక్కన పెడితే ఈ ఉచ్చులో ప్రధానంగా చిక్కుకుంది మధ్య తరగతి జనాభా. అభివృద్ధి చెందిన పెట్టుబడి దారీ వ్యవస్థ అంతకు ముందెన్నడూ కనీవినీ ఎరుగనంతటి సంపదతో తులతూగుతూ 'సంక్షేమ పథకాలకు' పెద్ద పీట వేసేసరికి కార్మిక వర్గంలో గణనీయమైన భాగం మధ్య తరగతి జనాభాగా అవతరించింది. ఏ సామాజిక శాస్త్రాన్ని చూసినా అమెరికాలో రెండు తరగతుల జనాభా – ఒకటి కార్మిక వర్గం, రెండవది మధ్యతరగతి – ఉన్నట్లు చెప్పుకొస్తారు. స్వంత ఇల్లు, స్వంత వాహనం ఉన్న వాళ్ళంతా మధ్య తరగతి కోవలోకి వస్తారు. అమెరికాలో పెట్టుబడిదారీ విధానం సాధించిన అభివృద్ధి వల్ల నానాటికీ కార్మికవర్గం పలచబడి, మధ్య తరగతి జనాభా పెరిగిపోయింది. ఈ క్రమం లోనే కమ్యూనిస్టు రాజకీయాలు ప్రాసంగికత కోల్పోయాయి (ఇర్రెలవెంట్) అంటుంటారు. శరవేగమైన ఆర్థికాభివృద్ధి, పూర్తికాలపు ఉపాధి (పర్మినెంట్ ఉద్యోగాలు), కీన్స్ పునఃపంపిణీ సిద్ధాంతం, పెట్టుబడికి – శ్రమకి మధ్య కుదిరిన కొత్త సంధిమూలంగా ఉత్పాదకత పెరిగిన మేరకు జీతాలు పెరగడం – ఇవన్నీ కమ్యూనిస్టు సిద్ధాంతం వైపు కార్మిక వర్గాన్ని ఆకర్షించకుండా నిలవరించాయి అని కొంతమంది అమెరికన్ సామాజిక శాస్త్రవేత్తలు తీర్మానించారు.

లైయెటార్డ్ వంటి తత్వవేత్తలు 'సమాజాన్ని కంప్యూటరీకరిండం' అని తదనంతర కాలంలో అన్నారు. కానీ అమెరికన్ పెట్టుబడిదారీ చరిత్ర 1950 – 60 దశకంలో ఈ నిర్ణయాత్మక మలుపు తిరిగింది. ఐరోపా ఆర్థిక వ్యవస్థలు అంతకు ముందు వ్యవసాయం నుండి చిన్న ఉత్పత్తుల్లోకి మౌలికంగా మారుతూ వచ్చాయి. శాస్త్ర సాంకేతిక విజ్ఞానం ఉత్పత్తి ఆధారిత సమాజాలను సమాచార సమాజాలుగా, పారిశ్రామిక దశ నుండి పారిశ్రామికానంతర దిశగా నడుపుతాయని సరికొత్త సూత్రీకరణలు ముందుకు వచ్చాయి. ఈ తాత్విక సూత్రీకరణలు, వీటికి కొనసాగింపుగా కళా, సారస్వత రంగాల్లో వచ్చిన మార్పుల విషయాలు ఎలా ఉన్నా 'అధుని కానంతరవాదం' అనబడే ఈ కొత్త సమాజానికి సిద్ధాంతం మూలాలు ఫోర్డ్ ఉత్పత్తి విధానాల నుండి సరికొత్త ఉత్పత్తి విధానాలకు మారడంలో ఉన్నాయి. ఫోర్డ్ ఉత్పత్తి విధానాలంటే కేంద్రీకృత భారీ ఉత్పత్తి విధానం. తదనంతర కాలంలో లాభాల గరిష్ట స్వీకరణకు ఈ భారీ ఉత్పత్తి విధానాన్ని నవీకరించి చిన్న చిన్న ముక్కలుగా విడగొట్టి 'అసెంబ్లింగ్' ఉత్పత్తి విధానానికి మళ్ళింది. పెట్టుబడిదారీ వ్యవస్థ, ఒక సరుకును ఉత్పత్తి చెయ్యడానికి అవసరమైన విడిభాగాలను కారుచౌకగా శ్రమశక్తి లభించే వేర్వేరు – చోట్ల ఉత్పత్తి చేసి వాటిని ఒక చోట 'అసెంబ్లింగ్' చేసే ఉత్పత్తి విధానం విశ్వవ్యాప్తమైంది. అమెరికన్ బహుళజాతి కంపెనీలు కారు చౌకగా శ్రమశక్తి లభించే వర్ధమాన దేశాలన్నింటా అనుబంధ సంస్థలను నెలకొల్పి గరిష్టంగా లాభాలు పోగుచేసుకునే పన్లో పడ్డాయి. భారీ పరిశ్రమలు నెలకొల్పడం, ఒకే ప్రాంతం, ప్రదేశంలో ఉత్పత్తిని కేంద్రీకరించడానికి స్వస్తి చెప్పడంతో సంఘటిత కార్మికవర్గం విచ్ఛిన్నమై రకరకాల ప్రాంతాలకూ, ప్రదేశాలకూ ఏకంగా ఖండాంతర ప్రాంతాలకూ, ప్రదేశాలకూ విస్త రించబడింది. నూతన సాంకేతిక పరిజ్ఞానం వల్ల క్రమేపీ ఖాకీచొక్కా కార్మికుల సంఖ్య తగ్గి తెల్లచొక్కా కార్మికులసంఖ్య పెరుగుతూ వచ్చింది.

'పారిశ్రామికానంతర' దేశం అంటే ఉత్పత్తి విధానంలో వచ్చిన ఈ మార్పు ఒక్కటే కాదు, ఇంకా అనేకానేక మార్పులు చోటు చేసుకున్నాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ ఉత్పత్తి పెంపుదల కన్నా వినిమయ పెంపుదల మీదకు ప్రధానంగా దృష్టిమళ్ళించింది. దేశ ప్రయోజనాలనూ, ప్రాధాన్యతలనూ బట్టి కాకుండా తమ సరుకులకు డిమాండ్ సృష్టించుకుని అందుకు అనుగుణంగా పరిశ్రమలు పెట్టే పరిస్థితుల సృష్టించుకున్నాయి. కార్పొరేట్ సంస్థలు, పెరిగిన ఉపాధి అవకాశాలు, పూర్తికాలపు ఉద్యోగితల (ఫుల్ ఎంప్లాయ్‌మెంట్ / పర్మినెంట్ ఎంప్లాయిమెంట్) వల్ల పెరిగిన కొనుగోలు శక్తికి తోడు వాణిజ్య ప్రకటనల ప్రచారంతో ప్రజలలో వినిమయదారీ తత్వాన్ని పెంపొందించి నూతన సరుకులకు మార్కెట్‌లు సృష్టించుకోవడం మొదలుపెట్టాయి.

ఉత్పతి – వినిమయరంగాలను రెండింటినీ మొత్తంగా నూతన సాంకేతిక పరిజ్ఞానంతో నడిపించుకోవడం ద్వారా అంతకుముందు వరకూ ఉత్పత్తి కేంద్రంగా సాగిన ప్రణాళికల విధానానికి గండిపడింది. ఆ స్థానాన్ని సమాచార సాంకేతిక పరిజ్ఞానం ఆక్రమించుకోసాగింది. ఫలితంగా పారిశ్రామిక కార్మికుల సంఖ్యకన్నా సేవారంగ ఉద్యోగుల అవసరం నానాటికి హెచ్చు కాజొచ్చింది.


epaper.prajasakti.com

> **" ఉత్పత్తి - వినిమయరంగాలను రెండింటినీ మొత్తంగా నూతన సాంకేతిక పరిజ్ఞానంతో నడిపించుకోవడం ద్వారా అంతకుముందు వరకూ ఉత్పత్తి కేంద్రంగా సాగిన ప్రణాళికల విధానానికి గండిపడింది. ఆ స్థానాన్ని సమాచార సాంకేతిక పరిజ్ఞానం అక్ర మించుకోసాగింది. ఫలితంగా పారిశ్రామిక కార్మికు ల సంఖ్యకన్నా సేవారంగ ఉద్యోగుల అవసరం నానాటికి హెచ్చు కాజొచ్చింది. కంప్యూటరీకరణ, రోబోల వినియోగంతో ఉత్పత్తి రంగంలో కార్మికుల సంఖ్యను అతి కనిష్ట స్థాయికి కుదించుకున్నారు. "**

కంప్యూటరీకరణ, రోబోల (యంత్రమానవుడు) వినియోగంతో ఉత్పత్తి రంగంలో కార్మికుల సంఖ్యను అతి కనిష్ట స్థాయికి కుదించుకున్నారు. (బహుశా దీనివల్ల తగ్గిపోయిన కార్మికులకు పెద్ద జీతాలు రావడంతో వారు 'మధ్య తరగతి'లో చేరి ఉంటారు). వీటన్నింటికీ తలమానికంగా, వనరులు, విధానపర నిర్ణ యాల మీద బహుళజాతి కార్పొరేట్ కంపెనీల ఆధిపత్యం నానాటికీ బలపడుతూ వచ్చింది. పారిశ్రామికానంతర దశగా చెప్పుకుంటున్న ఈ కాలంలో కొత్తగా చోటు చేసుకున్న పరిణామాలు స్థూలంగా ఇవీ..

దీనికితోడు ఆధునిక పెట్టుబడి స్వభావం లోనూ మార్పులు వచ్చాయి. కార్పొరేట్ సంస్థలు ప్రజల నుండి షేర్ల రూపంలో పెట్టుబడిని సమీకరించడం ద్వారా పెట్టుబడిని సామాజీక రించారు. అప్పటిదాకా కొద్ది కుటుంబాల చేతుల్లో వున్న బడా కంపెనీలు 'ఫ్యామిలీ బిజినెస్'కి స్వస్తి చెప్పి ప్రజల భాగస్వామ్యం కల్పించడం ద్వారా సంపదను సామాజీకరించే బాధ్యతను తలకెత్తుకున్నాయి అని కార్పొరేట్ కంపెనీలకు లేని ఉదాత్తతను అంటగట్టే ప్రచారం పెద్దఎత్తున సాగింది. కార్పొరేట్ కంపెనీలు టెక్నోక్రాట్‌లకు భారీ జీతభత్యాలు ముట్టచెప్పి కంపెనీలకు సిఇఓలను నియమించడం నిర్ణయాధికారం వాళ్ళకే కట్టబెట్టడం – తద్వారా 'తెలివితేటలకు' పెద్దపీట వేసినట్లు చూపించడం... ఇవన్నీ ప్రజల్లో అనేక భ్రమలు కల్పించాయి. పారిశ్రామికానంతర సమాజంతో తెలివి ఎవరి సొత్తయితే వాళ్ళంతా ఒక టాటానో, బిర్లానో, బిల్‌గేట్స్ లేక అంబానీయో కావచ్చనే సత్యదూరమైన ప్రచారంతో హోరెత్తించారు. ఈ నూతన సమాజాలు ఉత్పత్తి కేంద్రకంగా పని చెయ్యట్లేదు. కేవలం మేధో నైపుణ్యం, సాంకేతిక పరిజ్ఞానాల ఆధారంగా నడుస్తాయి. కాబట్టి పెట్టుబడిదారీ వర్గం కార్మికవర్గం అన్న విభజన ఊసే వుండదు. ఈ రెండూ లేనప్పుడు ఇంక మార్క్సిజానికీ, వర్గ రాజకీయాలకూ చోటెక్కడ అనేది ఆధునికానంతరవాదుల వాదన. నిజానికి ఈ వాదన పెద్ద అతుకుల బొంత. ఆ వివరాలు తర్వాత పరిశీలిద్దాం. అసలు పెట్టుబడిదారీ విధానాన్ని సమర్థించే తత్వవేత్తలే ఈ వాదనలతో పూర్తిగా ఏకీభవించని పరిస్థితి నెలకొన్నది. సైన్సు, మీడియా విస్ఫోటనాలను కలగలిపి సరికొత్త అభివృద్ధి నమూనాలుగా కీర్తించే క్రమంలో 'అవధులు లేని సమాచార, వినిమయ సమాజం' అని కొందరంటే, వినిమయదారీ తత్వాన్ని తెగనాడే వాళ్లు కొందరు. రాజకీయ జోక్యం, సంక్షేమ పథకాలు ఉండాలని చెప్పేవాళ్లు మరికొందరు. అవి అక్కరలేదని వాదించే వాళ్లు కొందరు. ఇర్వింగ్ హోవె, డేనియల్ బెల్ వంటి మాజీ ట్రాట్స్కీ యిస్టులు....కాస్త సోషల్ డెమోక్రసీనీ, కాస్త సాంస్కృతిక ఔన్నత్యాన్నీ కలగలిపి తమదైన రీతిలో ఒక ఆధునికానంతరవాద సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. ఒకప్పుడు సమాజం 'సేవింగ్స్' (పొదుపు) ను ప్రోత్సహించేది. ఆధునికా నంతరవాదం 'వినిమయాన్ని' ప్రోత్సహిస్తుంది. 1930ల తరువాత ఈ వినిమయ తత్వం ఎక్కడి దాకా పోయిందంటే 'అప్పు చెయ్యి', 'ఖర్చు చెయ్యి' అనే స్థాయికి వచ్చేసింది.

పెట్టుబడిదారీ విధాన అభివృద్ధికి 'ఉత్పత్తి'ని ఒక సాధనంగా గాక 'వినిమయాన్ని' ఇంజనుగా తగిలించే పద్ధతులు వచ్చేశాయి. అయితే డేనియల్ బెల్ మాత్రం ఈ రకమైన వినిమ ఉన్మాదం విలువల పతనానికి దారి తీస్తుందని అంటాడు. సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి సాధించినా రెండో వైపున సామాజిక విలువల పతనం అనివార్యం అవుతుందని మరో సూత్రీకరణ చేస్తాడు. ఆధునికానంతరవాదం పేరిట చలామణిలోకి వచ్చిన సూత్రీకరణలకు పునాది ఒక్కటే. కార్మికవర్గం తన విప్లవకర స్వభావాన్ని కోల్పోయింది కాబట్టి చారిత్రాత్మక విప్లవకర మార్పులు ఇక సాధ్యం కావు అనే నిర్ధారణకు వచ్చేశారు. సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం తరువాత గత 40 ఏళ్లుగా ఆధునికా నంతర వాదులకు గిరాకీ పెరిగింది. ఉదారవాద పెట్టుబడిదారీ విధానానికి వేరే ప్రత్యామ్నాయం లేదని, అలాంటి ప్రత్యామ్నాయం కోసం చేసే కృషి దండగమారిదని చెప్పడం, ప్రపంచీకరణకు వత్తాసు పలకడం ఆధునికానంతర వాదుల ఏకైక ఎజెండా.

ఇంకా విచిత్రం ఏమంటే ఆధునికానంతర వాదుల్లో చాలామంది మాజీ కమ్యూనిస్టులు. ఇంకొందరు ఇప్పటికీ మార్క్స్ పేరు జపిస్తూనే వుంటారు. ఇర్వింగ్ హోవే, డేనియల్ బెల్, హెర్బర్ట్ మార్క్యూజ్‌లు ఈ కోవకు చెందుతారు. మార్క్యూజ్ మాజీ ట్రాట్స్కీయిస్టు. ఫ్రాంక్‌ఫర్ట్ స్కూలు సభ్యుడిగా వుండేవాడు. రెండవ ప్రపంచయుద్ధ కాలంలో అమెరికాకు వలస వచ్చి అక్కడే స్థిరపడిపోయాడు. 1960వ దశకంలో బాగా పేరున్న తత్వవేత్తల్లో ఒకరిగా చెప్పుకోవచ్చు. 'వన్ డైమెన్షనల్ మాన్' (ఏక తలం మానవుడు) అన్న పుస్తకం రాశాడు. హెడోనిస్టు – మార్క్సిస్టు రాజకీయాలను (మార్క్సునీ, ఫ్రాయిడ్‌నీ, శృంగార స్వేచ్ఛనీ కలగలిపి చెప్పడం) ప్రచారం చేస్తాడు. కార్మికవర్గం క్షీణదశలో వుందనీ, సంస్కరణవాద వర్గంగా మారిపోతుందనీ విమర్శిస్తాడు. విద్యార్థులూ, విద్యార్థి ఉద్యమాలూ, అలగా జనాలే (లంపెన్స్) భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన బాధ్యతను తలకెత్తుకుంటారని ఆశిస్తుంటాడు. 1960వ దశకంలో అమెరికా మహానగరాల్లోని మురికివాడల్లో రేకెత్తిన ఆందోళనలనూ, యుద్ధ వ్యతిరేక ఉద్యమంలో వాళ్ళ చురుకైన పాత్రనూ ఇందుకు ఉదాహరణలుగా చెబుతుంటారు. 'మార్క్సిజాన్నే' నమ్ముతాం అని చెప్పుకుంటూ... కార్మివర్గం 'అగ్రగామి విప్లవదళం'గా తన స్వభావాన్ని కోల్పోయింది అన్న సిద్ధాంతాన్ని అమెరికన్ తరహా 'న్యూ లెఫ్ట్' రాజకీయాలతో. అను సంధానం చెయ్యడమే మార్క్యూజ్ తరహా సిద్ధాంత ప్రచారం. వర్గ రాజకీయాల ఊసెత్తకుండా పరాయీకరణ, సాంస్కృతిక విప్లవం, మైనారిటీల హక్కులు, సమరశీల విద్యార్థి రాజకీయాలు, స్థానిక తిరుగుబాట్లు వంటి విడివిడి అంశాల మీద నిర్మాణాత్మక కృషి జరగాలని కోరుకోవడమే ఈ తరహా రాజకీయాల లక్ష్యం. 1960వ దశకం నుండి యువజనోద్యమాలలో, మరీ ముఖ్యంగా శ్వేత



epaper.prajasakti.com

జాతి మధ్య తరగతికి చెందిన ఉద్యమాలలో వర్గ రాజకీయాలకు బదులు ఈ తరహా సాంస్కృతికోద్యమాలు ఊపందుకున్నాయి. పెట్టుబడిదారీ విధానంలోని అసలు సమస్య ఉత్పత్తి క్రమంలో దాగివున్న శ్రమదోపిడి కాగా ఈ తరహా ఉద్యమాలు పెట్టుబడిదారీ ఉత్పత్తి వల్ల పోగుపడిన సంపద అసమాన పంపిణీ, తద్వారా చోటు చేసుకుంటున్న పరాయీకరణలే అసలు సమస్యలుగా భావించి వీటిని సరిదిద్దాలనే డిమాండుతో ఉద్యమ్యాలు చేస్తున్నారు.

ఏతావాతా పరిశీలిస్తే 1960వ దశకంలో చెలరేగిన తిరుగుబాట్లు ఆధునికానంతర రాజకీయాలకు పురుడు పోశాయని చెప్పుకోవచ్చు. ఇందుకు రెండు కీలక పరిణామాలు దోహదం చేశాయి. విద్యార్థి ఉద్యమాలు మధ్యతరగతి దన్నుతో ఉవ్వెత్తున సాగుతున్నప్పుడు, సంక్షేమ రాజకీయాల ప్రభావంలో పడిన సంఘటిత కార్మికవర్గం ఏమీ పట్టనట్లు మిన్నకుండిపోయింది. సామాజిక మార్పుకు అగ్రగామిదళంగా వ్యవహరించాల్సిన కార్మికవర్గం తన విప్లవకర స్వభావాన్ని కోల్పోయిందన్న సూత్రీకరణను నిజం చేస్తూ, ఈ ఉద్యమాలను సమాజంలో మౌలిక మార్పులకు దారితీసే విప్లవోద్యమంగా ఇతర రంగాలకు విస్తరింపచేయడంలో తన పాత్రను నిర్వర్తించలేకపోయింది.

కార్మికవర్గం అనుసరించిన ఈ ఉదాసీన వైఖరే ఆధునికానంతరవాద రాజకీయాల్లో ముఖ్య భాగమైపోయింది. అలాగే వియత్నాం యుద్ధ వ్యతిరేక ఉద్యమం ప్రజలలో బలమైన యుద్ధ వ్యతిరేక కాంక్షను రేకెత్తించింది. ఈ ఉద్యమం గొప్ప భావ సాంస్కృతిక విప్లవానికి దారితీసింది. బూర్జువా సమాజంలోని అణచివేత ధోరణులకు వ్యతిరేకంగా రకరకాల రూపాల్లో నిరసన వ్యక్తమైంది. ఆహార్యం, సంగీతం, మత సాంస్కృతిక విశ్వాసాలు, సెక్స్ సహా అనేక రంగాలలో నూతన ధోరణులకు ఊతమిచ్చింది. అయితే ఈ మార్పులన్నీ 'బూర్జువా వ్యక్తివాదం' పరిమితుల్లోనే కొనసాగాయి తప్ప కార్మివర్గం జోక్యం లేనందువల్ల ప్రత్యామ్నాయ శ్రామిక సంస్కృతి సృష్టికోసం ప్రయత్నాలు జరగలేదు. యువతరంలో నెలకొన్న వ్యక్తివాద స్వేచ్ఛా ధోరణులే 'ఫిలాసఫీ ఆఫ్ డిజైర్' పేరిట ఫ్రెంచి ఆధునికానంతర వాదంలోకి వచ్చి చేరాయి. ఫోకాల్ట్ తదితర తత్వవేత్తలు ఈ ధోరణులను విస్తృతంగా ప్రచారంలోకి తెచ్చారు. సమిష్టి రాజకీయ కార్యాచరణకు బదులు 'వ్యక్తివాదానికీ' 'స్వీయ సంతృప్తికీ' పెద్దపీట వేస్తూ ఆధునికా నంతర వాదం చలామణిలోకి వచ్చింది.

1968 విద్యార్థి ఉద్యమం తరువాత ఫ్రాన్స్‌లో ఆధునికానంతరవాదం తనదైన ముద్ర వేసిన చారిత్రక సందర్భం ఏమిటో ఇప్పుడు మనం పరిశీలిద్దాం:

అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ వ్యవస్థలో చోటు చేసుకున్న సామాజిక ఆర్థిక మార్పులు ఫ్రాన్స్‌లో కాస్తంత ఆలస్యంగా, నాటకీయంగా చోటు చేసుకున్నాయి. పంతొమ్మిదవ శతాబ్దాం తానికే అమెరికా పారిశ్రామికంగా అగ్రరాజ్యంగా ఎదిగింది. మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత ప్రపంచ ఆర్థిక శక్తిగా మారింది. ఇందుకు భిన్నంగా రెండవ ప్రపంచయుద్ధం ముగిసే నాటికి కూడా ఫ్రాన్స్ గ్రామీణ సమాజం కేంద్రకంగా ఉండింది. అలాగే అమెరికాకు భిన్నంగా ఇక్కడ బలమైన కార్మికోద్యమం కొనసాగింది. యుద్ధానంతర కాలంలో 26 శాతం ఓటింగ్ సంపాదించుకుని ఫ్రెంచ్ కమ్యూనిస్టు పార్టీ అతిపెద్ద ఏకైక రాజకీయ శక్తిగా ఎదిగింది. అయితే ఆ తర్వాత రెండు దశాబ్దాలకే ఈ పరిస్థితి తిరగబడి పోయింది. ఇందుకు ప్రధాన కారణం 'మార్షల్ ప్లాన్' పేరిట అమెరికా పెద్దఎత్తున పెట్టుబడిని చొప్పించడం. తద్వారా ఐరోపా పెట్టుబడిదారీ చరిత్రలోనే అంతకుముందు కనీవినీ ఎరుగనంత ఉధృత రీతిలో ఉత్పాదక శక్తుల అభివృద్ధి చోటు చేసుకుంది. ఆర్థికంగా, సామాజికంగా పెద్ద ఎత్తున బూర్జువాకీకరణకు పునాదులు పడిన ఈ దశాబ్దాంలోనే ఫ్రాన్స్ రెండు వలస యుద్ధాల్లో... ఇండోచైనా, అల్జీరియాలో ఓటమి పాలైంది. ఈ ఓటమి జాతికే అవమానం అన్న రీతిలో జాతీయ దురభిమానాన్ని ప్రోది చేస్తూ దేశంలో మితవాద భావజాలం బలంగా వేళ్లూనుకోసాగింది. ఫ్రెంచి కమ్యూనిస్టు పార్టీ అమెరికన్ మార్షల్ ప్లాన్‌నూ, వలస యుద్ధాలనూ వ్యతిరేకించింది. దీన్ని అవకాశంగా తీసుకుని మార్షల్ ప్లాన్ ద్వారా లబ్ధిపొందగల పెట్టుబడిదారీ శక్తులు, ఆస్తిపర వర్గాలూ, జాతీయ దురభిమాన మితవాద శక్తులూ అన్నీ కలిసి వామపక్షాలపై ముప్పేటా దాడి చేశాయి.

దీనికి తోడు అప్పటికే దేశంలో వర్గశక్తుల పొందికలో బలీయమైన మార్పు చోటు చేసుకుని వుంది. 1945 నాటికి మెజారిటీగా వున్న రైతాంగ శక్తులు. 1968 నాటికి జనాభాలో 14 శాతానికి తగ్గిపోయాయి. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానానికి తోడు, బ్రాండెడ్ తరహా వినిమయ ఉత్పత్తుల పరిశ్రమలు వచ్చిపడటంతో అమెరికన్ తరహా పద్ధతుల చోటు చేసుకుంది. కార్లు తదితర విలాస వస్తువులను ప్రజలు స్వంతం చేసుకోసాగారు. విద్యా సాంస్కృతిక రంగాల్లో పెద్దఎత్తున మార్పులు చోటు చేసుకున్నాయి. 1960-68 మధ్యకాలంలో కాలేజి విద్యార్థుల సంఖ్య రెండు లక్షల నుండి ఆరు లక్షలకు, అంటే మూడురెట్లు పెరిగింది. దేశంలో 40 శాతంగా వున్న మహిళలలో మూడోవంతు జనాభా ఒక్క పారిస్ నగరంలోనే వుండేవారు. 1968లో చెలరేగిన విద్యార్థి ఉద్యమానికి మూలాలు ఈ అభివృద్ధి మూలంగా తలెత్తిన వైరుధ్యాలలో వున్నాయి. నిజానికి ఇది నిరుద్యోగ భయంతో తలెత్తిన ఆందోళన కాదు. ఎందుకంటే అప్పటికి పెట్టుబడిదారీ అభివృద్ధి ఉచ్ఛదశలో కొనసాగింది. విశ్వవిద్యాలయాల్లో మౌలిక వసతుల కొరత, విశ్వవిద్యాలయ వ్యవస్థలో కొనసాగుతున్న పాత మొరటు ఆధిపత్య పాలనా ధోరణులతో విద్యార్థిలోకం విసుగెత్తిపోయింది. విశ్వ విద్యాలయాలను మరింత వేగంగా ఆధునీకరించాలనీ, కులీన వర్గాల చెప్పుచేతల్లో వున్న పాలనా వ్యవస్థ తమలోని ప్రతిభను గుర్తించాలని కోరుతూ విద్యార్థిలోకం తిరుగుబాటు చేసింది. పర్యవసానంగా ఈ తిరుగుబాటు తర్వాత ఫ్రెంచి విశ్వవిద్యాలయ వ్యవస్థ అమెరికన్ తరహా విశ్వవిద్యాలయ వ్యవస్థతో పోటీపడేంతగా మారి పోయింది.

పెట్టుబడిదారీ అభివృద్ధి రేటు విపరీతంగా కొనసాగడంతో కార్మికవర్గంలో ఒక భాగం మెరుగైన వేతన వ్యవస్థ పరిధిలోకి వచ్చింది. ఈ తరగతి కార్మికవర్గం సాపేక్షంగా రాజకీయ చైతన్యాన్నీ, చొరవనూ కోల్పోయింది. అలాగే పెటీ-బూర్జువా వర్గం అనూహ్యంగా పెరగటంతో ఫ్రాన్స్ సంస్కృతీ సంప్రదాయాల కొనసాగింపు కన్నా అమెరికన్ సంస్కృతిని అందిపుచ్చుకోవడానికి వెంపర్లాట మొదలైంది. ఇక పెట్టుబడిదారీ అభివృద్ధి క్రమంలో మేధావి వర్గంలో వుండే ధోరణులే ఫ్రాన్స్‌లోనూ ప్రతిఫలించాయి. "ఆధునిక సోషల్ డెమోక్రాట్' రాజ్యంలో అభివృద్ధి - సంక్షేమం నిరాటంకంగా, సుస్థిరంగా కొనసాగుతాయనే భ్రమలు ఇక్కడా బలంగా పాదుకున్నాయి. ప్రముఖ ఫ్రెంచి ఆధునికానంతర వాది ఫ్రాన్స్వా లియోటార్ట్ (గతంలో ఇతను లగ్జెం బరిస్టుగా వుండేవాడు) ఈ వస్తు వ్యామోహం గురించి వ్యాఖ్యానిస్తూ 'సరుకుల కొరతకు కాలం చెల్లిందిక, సరుకులూ, సేవలదే రాజ్యమిక' అన్నాడు. ఊర్ధ్వముఖ అభివృద్ధికి శాస్త్రీయ మార్క్సిజం కన్నా సగ్రియలిజం, వర్గం కన్నా సంస్కృతులే దగ్గర మార్గం అన్న తాత్విక భావం

> “ పెట్టుబడిదారీ అభివృద్ధి రేటు విపరీతంగా కొనసాగడంతో కార్మికవర్గంలో ఒక భాగం మెరుగైన వేతన వ్యవస్థ పరిధిలోకి వచ్చింది. ఈ తరగతి కార్మికవర్గం సాపేక్షంగా రాజకీయ చైతన్యాన్నీ, చొరవనూ కోల్పోయింది. అలాగే పెటీ-బూర్జువా వర్గం అనూహ్యంగా పెరగటంతో ఫ్రాన్స్ సంస్కృతీ సంప్రదాయాల కొనసాగింపు కన్నా అమెరికన్ సంస్కృతిని అందిపుచ్చుకోవడానికి వెంపర్లాట మొదలైంది. ఇక పెట్టుబడిదారీ అభివృద్ధి క్రమంలో మేధావి వర్గంలో వుండే ధోరణులే ఫ్రాన్స్‌లోనూ ప్రతిఫలించాయి. ”

జోరుగా చలామణీలోకి వచ్చింది.

ఈ తరహా కుర్రకారు మేధావి వర్గం అంతా నిర్మాణాత్మకంగా, నిర్దిష్ట పరిస్థితులకు అనుగుణంగా నిర్దిష్టంగా సాగే కార్మిక వర్గ రాజకీయాలు నత్తనడకన సాగుతున్నాయని విసుగు చెందారు. మావోయిజం, 'చే'గువీరాయిజం, అనార్కిజం వంటి పంథాను ఎన్నుకోవాలని ఉవ్విళ్ళూరినవారూ ఉన్నారు. ఇక విశ్వవిద్యాలయాలు కేంద్రంగా 1960వ దశకంలో ఫ్రాన్స్‌లో సాగిన విద్యార్థి - యువజన ఉద్యమాలు అమెరికాలో ఆనాటికి చలామణిలో ఉన్న సామాజిక ఉద్యమాల సైద్ధాంతిక భూమిక పట్ల విపరీతంగా ఆకర్షించబడ్డాయి. అమెరికాలో సాగిన యుద్ధ వ్యతిరేక ఉద్యమాలూ, మధ్య తరగతి ఉద్యమాలూ తమ అనుభవాలకు దగ్గరగా ఉన్నాయని నాటి విద్యార్థి యువతరం భావించారు. ఎంతైనా వీళ్ళుకూడా కంప్యూటర్లు, కోకో కోలాల జనరేషనేకదా.

ప్రచ్ఛన్న యుద్ధ ప్రభావం, అమెరికన్ పెట్టుబడిదారీ విధానపు గడసరితనం మూలంగా దాదాపు రెండు శతాబ్దాల తర్వాత, తొలిసారిగా ఫ్రెంచి మేధావివర్గం సిద్ధాంతాల కోసం, మార్కెట్ల కోసం అమెరికా వైపు దృష్టిసారించారు. అప్పటికే అమెరికా ప్రపంచ సామ్రాజ్యవాద కేంద్రంగా అవతరించింది. మేధావులకూ, కళాకారులకూ, నీడనిచ్చే సామ్రాజ్యం (ఎంపైర్) గా నిలదొక్కుకుంది. వలసదేశాలను కోల్పోయిన ఫ్రాన్స్ సామ్రాజ్యం హోదాను వదులుకుని నూతనంగా అవతరించిన ప్రపంచ సామ్రాజ్యవాద కేంద్రం (అమెరికా) మీద ఆధారపడసాగింది. ఫ్రెంచి మేధావులూ, కళాకారులూ అదే బాట పట్టారు. కొత్తగా సినిమాలు తీసేవాళ్ళు హిచ్ కాక్ లు అయిపోవాలని చూడడం ఫ్యాషన్‌గా మారింది. ఫ్రెంచి సామాజిక శాస్త్రవేత్తలూ, తత్వవేత్తలూ డేనియల్ బెల్ ఆలోచనలను అరువు తెచ్చుకోసాగారు. ఆ రకంగా ఫ్రాన్స్ అధునికాంతరవాదం అమెరికాలో మార్కెట్ అయి, రీ-ప్యాకేజి చేయబడ్డాక మళ్ళీ ఫ్రాన్స్‌కు వచ్చి చేరింది.

1968లో ఫ్రాన్స్‌లో చెలరేగిన తిరుగుబాట్లను ఉదారవాదులూ, ఆధునికనంతర వాదులూ కలిసి విద్యార్థి తిరుగుబాట్ల చరిత్రగా కుదించారు. ఆ ఏడాదిలోనే ఐరోపా చరిత్రలో కనివినీ ఎరుగనంతటి స్థాయిలో కార్మిక వర్గం నాయకత్వాన సార్వత్రిక సమ్మె జరిగింది. ఈ సమ్మె సమరశీల స్వభావాన్ని గుర్తించిన మీదటే ఫ్రాన్స్ అధ్యక్షుడు డీ గాల్ 'నాటో' సైనిక దళాలను పిలిపించే ప్రయత్నం చేశాడు. ఐరోపాకు కేంద్రంగా ఉన్న ఫ్రాన్స్ లాంటి దేశంలో విప్లవం విజయవంతం కావడాన్ని అమెరికా సహించదు, దాన్ని అణచడానికి ఎంతకైనా తెగిస్తుంది అన్న కఠోర వాస్తవాన్ని ఫ్రెంచి కమ్యూనిస్టు పార్టీ, కేంద్ర కార్మిక సంఘాల సమాఖ్య సి.జి.టి.లు గుర్తించాయి. ఈ నేపథ్యంలో కార్మికోద్యమం వెనుకడుగు వేయ్యడం మంచిదని భావించాయి. ఇక ప్యారిస్ కేంద్రంగా 1968లో చెలరేగిన విద్యార్థి తిరుగుబాట్లు మావోయిజం, సక్రియ లిజం, లైంగిక విప్లవం, అమెరికన్ సమాజిక చింతనల కలయికతో కూడిన తాత్విక భూమిక ఆధారంగా చోటు చేసకున్నాయి. కానీ ఎప్పుడైతే ఫ్రెంచి కమ్యూనిస్టు పార్టీ, కార్మికవర్గం సార్వత్రిక సమ్మె తరువాత వెనుకడుగు వేశాయో అప్పుడు వాటిమీద 'విప్లవానికి వెన్నుపోటు పొడిచాయని' తీవ్ర స్థాయిలో విమర్శలు ఎక్కుపెట్టారు. ఆనాటి విద్యార్థి ఉద్యమ నాయకుడు కోహన్ బెండిట్ ఏం చెబుతున్నాడో చూడండి - “మే 11న ప్రజలు ఘర్షణకు సిద్ధం గాలేరు. నార్టన్ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో పెద్ద 'పార్టీ' జరపాలని ముందుగా తలపోశాం. ఇంతలోనే విచిత్రంగా సైనికులు బ్యారికేడ్లు పెట్టేసారు” అంటాడు.

'మీరు కేవలం కళ్ళకు కనబడుతున్న ఫ్రెంచి సైనికుల ప్రమాదాన్నే చూశారు, కానీ మేం పశ్చిమ జర్మనీలో తిష్టవేసి ఏ క్షణాన్నయినా నార్టన్ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో జరపతల పెట్టిన 'పార్టీ'తో కలవాలని (తలపడాలని) ఉవ్విళ్ళూరుతున్న రెండు లక్షల మంది అమెరికన్ సైన్యాన్ని దృష్టిలో ఉంచుకున్నాం' అని తమ మీద వచ్చిన విమర్శలకు ప్రతిగా కమ్యూనిస్టులు గుర్తు చేసారు. అయినా ఎవరు పట్టించుకున్నారు గనుక? కమ్యూనిస్టు పార్టీ సంస్కరణవాదంలో కూరుకుపోయిందన్నారు. బ్యూరాక్రటిక్ ధోరణులు ప్రబలిపోయాయి పార్టీలో అన్నారు. ఇంతకన్నా నయవంచన లేదన్నారు. స్టాలినిజం తలకెక్కింది అన్నారు... ఇలా కమ్యూనిజాన్ని అపహాస్యం చెయ్యడానికి చెయ్యాల్సిందంతా చేశారు. అదే అదనుగా ఫ్రెంచి మేధావి వర్గంలో పై స్థాయి వాళ్ళంతా కార్మికవర్గ ఉద్యమం నుండి నిర్ణయాత్మకంగా వైదిలిగారు. 1968 తిరుగుబాటు సద్దుమణిగాక ఫ్రెంచి పెట్టుబడిదారీ వ్యవస్థ రెట్టింపు దూకుడుతో విస్తరించ సాగింది. అప్పటి దాకా విప్లవకారులుగా పేరు గడించి, తరువాత కమ్యూనిస్టు పార్టీని తెగనాడినవాళ్ళు ఎందరో రాజ్య సాంస్కృతిక వ్యవస్థలో ఆకర్షణీయమైన పదవులు గడించారు. సోషలిస్టు పార్టీ, కమ్యూనిస్టు పార్టీతో కలిసి చేసిన ఉమ్మడి కనీస కార్యక్రమాన్ని (కామన్ మినిమమ్ ప్రోగ్రాం) రద్దుచేసి, కమ్యూనిస్టుల సాయం లేకుండానే అధికారంలోకి వచ్చాక ఈ దోరణులు ఊపందుకున్నాయి. ఫ్రాన్స్‌లో ఆధునికానంతరవాదం ఆధి పత్యంలోకి వచ్చిన విధానం ఇది. కానీ దీని మూలాలు మాత్రం అమెరికాలో బలంగా వేళ్ళూ నుకుని ఉన్నాయి.

ఇక ఇప్పుడు ఆధునికానంతర వాదంలోని వైరుధ్యాలు, విషాదాల గురించి లోతుగా పరిశీలిద్దాం:

భారత్, చైనా వంటి దేశాల్లో ఈ ఆధునికోత్తర ధోరణులకు విపరీతమైన ప్రాచుర్యం లభించడం అన్నింటిలోకెల్లా గొప్ప విషాదం అనిపిస్తుంది నాకు. ఆధునికానంతర వాదానికి సంబంధించిన సామాజిక, ఆర్థిక విశ్లేషణలన్నీ అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ వ్యవస్థ నిర్మాణాలకు సంబంధించినవి. కానీ చిత్రం ఏమంటే భారతీయ సమాజం అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ సమాజం కాదు. ఇంకా చెప్పాలంటే బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ దేశాల్లో 19వ శతాబ్దం నాటి అధునికతను కూడా


epaper.prajasakti.com

> **"పారిశ్రామిక కార్మికవర్గం సంఖ్య కనిష్ట స్థాయికి పడిపోవడం ఆధునికానంతరవాదానికి పట్టుగొమ్మ. ప్రస్తుతానికి ఈ సూత్రమూ భారత దేశానికి అన్వయించదు. ఇక చైనా భౌగోళిక పరిమాణాన్నీ, ఈ మధ్యకాలంలో ఆ దేశంలో చోటు చేసుకుంటున్న భారీ పారిశ్రామికీకరణనూ పరిశీలిస్తే పారిశ్రామిక విప్లవానంతర కాలంలో ఐరోపా ఖండంలో మొత్తంగా కార్మికవర్గం అభివృద్ధి చెందడానికి మూడు దశాబ్దాలు పడితే, ఆ స్థాయి కార్మికవర్గ జనాభా అభివృద్ధి చైనాలో కొద్ది కాలంలోనే చోటు చేసుకుంది."**

ఇంకా సంతరించుకోని దేశం నేటి భారతదేశం. ప్రారిశ్రామికంగా ఒకమేరకు అభివృద్ధి సాధించినా ఇప్పటికీ వ్యవసాయ ప్రధాన దేశంగా కొనసాగుతోంది.

పారిశ్రామిక కార్మికవర్గం సంఖ్య కనిష్ట స్థాయికి పడిపోవడం ఆధునికానంతరవాదానికి పట్టుగొమ్మ. ప్రస్తుతానికి ఈ సూత్రమూ భారత దేశానికి అన్వయించదు. ఇక చైనా భౌగోళిక పరిమాణాన్నీ, ఈ మధ్యకాలంలో ఆ దేశంలో చోటు చేసుకుంటున్న భారీ పారిశ్రామికీకరణనూ పరిశీలిస్తే పారిశ్రామిక విప్లవానంతర కాలంలో ఐరోపా ఖండంలో మొత్తంగా కార్మికవర్గం అభివృద్ధి చెందడానికి మూడు దశాబ్దాలు పడితే, ఆ స్థాయి కార్మికవర్గ జనాభా అభివృద్ధి చైనాలో కొద్ది కాలంలోనే చోటు చేసుకుంది. పశ్చిమ దేశాల చరిత్రలో లేని విధంగా నేడు భారత్, బ్రెజిల్, అర్జెంటీనాతోపాటు తూర్పు, వాయువ్య ఆసియా దేశాలన్నింటా భౌగోళికంగా కార్మిక వర్గం పెద్ద ఎత్తున విస్తరించి వుంది. అదీ గత యాభైయేళ్లలోనే. ఒకవైపున విశ్వవిద్యాలయాల్లోని ఉన్నత శ్రేణి వర్గాల్లో అధునికానంతరవాద భావాలు వ్యాప్తి చెందే క్రమంలోనే ఈ శ్రామికవర్గం ఆవిర్భవించింది.

ఇక పెట్టుబడిదారీ విధాన అభివృద్ధి వల్ల సొంత ఇల్లు, విలాస వస్తువులను ప్రజలు స్వంతం చేసుకోగలిగారు. ఇదంతా అభివృద్ధి కాదా, సంపద సృష్టికాదా అని వాదించే వాళ్ళు రెండు ముఖ్యమైన అంశాలను గమనించాలి.

1. యూరో-అమెరికా ఖండాలకు వెలుపల ఇప్పటికీ మెజారిటీ జనాభాకు ఈ రెండూ అనుభవంలోకి రాలేదు.

2. ఐరోపా-అమెరికా దేశాల్లో ఇప్పటి దాకా కార్మికవర్గం అనుభవిస్తున్నాయి అని చెప్పుకుంటున్న ఈ సౌకర్యాలకూ ఎసరువచ్చేసింది. ఆయా దేశాల్లో నెలకొన్న ఆర్థిక సంక్షోభం వల్ల ఇవి కూడా కరిగిపోతున్నాయి. అప్పులు మీద అప్పులిచ్చి 'పరపతి' (క్రెడిట్) సౌకర్యం ఆధారంగా నిలబెట్టుకుంటూ వచ్చిన 'వినిమయ దారీ సమాజం' ఈ ఆర్థిక సంక్షోభం వల్ల ఎండ వేడికి కరుగుతున్న మంచులా నీరుకారిపోతూ ఉంది. ప్రైవేటు అప్పు, ప్రభుత్వ రుణాలూ కలిసి అమెరికన్ ఆర్థిక వ్యవస్థను కుంగదీయడం మన కళ్ళతో మనమే నేడు చూస్తున్నాం.

అమెరికాలో పెట్టుబడిదారీ వర్గమే లేదనే పోస్ట్-మోడ్రన్ వాదన ఒట్టి అసంబద్ధమైన వాదన. అలాగే కార్మికవర్గమే లేదనే వాదన కూడా నిలబడేదికాదు. గత యాభై ఏళ్ళలో తృతీయ ప్రపంచ దేశాల్లో కార్మికవర్గం ఎంత పెద్దఎత్తున విస్తరించిందీ ఇంతకు ముందే చెప్పుకున్నాం. అమెరికాలో పారిశ్రామిక కార్మికులు నాటకీయంగా తగ్గిపోయారంటే ఆ దేశ ఆర్థిక వ్యవస్థలో వస్తూత్పత్తి రంగం వాటా దిగజారి పోయిందని అర్థం. ఇది మంచికే అని అక్కడ పాలకులు భావించారు. కానీ నేడు అదే వారికి శాపంగా మారి అమెరికా అర్థిక శక్తిని కుంగదీ స్తోందని నిర్వివాదంగా చెప్పుకోవచ్చు. అయితే ఐరోపాలో, ముఖ్యంగా జర్మనీలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. పారిశ్రామిక కార్మికులు ఇప్పటికీ ఆ దేశంలో ప్రభావం చూపించే దశలో ఉన్నారు. కార్మికవర్గం చచ్చిపోయిందనే వాదన 1970వ దశకంలోనే అట్లాంటిక్ మహా సముద్రానికి అటూ ఇటూ జోరుగా చలామణిలో ఉన్నకాలంలోనే హారీ బ్రెవర్ మాన్ రాసిన 'కార్మికవర్గం - గుత్త పెట్టుబడి (లేబర్ అండ్ మోనోపలీ కాపిటల్) పుస్తకంలో 90 శాతం మంది అమెరికన్ ప్రజానీకం ఆదాయం కలుగచేసే ఆస్తులు ఏవీ కలిగి లేరనీ, కేవలం వారాంతపు కూలి, జీతాల మీదనే ఆధారపడి బతుకుతున్నారనీ ఆధికారికంగా స్పష్టం చేసాడు. అందులో భాగంగా ఏయే రంగాల్లో ఎంత మంది పని చేస్తున్నారు, వాళ్ళ ఆదాయాలు ఏమిటీ అనే వివరాలు పరిశీలిస్తే అమెరికాలో రెక్కల కష్టం మీద బతికే కార్మిక వర్గమే ఎక్కువ అని తేలిపోతుంది. అయితే ఆ మాట ఒప్పుకు నేందుకు వారికి నామోషీ ఉంటే ఉండవచ్చుగాక. కానీ ఇది పచ్చినిజం.

'కార్మికవర్గం' అంటే కేవలం పారిశ్రామిక కార్మికులే అని ఏ కమ్యూనిస్టూ చెప్పదు. శ్రామిక వర్గాన్ని కేవలం పారిశ్రామిక కార్మికులుగా కుదించడం అధునికానంతర వాదులకే చెల్లింది. కార్మివర్గం విప్లవానికి అగ్రగామి దళంగానూ, సామాజిక విప్లవానికి ఇరుసుగానూ పని చేస్తుందని మార్క్సిజం చెబుతుంది. కానీ కార్మిక వర్గం మాత్రమే విప్లవం తెస్తుందనే బండ సూత్రీకరణ ఎక్కడా చెయ్యలేదు. సమాజంలో ఇతరేతర శ్రామికశక్తులన్నిటినీ... రైతాంగాన్నీ, వ్యవసాయ కూలీలనూ, గ్రామీణ శ్రామికులనూ - విద్యార్థి, యువజన లోకాన్నీ కలుపుకుని సామాజిక మార్పు సాధిస్తుంది. కాబట్టి, పారిశ్రామిక కార్మికుల సంఖ్య ప్రపంచవ్యాప్తంగా తగ్గిపోయింది కాబట్టి కమ్యూనిజానికి కాలం చెల్లినట్లే అన్న అధునికానంతర వాదుల వాదన ఎంత మాత్రమూ పసలేనిది.

ఆధునికానంతర వాదానికి అనుగుణంగా చేసిన సమాజిక, ఆర్థిక విశ్లేషణలన్నీ అమెరికన్ పెట్టుబడిదారీ అభివృద్ధి ఉచ్ఛదశలో ఉన్న ఒకానొక కాలంలో, ఇక ఆ స్థాయి సంపద సృష్టి శాశ్వతం అని బలంగా నమ్మిన నేపథ్యం నుండి చేసినవి. 1945-73 మధ్యకాలంలో అమెరికాలో 'పెట్టుబడిదారీ స్వర్ణ యుగం' అని పిలుచుకునే స్థాయిలో ఆర్థికాభివృద్ధి సాగింది. ఆ కాలంలో లబ్ది పొందిన ఈ తరగతి 1973 తరువాత సంభవించిన ఆర్థిక సంక్షోభాలనూ ఏదో ఒక మేరకు తట్టుకోగలిగింది. ఈ తరగతి జనాభాలో ఆధునికోత్తర వాదం ప్రబలంగా చలామణీలోకి వచ్చింది. కానీ భారతదేశంలో ఈ వాదం ఉన్నత విశ్వవిద్యాలయాల్లోకి చొరబడింది. సామ్రాజ్యవాద సంస్కృతి చేసే దాడిలో భాగంగా ఒక మేరకు ప్రభావం చూపగలదేమో కానీ అమెరికాలో ఈ వాదం ప్రబలడానికి ఊతంగా నిలచిన సామాజిక - ఆర్థిక నేపథ్యం భారతదేశంలో ఇప్పటికీ లేదు కాబట్టి అది నిలదొక్కుకోవడం కష్టం. ఆధునికానంతర వాదం సర్వకాల సర్వవ్యవస్థలకూ వర్తించే శాస్త్రీయ సామాజిక శాస్త్రం కానేకాదు.

ఇకపోతే అమెరికన్ ఆధునికానంతర వాదానికీ, ఫ్రెంచి ఆధునికానంతర వాదానికీ


(మిగతా 36 వ పేజీలో)



epaper.prajasakti.com

# మహాజ్ఞాని, నిజమైన మార్క్సిస్టు మేధావి

**ప్రభాత్ పట్నాయక్**



రచయిత ప్రముఖ ఆర్థిక వేత్త

ప్రొఫెసర్ ఐజాజ్ అహ్మద్ 2022 మార్చి 9న మరణించారు. ఆయన మనకాలానికి చెందిన అసాధారణమైన మార్క్సిస్టు మేధావి. ఆయన గురించి కచ్చితంగా చెప్పాలంటే ఆయనో శాస్త్రీయ మార్క్సిస్టు. ఎందుకంటే ఆయన మార్క్సిజాన్ని వాస్తవికంగా మార్చాలన్న పేరుతో మార్క్సిస్టేతర, దానితో పొసగని భావనలను మార్క్సిజంలోకి చొప్పించి దాన్ని సంకరం చేసే ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకించాడు. ఎడ్వర్డ్ సెడ్ రాసిన ఓరియెంటలిజం అనే గ్రంధాన్ని విమర్శిస్తూ ఐజాజ్ అహ్మద్ రాసిన గొప్ప గ్రంథం "సైద్ధాంతికంగా : వర్గాలు, జాతులు, సాహిత్యాలు"లో ఆయన శాస్త్రీయ మార్క్సిస్టు సంప్రదాయం ప్రధానమని వాదించాడు. నిజమైన మార్క్సిస్టు మేధావిగా ఆయన అనేక రంగాల్లో – సాహిత్యం, సాహిత్య విమర్శ, చరిత్ర, తత్వ శాస్త్రం, రాజకీయాలు, రాజకీయ అర్థశాస్త్రంలో నిష్ణాతుడు. దైనందిన ఘటనలపై ఆయన రాజకీయ వ్యాఖ్యానాలు మన కాలంలో పరిస్థితులను ఆయన ఎంత పరిపూర్ణంగా అర్థం చేసుకున్నాడో చెబుతాయి.

ఐజాజ్ 1941లో ఉత్తర ప్రదేశ్‌లోని ఒక ధనిక భూస్వామ్య కుటుంబంలో జన్మించారు. దేశ విభజన సమయంలో పాకిస్తాన్ వెళ్లిపోయారు. తరువాత ఆయన జీవితంలో ఒక్క సారి మాత్రమే తన పూర్వీకుల గ్రామాన్ని సందర్శించారు. అప్పుడు గ్రామస్తులు ఆయన పట్ల చూపించిన ఆదరణకు ఆయన ముగ్ధుడయ్యాడు. గ్రామస్తులు ఆయనను గతంలో ఏనాడూ చూడలేదు. అయినా తమ స్వంత మనిషిలాగా ఆయన పట్ల ఆప్యాయతానురాగాలు చూపించారు. ఆయన అమెరికా, కెనడాల్లోని వివిధ యూనివర్శిటీల్లో అనేక సంవత్సరాలు ప్రొఫెసర్‌గా బోధించాడు. భిన్నవాదనలకు నిలయమైన టొరంటోలోని యార్క్ యూనివర్శిటీలో ఆయన పనిచేసి అనంతరం భారత దేశం వచ్చి రెండు దశాబ్దాలు ఇక్కడ నివాసం ఉన్నారు. నెహ్రూ మెమోరియల్ మ్యూజియం, లైబ్రరీల్లో ప్రొఫెసోరియల్ ఫెల్లోగా, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీ (జెఎన్‌యు)లోని రాజకీయ అధ్యయనాల కేంద్రం విజిటింగ్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. జమియా మిలియా ఇస్లామియాలో ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ పీఠానికి అధ్యక్షుడైనారు. ఆయన ఫ్రంట్‌లైన్ పక్ష పత్రికలోనూ, వామపక్ష పత్రికలైన సోషల్ సైంటిస్ట్, మార్క్సిస్టులకు నిత్యం రాసేవారు. లెఫ్ట్‌వర్డ్ ప్రచురణ సంస్థ ప్రారంభం నుండి దానితో కలిసి పనిచేశారు. నిజానికి ఆయన తరువాత రాసిన అనేక పుస్తకాలను లెఫ్ట్‌వర్డ్ ప్రచురణ సంస్థే ప్రచురించింది.

భారత దేశంలో ఐజాజ్ నివాసం ఉండడం అనేది ఈ దేశంలోని వామపక్ష రాజకీయ జీవితాలకూ, మేధావులకూ ఒక గొప్ప స్ఫూర్తి. ఆయన అనేక సభల్లో పాల్గొన్నాడు. వామపక్ష విద్యార్థి గ్రూపులు, వామపక్ష సాహితీ బృందాల ఆహ్వానాన్ని ఆయన ఏనాడూ తిరస్కరించలేదు. ఆనాటి రాజకీయ సమస్యలపై ఆయన స్థిరమైన నిర్ణయాలు తీసుకోవడంలో ఏనాడూ సందేహించలేదు. వామపక్షాల్లో అటువంటి నిర్ణయాలు ఎంతటి వివాదాస్పదమన్నా గానీ ఆయన మాత్రం కఠినమైన నిర్ణయం తీసుకుని నిలబడేవాడు. ఆయన తన మేధస్సుతో మదించి అటువంటి కఠిన నిర్ణయాలకు వచ్చేవాడు. చర్చలో ఆయనకు వ్యతిరేకంగా వాదించేవారెవరైనా సరే అటువంటి కఠినత్వాన్ని ఎదుర్కొనాల్సిందే. అయితే ఆయన వాదించేవారు ఆయనదో ఏకీభవించకపోయినా ఆయన నుండి చాలా నేర్చుకునేవారు.

ఆయన జ్ఞానం, ఆయన హాస్య చతురత, జీవితాన్ని సరదాగా తీసుకునే తీరు, అందరితో కలివిడిగా మెలిగే పద్ధతి, ఉపాఖ్యానాలు చెప్పే నైపుణ్యం...ఇవన్నీ ఆయనకు సనిహితంగా మెలిగేవారిని సమ్మోహితులను చేసి ఆయన వ్యక్తిత్వానికి కట్టి పడేసేవి. ఆయన మంచి ఆహారం తీసుకోవడంలోనూ, మంచి సంగీతాన్ని వినడంలోనూ స్వచ్ఛమైన అవద్ ప్రాంతీయునిలా వ్యవహరించేవాడు. ఆయన పాత హిందూస్తానీ సినిమాలు చూసేవాడు. వాటికి సంబంధించి డజన్ల కొద్దీ వీడియో క్యాసెట్లు ఆయన వద్ద ఉన్నాయి.

భారత దేశంలో ఉంటే ఐజాజ్ తన స్వంత ఇంటిలో ఉన్నట్లు భావించేవాడు. నేను చూసిన చాలా మంది భారతీయులకన్నా కూడా ఆయన గొప్ప భారతీయుడు. వాస్తవానికి ఆయన అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలన్నిటినీ వదిలిపెట్టి, గొప్ప ప్రతిష్టాత్మక అకాడమిక్ పదవులను విడిచిపెట్టి భారత దేశానికి తిరిగి వచ్చాడు. అయితే కొద్ది కాలం ఆయన పాకిస్తాన్ పౌరునిగా ఉన్నందున ఆయన భారత దేశ శాశ్వత పౌరసత్వం పొందడానికి అది అడ్డంకిగా మారింది. తను తన స్వదేశంగా భావించిన గడ్డమీద స్థిర నివాసం ఉండలేకపోతున్నాననే ఆందోళన ఆయనలో ఉండేది. దాంతో ఆయన ఇర్విన్‌లోని కాలిఫోర్నియా యూనివర్శిటీలో తులనాత్మక సాహిత్య పీఠానికి అధిపతి పదవి స్వీకరించాల్సి వచ్చింది. ఈ పీఠాన్ని గతంలో ఫ్రెంచ్ తత్వవేత్త జాక్వెస్ డెర్రిడా అధిష్టించారు. అయితే అనేక మంది స్నేహితులు, కామ్రేడ్స్‌ను విడిచిపెట్టి అదికూడా ఒకచోటి నుండి మరో చోటికి తిరిగే కాలం కాని కాలంలో భారత దేశాన్ని విడిచిపెట్టాల్సి రావడం ఆయనకు చాలా బాధ, ఆవేదన కలిగించింది.

దేశ విభజన సమస్యపై మాట్లాడుతూ మౌలానా అజాద్ చేసిన వ్యాఖ్యానం గురించి ఐజాజ్ చెప్పిన ఒక విషయాన్ని నేను ఇక్కడ ఉటంకించకుండా ఉండలేను: స్వాతంత్ర్యానికి ముందు కొంత మంది ముస్లిం లీగ్ కార్యకర్తలు మౌలానా దగ్గరకు వచ్చి దేశ విభజనకు ఆయన ఆమోదం తెలపాలని అడిగారు. ఇప్పుడు గనక దేశం విభజన చెందక పోతే రానున్న వంద రోజులు తీవ్రమైన ఘర్షణలు చోటు చేసుకుంటాయి అని వారు మౌలానాను హెచ్చరించారు. దానికి మౌలానా సమాధానం చెబుతూ విభజన జరిగినట్లయితే రానున్న వందేళ్ల పాటు ఘర్షణలు జరుగుతాయి అన్నాడు. మనం ఇప్పుడు ఆయన చెప్పిన వందేళ్ల మధ్యలో ఉన్నాం. ఈ సమయంలో ఐజాజ్ అహ్మద్ లాంటి ఒకగొప్ప జ్ఞానినీ, విప్లవ మేధావినీ కోల్పోవడం భర్తీచేయలేని గొప్ప నష్టం. నాతో సహా ఆయన స్నేహితులకు ఇది పెద్ద వ్యక్తిగత నష్టం.

❀



epaper.prajasakti.com



# భారత్‌పై ఆధునికానంతరవాద ప్రభావం

**ఈ మధ్యకాలంలో విదేశీ సంస్థలు దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన కొన్ని ప్రత్యేక విభాగాలకు నిధులు అందించడం మొదలుపెట్టాక అధ్యాపన పద్ధతులనూ, కోర్సులనూ ఆధునికానంతరవాద ధోరణులను ప్రోత్సహించేందుకు వీలుగా పునర్వ్యవస్థీకరిస్తున్నారు. మహిళా సమస్యలు, దళిత, పర్యావరణ, జెండర్ అధ్యయనాలకు బాగా ప్రోత్సాహం లభిస్తోంది.**

ఆధునికానంతరవాదాన్ని మనం మూడు భిన్నమైన కోణాల్లో అర్థం చేసుకున్నాం కదా. స్థూలంగా చెప్పుకోవాలంటే–

1. గత అరవై ఏళ్ళుగా పెట్టుబడిదారీ వ్యవస్థ నిర్మాణంలో వచ్చిన మార్పులు బలాన్ని సంతరించుకున్నాయి. ఆ మార్పులు ఆధునికానంతరవాద ఆలోచనగా రూపుదిద్దుకున్నాయి. అమెరికాలో మొదలయిన ఈ ధోరణి ఫ్రాన్స్‌కు పాకి, అక్కడ కాస్తా కొత్త తొడుగు (రీ–ప్యాకేజీ) తొడుక్కుని మళ్ళీ అమెరికాకు ఎగుమతయి అక్కడ నుండి ప్రపంచ దేశాలకు విస్తరించింది.

2. ఆధునికానంతరవాద చింతనాపరులు ... చైతన్య సిద్ధాంతానికీ, దాని వారసత్వానికీ ముఖ్యంగా మార్క్సిస్టు భావధారకూ, కమ్యూనిస్టు రాజకీయాలకూ వ్యతిరేకమైన తాత్వికతను ఆలంబనగా చేసుకున్నారు.

3. మార్క్సిజానికీ, కమ్యూనిజానికీ వ్యతిరేకంగా భిన్నమైన రాజకీయ కార్యాచరణ పద్ధతులనూ, నిర్మాణ సూత్రాలనూ, తాత్విక భూమికలనూ – ఆధునికానంతరవాద తత్వానికి అనుగుణంగా ముందుకు తెచ్చాయి. వర్గం బదులు ఒకే ప్రయోజనాలు గల విడివిడి సమూహాలుగా స్థానికత ప్రాతిపదికగా పని చెయ్యాలనడం, సామాజిక ఉద్యమాలు, పౌర సంస్థలు పేరిట ఒక 'వర్గం'గా ఐక్యంగా ఉండాల్సిన విశాల ప్రజారాశులను ఎక్కడికక్కడ విడగొట్టడం, సర్కారీ నిధులు– కార్పొరేట్ నిధులతో నడిచే ప్రభుత్వేతర సంస్థలకు (ఎన్జీవోలకు) ప్రాధాన్యత ఇవ్వడం.... ఇవన్నీ అందులో భాగమే.

మనదేశంలో ఆధునికానంతరవాదం పైన చెప్పిన అన్ని రూపాల్లోనూ భిన్న మార్గాల్లో వచ్చి చేరింది.

ఈ మొత్తం పరిణామ క్రమాన్ని మనం అర్థం చేసుకోవాలంటే స్వాతంత్ర్యానంతర భారతదేశ చరిత్రను మనం మూడు దశలుగా విడగొట్టి పరిశీలించాలి. ఆధునిక – ఆధునికానంతర ధోరణుల మధ్య తేడాలను అంచనా కట్టాలి. ఇందులో మొదటిదశ గురించి చెప్పుకోవాలంటే 1947–70ల మధ్యకాలాన్ని మనం మొదటి దశగా భావించవచ్చు. దీన్నే నెహ్రూ శకం అని కూడా అనుకోవచ్చు. పరిశ్రమల జాతీయకరణ, గరీబీ–హఠావో నినాదం, బంగ్లాదేశ్ యుద్ధంలో సాధించిన విజయం... ఇవన్నీ వ్యవస్థలో పెరుగుతూ వచ్చిన సంక్షోభాన్ని కప్పిపెట్టేశాయి. తీవ్రమైన ఒడిదుడుకులు ఎదురయినా పాలకవర్గాలకు సాఫీగా గడిచిన కాలం ఇది. బూర్జువా భూస్వామ్య శక్తులు ఈ దశలో బాగా బలపడ్డాయి. నెహ్రూ 'రాజ్యం' అనేక పరిమితులు విధించినప్పటికీ, అంది వచ్చిన అవకాశాలను ఉపయోగించుకొని బూర్జువా, భూస్వామ్య శక్తులు సంఘటితపడ్డాయి. బ్రిటీష్ వలసాధిపత్యానికి వ్యతిరేకంగా జరిగిన స్వాతంత్ర్యోద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్న నాయకత్వం అధికారం చేపట్టిన కారణాన తొలి పదిహేనేళ్ళు రాజ్యంకన్నా మిన్నగా నాయకుల హవా కొనసాగింది. జనామోదం కలిగిన నాయకత్వం కాబట్టి ఆ రోజుకి పాలకశక్తులు ప్రభుత్వాధినేతలకు తలొగ్గి వర్గ 'రాజీ'కి సిద్ధపడ్డాయి.

ఈ రాజీ సమయంలో కూడా రాజ్యం నుండి లబ్ధిపొందడం ఎలాగో పాలకశక్తులు నేర్చుకున్నాయి. ప్రైవేటు పెట్టుబడిని పోగేసుకోవడానికి చాలాకాలం పడుతుందని బూర్జువా వర్గం గ్రహించింది. రాజ్య రక్షిత విధానాలను అవలంబించడం, ప్రభుత్వరంగ ఆధిపత్యం కొనసాగుతుండడం తమ మేలుకే అని అర్థం చేసుకుంది. ప్రభుత్వరంగ పరిశ్రమల ద్వారా కూర్చిన మౌలిక వసతులుకానీ, ప్రభుత్వరంగ సంస్థలద్వారా సాధించిన శాస్త్ర సాంకేతిక ప్రగతినిగానీ సాధించాలంటే బూర్జువావర్గం తాను ఎన్నివేలు, లక్షల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టాల్సి వచ్చేదో లెక్కలు వేసుకుంది. అంత మొత్తం ప్రజాధనం వెచ్చించి ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలను బూర్జువావర్గం తాను ఎదగడానికి వాటంగా వాడుకుంది. విద్య, వైద్యం, రేడియో అన్నింటా ప్రభుత్వ అజమాయిషీ, ప్రభుత్వ నిధులే. ఒక్కమాటలో చెప్పుకోవాలంటే ఆనాటి అభివృద్ధి అంతా రాజ్య ప్రేరేపిత పెట్టుబడిదారీ అభివృద్ధి విధానమే. వ్యవసాయ ప్రధాన దేశం గా, పెట్టుబడుల విషయానికొస్తే అత్యంత వెనుకబడిన తృతీయ ప్రపంచ దేశాల్లో ఒకటిగా ఉన్న భారతదేశానికి, కీన్స్ – సోషల్ డెమొక్రాట్ సమ్మిళిత ఆర్థిక నమూనా చక్కగా పొసగింది. పల్లె పట్టుల్లోని భూస్వామ్య ఆస్తిపర వర్గాలు కూడా భూస్వామ్యవర్గం నుండి, వ్యవసాయ పెట్టుబడి దారీ వర్గంగా ఎదగడానికి ఏదో ఒక మేరకు వ్యవసాయిక సంస్కరణలకు తలొగ్గాల్సి వచ్చింది. నెహ్రూ హయాంలో భూపంపిణీ అనేది నామకః జరిగినా క్రమంగా అదీ కొండెక్కింది. 'హరిత విప్లవం' పేరిట నూతన వంగడాల సాగు, ఎరువుల వాడకం, నీటి పారుదల సౌకర్యాల కల్పన, పంటల సేకరణ వంటి ప్రభుత్వ విధానాల నుండి భారీగా లబ్ధిపొందిన భూస్వాములు వ్యవసాయంలో పెట్టుబడిదారీ విధాన అభివృద్ధికి బాటలు వేశారు.

సామాజికంగా చూస్తే భారతదేశం ప్రపంచంలోనే బహు వైవిధ్య భరితదేశం. భిన్న మతాల, భిన్న భాషల, భిన్న సంస్కృతుల, భిన్న మతాల సమాహారం. ఈ వైవిధ్యతలోనూ అనేక సంక్లిష్టతలు– కులాలు, ఉపకులాలు, ధార్మిక విశ్వాసాలు వంటివి ఇమిడి ఉన్నాయి. భిన్నత్వంలో ఏకత్వం, బహుళ వైవిధ్య భరితం అయిన దేశం కాబట్టే ఆధునికానంతరకాలంలో అస్తిత్వ రాజకీయాల ఉచ్చులో ఇట్టే చిక్కుకుంది. ఆ విషయం తరువాత లోతుగా చర్చిద్దాం.

దేశం ఎంచుకున్న ఈ 'ఆధునిక' మార్గం పట్ల జనంలో సానుకూలత, ఏకాభిప్రాయం ఉండింది. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన 1947 నుండి ఎమర్జెన్సీ కాలం వరకూ కొనసా



epaper.prajasakti.com

గిన ఈ ఆధునిక దశ పరిశీలిస్తే మనకు కొన్ని సందేహాలు రావచ్చు. (అ) ప్రస్తుతకాలంతో పోలిస్తే ఆనాటి సామాజిక నిర్మాణ స్వరూపం ఎంత భిన్నంగా ఉండేదో తెలుస్తుంది. (ఆ) అంతటి ఉదాత్త ఆధునికతనూ ఇవాళ అమెరికా సామ్రాజ్య అనుకూల మేధావులూ, నయా-ఉదారవాదులూ పలచన చేసి చూపడానికి ఎందుకు వెంపర్లాడుతున్నారు. (ఇ) గాంధీని ఓ మేరకు అంగీకరించినా నెహ్రూశకం అన్నా, నెహ్రూవంశం అన్నా మతోన్మాద ఆర్.ఎస్.ఎస్. శక్తులు ఎందుకు విరుచుకుపడతాయి. (ఈ) ఈ రెండు తరగతుల మాదిరే ఇవాళ ఆధునికానంతరవాదులూ ఆ బాటే ఎందుకు పట్టారు. (ఎ) వీళ్ళేనా నెహ్రూను, నెహ్రూ పరిపాలననూ దుమ్మెత్తిపోస్తుందీ, కమ్యూనిస్టులు విమర్శించ లేదా అంటే విమర్శించారు. కానీ పై మూడు తరగతుల విమర్శలకూ, కమ్యూనిస్టుల విమర్శలకూ చాలా తేడా ఉంది. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్ళలో దేశం ఆర్థికంగా, సైనికపరంగా బలహీనంగా ఉండేది. దాంతో సామ్రాజ్యవాద దేశాలు మన దేశాన్ని తమ కక్ష్యలోకి లాక్కు నేందుకు బల ప్రయోగ విధానాలకు పూనుకు నేవి. ఈ నేపథ్యంలో లౌకికవాదం, సామాజిక న్యాయం, అలీన విదేశాంగ విధానం... ఈ మూడు అంశాలూ ప్రభుత్వానికి తార్కిక, తాత్విక భూమికలుగా ఎంచుకున్నారు నాటి పాలకులు. ఈ లక్షణాలే భారతదేశ 'ఆధునికత'కు ఆభరణా లుగా భాసిల్లాయి. ఈ మూడింటిలో దాగిఉన్న ఉమ్మడి సూత్రం ఒకటే - 'జాతీయత'. దేశ సమైక్యతనూ, వైవిధ్యతనూ కాపాడుకోవాలన్నా, మత విద్వేషాన్నీ, విభజననూ అరికట్టాలన్నా లౌకికవాదం కన్నా మించిన మేలైన ప్రత్యామ్నాయం లేదని అప్పటి ప్రభుత్వాధినేతలు బలంగా విశ్వసించారు. కులపీడన రూపుమాపడానికి మూలాల నుండి కృషి చెయ్యడంగాక, సామాజిక న్యాయం అందించే పేరిట రాజ్యాంగపరమైన, చట్టపరమైన, సామాజికపరమైన సంస్కరణలు చేపట్టారు. అందులో భాగంగానే రిజర్వేషన్లు ప్రవేశపెట్టారు.

ఇక బ్రిటీష్ వలస పాలన నుండి రాజకీయ స్వాతంత్ర్యం సాధించుకున్న నేపథ్యంలో తిరిగి అదే సామ్రాజ్యవాద శక్తులతో మిలాఖతు కావడాన్ని ప్రజానీకం సహించే పరిస్థితి లేదు కాబట్టి అలీన విదేశాంగ విధానం పేరిట పెట్టుబడిదారీ ప్రపంచానికీ, సోషలిస్టు ప్రపంచానికీ సమ దూరం పాటించారు. ఏది ఏమైనా భారతదేశం స్వాతంత్ర్యం

> **❝ 1947-70ల వరకూ మనం 'నెహ్రూశకం' అనుకుంటే 1975-90ల మధ్యకాలాన్ని రూపాం తరం చెందుతున్న సంధి కాలం అని చెప్పుకోవచ్చు. 1991 తదాదిగా నయా-ఉదారవాద శకం బలపడింది. 1990లలో కొంత ఒడిదుడు కులను ఎదు ర్కొన్నా సమీప గతం నుండి చూస్తే ఈ విధానాలు సాఫీగా గడిచి పోతున్నాయి. గత ఇరవై ఏళ్ళుగా అవలంబించిన నయా-ఉదారవాద విధానాలు సృష్టించిన పరిస్థితులు అమెరికాలో ఆధునికానంతర వాద ధోరణులు తొలిగా తలెత్తిన నాటి పరిస్థితులను పోలి ఉన్నాయి. ❞**

సముపార్జించుకున్నాక వలస పాలనావశేషాలను అధిగమించి దేశాన్ని ఆధు నికత దిశగా నడిపించడానికి నాడు రాజ్యం ఎంచుకున్న లౌకికవాదం, సామాజికన్యాయం, అలీన విదేశాంగ విధానం... ఈ మూడూ నేటికీ శిరోధార్యాలే.

ఇక రెండవ దశ శ్రీమతి గాంధీ దేశంలో అత్యవసర పరిస్థితిని (ఎమర్జెన్సీ) విధించడంతో మొదలవుతుంది. కాంగ్రెస్ పార్టీలో ముదిరిన సంక్షోభం అప్పటిదాకా తాము అనుసరిస్తున్నా మని చెప్పుకున్న ఉదారవాద ప్రజాస్వామ్యాన్ని నిలువునా ఖూనీ చేసేదాకా పోయింది. ఎమర్జెన్సీ రోజుల దురాగతాలనూ, ప్రజాస్వామ్య పరిహాసాల్నీ స్థలాభావం వల్ల ఇక్కడ వివరంగా చెప్పలేము. కానీ ఆనాడు దేశంలో నెలకొన్న తీవ్ర అనిశ్చితి తదనంతరకాలంలో చవి చూసిన తీవ్ర సంక్షోభానికి సూచికగా మనం పరిగణించవచ్చు. అది ఒక సంధికాలం. ఈ దశ ముగియడంతోనే ముందుకు వచ్చిన తీవ్ర ఆర్థిక సంక్షోభం నుండి గట్టెక్కే నెపంతో దేశం వరుసగా రెండు దఫాలుగా మితవాదంవైపు మొగ్గింది. 1990లో పి.వి- మన్మోహన్ ద్వయం నయా-ఉదారవాద విధానాలకు శ్రీకారం చుడితే, 1999 నాటికి హిందూ మతోన్మాద శక్తులు బి.జె.పి. రూపంలో అధికారానికి చేరువయ్యాయి. ఈ కాలంలో భారత 'ఆధునికత'కు మూలస్థంభాలుగా భాసిల్లిన ప్రభుత్వరంగ సంస్థలు, జాతీయవాదం, లౌకిక తత్వం, స్వతంత్ర విదేశాంగ విధానం మొదలంటా దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. 21వ శతాబ్దారంభానికి సామాజిక పరిభాషలో కాంగ్రెస్ ఉదారవాద ప్రతినిధిగా, మతోన్మాద శక్తులకు బి.జె.పి. ప్రతినిధిగా రెండు అధికార కేంద్రాలు ఏర్పడ్డాయి. అయితే నయా-ఉదారవాద, సామ్రాజ్యవాద అనుకూల విధానాలపట్ల ఈ రెండు అధికార కేంద్రాల మధ్యన ఏకాభిప్రాయం ఉంది.

1947-70ల వరకూ మనం 'నెహ్రూశకం' అనుకుంటే 1975-90ల మధ్యకాలాన్ని రూపాం తరం చెందుతున్న సంధికాలం అని చెప్పుకోవచ్చు. 1991 తదాదిగా నయా-ఉదారవాద శకం బలపడింది. 1990లలో కొంత ఒడిదుడు కులను ఎదుర్కొన్నా సమీప గతం నుండి చూస్తే ఈ విధానాలు సాఫీగా గడిచిపోతున్నాయి. గత ఇరవై ఏళ్ళుగా అవలంబించిన నయా-ఉదారవాద విధానాలు సృష్టించిన పరిస్థితులు అమెరికాలో ఆధునికానంతరవాద ధోరణులు తొలిగా తలెత్తిన నాటి పరిస్థితులను పోలి ఉన్నాయి. శత కోటీశ్వరులకూ, కోట్లాదిమంది పేద ప్రజా నీకానికీ మధ్య అంతరం హద్దులు దాటేసింది. అలాగే వినిమయదారీ సంస్కృతి కేవలం బడా బూర్జువా వర్గంలోనే కాదు, మెట్రో నగరాల్లోనే కాదు, ఇటు మధ్య తరగతి ప్రజానీకంలోనూ, ధనిక భూస్వామ్య కుటుంబాల్లోనూ, పట్టణా ల్లోనూ బాగా పెరిగింది. చాపకింద నీరులా 'సేవింగ్స్' సంస్కృతి బదులు 'అప్పుచెయ్యి ఖర్చు చెయ్యి' సంస్కృతి వచ్చి చేరింది.

'వినిమయ' పరపతి వ్యవస్థ వేళ్ళూను కుంది. ప్రైవేటీకరణ జోరందుకోవడం, నట్టింట్లోకి విదేశీ ప్రసారాలు వచ్చి పడిపోవడం, కంప్యూటర్ల వినియోగం ఇవన్నీ అమెరికన్ ఆధునికానంతరవాద సంస్కృతిపట్ల అంతులేని ఆకర్షణ సృష్టించాయి. ఇందుకు వయసు కూడా అడ్డంకి కాలేకపోయింది. 70వ దశకంలో అమెరికన్ మధ్యతరగతి జనాభాలో ఎటువంటి స్వీయ మానసిక, సుఖభోగలాలస ధోరణులు ప్రబలిపోయామో అవన్నీ భారతీయ సామాజిక చరిత్రలో మునుపెన్నడూ లేనిస్థాయిలో శక్తివంతంగా చుట్టుముట్టేశాయి. ప్రభుత్వాధినేతలు, కార్పొరేట్ నోట్ల కట్టలు, నేరగాళ్ళ మధ్య ఒక అపవిత్ర చెలిమి బలంగా అల్లుకుంది అచ్చం



epaper.prajasakti.com

అమెరికాలో మాదిరిగానే. దాంతో ప్రజల్లో రాజకీయాల పట్ల ఏహ్యాభావం పెరిగిపోయింది. ఇవన్నీ కలగలిసి ఆధునికానంతర భావజాల వ్యాప్తికి అనువైన వాతావరణాన్ని సృష్టించాయి.

ఇవన్నీ సంస్థాగతంగా వచ్చిన మార్పులు. తాత్వికంగా చూస్తే భారతీయ ఆధునికానంతర వాదానికి ఎలాంటి పునాదీ లేదు. అన్నీ అరువు తెచ్చుకున్న సిద్ధాంతాలే. విశ్వమానవ సౌభ్రాతృత్వం, సమిష్టి ప్రయోజనాలు, ఉమ్మడి అభివృద్ధి, సమసమాజం వంటి భావనలకు కాలం చెల్లిపోయిందనే వాదనలకు గొంతు పెరిగింది. ప్రభుత్వమూ, పార్టీలూ, కార్మికసంఘాలూ... ఇవన్నీ బ్యూరోక్రటిక్‌గా తయారై పెత్తందారీ పోకడలు పోతున్నాయి, కాబట్టి కులాలపరంగా, అంశాల వారీగా, స్థానికంగా ఎవరివాటాకోసం వాళ్ళు పోట్లాడుకోవడం మేలు అనే ధోరణి బయల్దేరింది.

శాస్త్రవిజ్ఞానం, నూతన సాంకేతిక ఆవిష్కరణలు మానవజాతి బతుకుదెరువులను సుఖవంతం చేసేవే అయినా నాజీ 'కాన్‌సన్‌ట్రేషన్ క్యాంపులు', నాజీల చేతిలో సాంకేతిక అస్త్రశస్త్రాలు చూపించి సైన్స్ 'మానవాళి విధ్వంసానికే' పనికొస్తుంది అనే స్థాయిలో ప్రచారం జరిగిన సంగతి మనం మరువరాదు. అలాంటి పచ్చిమితవాద ధోరణికి కొనసాగింపుగా నేడు కమ్యూనిజాన్నీ, నాజీయిజాన్నీ ఒకే గాటన కట్టి విష ప్రచారానికి పూనుకోవడం ఈసారి ఆధునికానంతరవాదుల ఓవంతయ్యింది. ఆధునికతను తిరస్కరించడంతోబాటే ఒక్కసారిగా పాత సంప్రదాయాలను 'రొమాంటిసైజ్' చెయ్యడంగా మారింది. ఈ ధోరణులకు ఉదాహరణగా చెప్పుకోవాలంటే కమ్యూనిజాన్ని నియంతృత్వంగా అభివర్ణించే ఫోకాల్ట్, ఇరాన్‌లో మతాచార్యుల విప్లవాన్ని పొగుడుతూ వ్యాసాలు రాశాడు. ఈ తాత్వికునికి మతం ప్రమాదకారిగా తోచకపోవడం విశేషమేకదా. భారత ఆధునికానంతర వాదంలో ఈ ఛాయలన్నీ మనకు కనబడతాయి.

భారతదేశంలో ఆధునికానంతర రాజకీయ శైలులు చిత్రమైన రూపాలు సంతరించుకున్నాయి. 'సామాజిక ఉద్యమాలు' 'పౌర సమాజాలు', 'ప్రభుత్వేతర సంస్థలు'... ఈ పదాల అర్థాలు, అంతరార్థాలు తెలుసుకోవడం మనకు ముఖ్యం. రాజకీయ ఉద్యమాలకు పోటీగా నిలబెట్టినవే ఈ సామాజిక ఉద్యమాలు. రాజకీయాలంటే రాజ్యాధికారానికి సంబంధించిన సంస్థలను 'డీల్' చెయ్యడమే. 'రాజ్యం' అవినీతి కూపంలో కూరుకుపోయి, అత్యున్నత పాలనాధికారుల ఆశ్రితపక్షపాత విధానాలతో కునారిల్లి పోయింది కాబట్టి - అందుకు కారణం రాజకీయ పార్టీలే కాబట్టి, కార్మికవర్గ పార్టీలైనప్పటికీ వామపక్షాలూ అవే రాజకీయాల్లో కొట్టుకులాడు తున్నాయి కాబట్టి అవీ దివాళా ఎత్తిపోయినట్లే. రాజకీయాలే భ్రష్టు పట్టిపోయాయి కాబట్టి వాటి ఊసు వద్దే వద్దు' అనేది సామాజిక ఉద్యమాల, ఉద్యమకారుల వాదన. 'రాజకీయాలతో నిమిత్తం లేకుండా ఎవరికి వాళ్ళం మన సమస్యలమీద, మనం పనిచేసుకుందాం. కావల్సింది సాధించుకుందాం' అంటారు.

రాజ్యాధికారం, రాజకీయాధికారం రెండింటినీ పక్కనపెట్టి వ్యక్తులు, సమూహాలు, సామాజిక తరగతులు వేటికవే విడివిడిగా సాధికారత సంతరించుకునేలా చెయ్యడమే సామాజిక ఉద్యమాల లక్ష్యం అని చెబుతుంటారు. రాజ్యాధికారం సరే రాజకీయాధికారాన్ని కూడా విస్మరిస్తే ప్రజలు ఏమి సాధించుకుంటారు? రాజ్యాధికారాన్ని నిలదీయకుండా వివిధ తరగతుల ప్రజల సమస్యలు పరిష్కారం అయ్యేది ఎట్లా?

ఈ ప్రశ్నలకు సామాజిక ఉద్యమకారుల దగ్గర సమాధానం ఉండదు. 'పౌర సమాజాల'దీ ఇదే బాణీ. పౌర సమాజం అంటే ప్రజలకు సమానార్థకంగా వాడుతుంటారుగానీ, 'రాజ్యానికి' ఈ పౌర సమాజానికీ తేడా ఉందంటారు. అలాగే 'ప్రజా ఉద్యమాలదీ' అదే దారి. చిత్రంగా ఈ మూడింటినీ ప్రభుత్వేతర సంస్థలే (యన్జీఓలే) నడిపిస్తాయి. అవేమో రాజ్యం అందించే నిధులతో నడుస్తాయి. రాజ్యం, రాజ్యాధికారం, రాజకీయాధికారం- వీటితో పనిలేదు సమస్యల పరిష్కారానికి అని చెప్పే ఎన్.జి.ఓ.లు రాజ్యం అందించే నిధులు, విరాళాలూ స్వీకరించడం ఏమిటని మీరు ప్రశ్నిం చారనుకోండి-ఆ సొమ్ము (ఇక్కడి) రాజ్యానిది కాదుగా, స్కాండినేవియా ప్రభుత్వం నుంచో, ఐక్యరాజ్యసమితి విభాగాలనుంచో (ఇది సమీప గతం నుండీ అమెరికా సామ్రాజ్యవాద ప్రయోజనాల కోసం పనిచేస్తోంది), ఫోర్డ్ ఫౌండేషన్ నుండో, యాక్షన్ ఎయిడ్ (ఇది నేరుగా బ్రిటీష్ ప్రభుత్వం నిధులతో పని చేస్తుంది) నుండో ఒక 'మంచి' పనికి మాకు అందుతుంది అని చెబుతారు. ఈ యన్జీఓలు చేసే 'మంచి' పనులకు మురిసి ఫోర్డ్ ఫౌండేషన్, ప్రపంచబ్యాంకు విరివిగా విరాళాలు అందచేస్తున్నాయి. ఈ మధ్యన వేం తీసిపోయామా అన్నట్లు దేశీయ కార్పొరేట్ సంస్థలు కూడా యన్జీఓలకు నిధులు అందచేస్తున్నాయి. అయినా ఈ యన్జీఓలు మేం 'పరిశుద్ధులం' అని బూకరింపులకు దిగుతున్నాయి.

ఇక వీటి పనితీరు గురించి చూద్దాం...

కొన్ని తరగతుల జనాభాకు సంబం[illegible]క సమస్యలమీద స్థానిక కృషి చేస్తాం అని సామాజిక ఉద్యమాలు, పౌర సమాజాలు, యన్జీఓలు చెబుతుంటాయి. అక్కడికి ఈ పనితీరు కొత్తదయినట్లు గొప్పలు పోతుంటాయి. నిజానికి 19వ శతాబ్దం నుండే భారతదేశానికి ఇలాంటి అనుభవాలు ఉన్నాయి. సైద్ధాంతిక పునాది గల పార్టీలు వివిధ తరగతుల ప్రజానీకం ఎదుర్కొంటున్న కొన్ని ప్రత్యేక సమస్యల మీద సంస్కరణోద్యమాలు నడిపాయి. కమ్యూనిస్టుపార్టీకి అలాంటి ఘన వారసత్వం ఉంది. చారిత్రకంగా నడిచిన ఈ ఉద్యమాల ఆధారంగా మరింత విస్తృతమైన, విశాలమైన ఉద్యమాల నిర్వహణ, కార్మిక-కష్టజీవులకు దోపిడినుండి విముక్తి, మహిళా విముక్తి, రైతాంగ విముక్తి అంతిమలక్ష్యంగా నడిచాయి. మరయితే ఇవాళ ఎన్.జి.ఓ.ల పనిలో ప్రత్యేకత ఏమిటో? ఎన్నికల రాజకీయాలు కాదంటారు. వర్గ పోరాటం మాట అటుంచండి, వర్గాల ప్రాతిపదికన కష్టజీవుల మధ్య ఉన్న ఐక్యతను దెబ్బకొట్టేలా పనిచేస్తుంటారు. కార్మికసంఘ కార్యాచరణా అంటే అదీ కాదు, ఇక జాతీయ విముక్తి లక్ష్యమా అంటే అదీ లేదు. కమ్యూనిస్టులు ప్రోదిచేసే వర్గ ఐక్యతను దెబ్బతియ్యడం, కమ్యూ నిస్టు రాజకీయాలు, వర్గ పోరాటాలవైపు ప్రజలు మళ్ళకుండా నిలువరించడమే లక్ష్యంగా ఈ సామాజిక ఉద్యమాల పనితీరు ఉంటుంది. యూరప్‌లో కమ్యూనిస్టు ప్రాబల్యాన్ని అడ్డుకోవడానికి సోషల్ డెమొక్రాట్ పార్టీలు ఇలాగే రైతాంగం, కార్మికవర్గం, మహిళలు, చేతివృత్తిదారులలో ఐక్యతను దెబ్బతియ్యడానికి కొన్ని సంస్థలకు నిధులు సమకూర్చి మరీ ఆ పన్లోకి దించాయి. ప్రస్తుతం భారతదేశంలో పరిస్థితీ అదే.

ప్రచ్ఛన్న యుద్ధకాలంలో యూరప్‌లోని సోషల్ డెమొక్రట్ పార్టీలు అమెరికన్ సామ్రాజ్యవాదంతో మిలాఖతు వైఖరి అనుసరించాయి. దేశంలో కమ్యూనిస్టుపార్టీలను ముఖ్యంగా మార్క్సిస్టు పార్టీలను వ్యతిరేకించే, వామపక్షాలుగా చెప్పుకునే గ్రూపులన్నింటికీ యూరప్‌లోని ఈ సోషల్ డెమొక్రటిక్ పార్టీలు ఆదర్శం. అవి తమకు తాము కమ్యూనిజానికి ప్రజాస్వామిక ప్రత్యామ్నాయంగా భావిస్తాయి. ఈ సోషల్ డెమొక్రటిక్ పార్టీలకు సిఐఎ నిధులు ఎందుకు అందేవో ఊహించడం పెద్ద కష్టం కాదు. అలాగే ఇవాళ ఆ సోషల్ డెమొక్రాట్ పార్టీల ఆధ్వర్యంలో నడిచే ప్రభుత్వాల నుండి దేశదేశాల ప్రభుత్వే తర సంస్థలకు (యన్జీఓలు) నిధులు ఎందుకు అందుతున్నాయో ఊహించడమూ కష్టంకాదు. ఈ రెండు


epaper.prajasakti.com

సందర్భాల్లోనూ నిధుల అందజేత లక్ష్యం కమ్యూనిస్టుల ప్రాబల్యాన్నీ, వర్గపోరాట రాజకీయాలనూ నిలువరించడమే. భారతదేశం లోనేకాదు ఆసియా, ఆఫ్రికా ఖండాలలోని అనేక దేశాలకు ఈ తరహా నిధులు వరదలా వెల్లువెత్తు తున్నాయి. కమ్యూనిస్టు వ్యతిరేకతను ప్రదర్శిస్తే చాలు యన్జీఓలకు నిధులు వాటంతట అవే వచ్చిపడతాయి.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన కొంతకాలం వరకూ సైద్ధాంతికంగా సామ్రాజ్యవాద వ్యతిరేకత, ఆర్థిక స్వావలంబన, అభివృద్ధి, అలీన విదేశాంగ విధానాలు బలంగా నడిచాయి కాబట్టి ఆ కాలం వరకూ సామ్రాజ్యవాద శక్తుల ఆటలు అట్టే సాగలేదు. ఎప్పుడయితే నయా- ఉదారవాద విధానాలు ఊపందుకున్నాయో పై తాత్విక భూమిక వెనుకపట్టు పట్టింది. దాంతో పాటే సామ్రాజ్యవాద శక్తుల నుండి కమ్యూనిస్టు వ్యతిరేక నిధుల ప్రవాహం ఊపందుకొంది. భారత కార్పొరేట్ సంస్థలూ దీనికి తమవంతు 'చేయూత అందించాయి. ప్రభుత్వం సామాజిక సంక్షేమ పథకాల నుండి క్రమేపీ వైదొలుగుతున్న క్రమంలోనే కొన్ని నిధులను ప్రత్యేకించి ప్రభుత్వేతర సంస్థలకు కేటాయించడం మొదలు పెట్టింది. బంగ్లాదేశ్ వంటి నిరుపేద దేశంలో ఈ ఒరవడి ఉండేది. ఈ ప్రభుత్వేతర సంస్థలే సూక్ష్మ సేద్యం లాగా 'సూక్ష్మ రాజకీయాలు' (మైక్రోపాలిటిక్స్) పేరిట 'సామాజిక ఉద్యమాలు' 'పౌర సమాజ ఆందోళనలకు' శ్రీకారం చుట్టా యి. ఈ తరహా రాజకీయాలు రాజ్యానికీ, పాలక వర్గ శక్తులకూ వ్యతిరేకంగా నిలబడే 'సంఘటిత, ఐక్య ప్రతిఘటనా శక్తుల' బలాన్ని నీరసపరి చేందుకే ఉపయోగపడతాయి. అంతిమంగా ప్రపంచ పెట్టుబడి శక్తులకు ప్రయోజనం చేకూరుస్తాయి.

భావజాల రంగంలో కూడా ఆధునికా నంతర ప్రభావం గట్టిగానే పడింది. అధ్యయన కమిటీలు, అధ్యాపకులు, విద్యార్థులు, ఉన్నత విద్యాసంస్థలు, రాజకీయ కార్యకర్తలు, పరిశోధకులు, సామాజిక శాస్త్రాలు, కళా, సాహిత్య రంగాలలో ఆధునికానంతరవాదం అనేక రూపాలు తీసుకుంది. నయా–ఉదారవాదం సమాజంలోని అన్ని పార్శ్వాలనూ కబళించివేసే క్రమంలో ప్రపంచ ద్రవ్య పెట్టుబడి మౌలిక సిద్ధాంతమైన ఆధునికానంతరవాదం కూడా అన్ని రంగాలలోకీ రెక్కలు చాస్తోంది. ఈ ఆధునికానంతరవాదం రాజ్యాన్నీ, రాజకీయ పార్టీలనూ, కార్మికసంఘాలనూ, పర్యావరణ క్షీణతనూ, కుల పీడననూ ఇలా అనేక

**"భావజాల రంగంలో కూడా ఆధునికా నంతర ప్రభావం గట్టిగానే పడింది. అధ్యయన కమిటీలు, అధ్యాపకులు, విద్యార్థులు, ఉన్నత విద్యాసంస్థలు, రాజకీయ కార్యకర్తలు, పరిశోధకులు, సామాజిక శాస్త్రాలు, కళా, సాహిత్య రంగాలలో ఆధునికానంతం వాదం అనేక రూపాలు తీసుకుంది. నయా-ఉదారవాదం సమాజంలోని అన్ని పార్శ్వాలనూ కబళించివేసే క్రమంలో ప్రపంచ ద్రవ్య పెట్టుబడి మౌలిక సిద్ధాంతమైన ఆధునికానంతర వాదం కూడా అన్ని రంగాలలోకీ రెక్కలు చాస్తోంది."**

అంశాలను వ్యతిరేకిస్తుంది... ఒక్క మార్కెట్‌ను తప్ప. స్తబ్దతకు వ్యతిరేకం మా సిద్ధాంతం అని చెప్పుకునే ఆధునికానంతరవాదం వాస్తవానికి కోరుకునేది మరింత మార్కెట్ స్వేచ్ఛ. రాజ్యం జోక్యం చేసుకోవడం ద్వారా అణగారిపోయిన (మార్కెట్) స్వేచ్ఛ రెక్కలు పూర్తిగా విప్పారితే మరింత అభివృద్ధి సాధ్యం' అని సూత్రీకరిస్తుంది ఆధునికానంతరవాదం. ఇది ఎలా సాధ్యం? ఆర్థిక వ్యవస్థను సంపూర్ణంగా ప్రైవేటీకరించడం ద్వారానే కదా. ప్రపంచ ద్రవ్య పెట్టుబడి కోరుకునేదీ ఇదే కదా. అందుకే ఈ రెండూ పరస్పర ఆధారితంగా 'హవా' నడుపుతున్నాయి ఇవాళ.

ఐరోపా-అమెరికన్ విద్యా వ్యవస్థమీద చాలాకాలంగా ఆధునికానంతరవాద ఆధిపత్యం నడుస్తోంది. అందులో భాగంగానే అమెరికా లోనో, ఐరోపాలోనో 'థీసిస్' (పి. హెచ్.డి) చేసి వచ్చిన మేధావులలో (?) ఈ ధోరణలు ఎక్కువగా ఉంటాయి. అమెరికాలో పి. హెచ్.డి. చెయ్యాలనుకుంటే ఎన్నుకునే అంశం భారతదేశ విస్మృత తరగతుల అధ్యయనానికి సంబంధించినది అయితే అలాంటి వారికి 'లాంగ్ టర్మ్' అవకాశం రానే రాదు. అదే ఆధునికానంతరవాద ధోరణు లకు సంబంధించిన అంశం ఎన్నుకుంటే అలాంటి వాళ్ళపని బూరెల బుట్టలో పడ్డట్లే. అమెరికాలో 'లాంగ్ టర్మ్' పరిశోధనావకాశాలకు తోడు, ఆ పట్టాతో ఇక్కడ డబ్బుతో బలిసిన యూనివర్శిటీలు, కాలేజీల్లో ఉద్యోగావకాశం కూడా ఠక్కున వచ్చి పడుతుంది. ఈ మధ్య కాలంలో ఈ ధోరణి బాగా ఊపందుకుంది. అలాగే ఈ మధ్య కాలంలో విదేశీ సంస్థలు దేశం లోని వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన కొన్ని ప్రత్యేక విభాగాలకు నిధులు అందించడం మొదలుపెట్టాక అధ్యాపన పద్ధతులనూ, కోర్సులనూ ఆధునికానంతరవాద ధోరణులను ప్రోత్సహించేందుకు వీలుగా పునర్వ్యవస్థీకరిస్తున్నారు. మహిళా సమస్యలు, దళిత, పర్యావరణ, జెండర్ అధ్యయనాలకు బాగా ప్రోత్సాహం లభిస్తోంది. ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ అని మన దగ్గర పత్రిక 'ఉమన్ స్టడీస్' పేరిట ప్రత్యేక సంచికలూ, ఇతరత్రా అనేక విశ్లేషణాత్మక వ్యాసాలూ, పరిశోధనాంశాలూ ఆధునికానంతర వాద ధోరణులతోనే ప్రచురిస్తోంది. ఒకరకంగా చెప్పుకోవాలంటే ఒకప్పుడు అట్టడుగువర్గాల ప్రజల సమస్యలమీద అధ్యయనాలూ, విశ్లేష ణలూ, వ్యాసాలూ, పరిశోధనాంశాలూ చేపట్టిన వారే ఇవాళ చరిత్రలో, సామాజిక శాస్త్రాల్లో ఆధునికానంతరవాద ధోరణులను పనిగట్టుకుని చలామణీ చేస్తున్నారు.

1982లో తొలిసారిగా ఈ గ్రూపు రంగం మీదకి వచ్చింది. అప్పట్లో రంజిత్ గుహ అనే చరిత్రకారుడు దీనికి నాయకుడిగా ఉన్నాడు. జన్మతః భారతీయుడైనా ఆస్ట్రేలియాలో స్థిర పడ్డాడు. ఇందులో భారతీయ మేధావులున్నారు. విదేశాల్లో స్థిరపడిన భారతీయ విద్యా ప్రముఖులు ఉన్నారు,. దేశంలో ఉన్న పశ్చిమదేశాల స్కాలర్లూ ఉన్నారు. సూక్ష్మంలో చెప్పుకోవాలంటే 'సబాల్టర్న్ స్టడీస్' (అట్టడుగు తరగతుల అధ్యయనాలు) ఖండాంతర ప్రాజెక్టులుగా, విదేశాల్లోని భారతీయ మూలాలుగల మేధావుల విశేష పాత్రతో రంగం మీదకి వచ్చాయి. ఈ మేధావుల బృందానికి అచిరకాలంలోనే అంతర్జాతీయ ఖ్యాతి వచ్చింది. నాలుగేళ్ళు గడిచాక చికాగో యూనివర్శిటీ ప్రొఫెసర్ రొనాల్డ్ ఇండెన్ గట్టి విశ్వాసంతో ఒకమాట చెప్పాడు: "వల సానంతరం తొలిసారిగా భారతీయులు తమను తాము వ్యక్తీకరించుకునే సామర్థ్యాన్ని పునఃసంతరించుకున్నారన్న సంకేతాలు బలంగా కనిపిస్తున్నాయి" అన్నాడు. 1986లో ఈ మాటలు చెప్పాడు. ఓ పదేళ్ళు గడిచేలోగా 1995లో ఎడ్వర్డ్ సెయిద్ ఓరియంటలిజం (ప్రాచ్యవాదం) అన్న పుస్తకం నూతన ప్రచురణను ఆవిష్కరిస్తూ 'సబాల్టర్న్' వాదులు తన వార సత్వాన్ని కొనసాగిస్తారనే ఆశాభావాన్ని వ్యక్తపరిచాడు. అక్కడితో ఈ



epaper.prajasakti.com

రకమైన అధ్యయనాలకు అగ్రరాజ్యశక్తులనుండి ఆకాశానికి ఎత్తేసే ప్రచారం లభించింది.

ఈ 'సబాల్టర్న్'వాదం ఏకీకృతవాదంగా కొనసాగిందని చెప్పలేం. ఎందుకంటే ఈ గ్రూపులోని సభ్యులు తరచూ మారుతుండేవారు. వాళ్ళతోపాటే వాళ్ళ తాత్విక ఆలోచనలలోనూ మార్పు చోటు చేసుకునేది. ఈ గ్రూపుమీద, ఆద్యుడైన రంజిత్ గుహ ప్రభావం బలీయంగా ఉండేది. ఇతనితోపాటు మరో ముగ్గురు... దీపేష్ చక్రవర్తి, పార్థా ఛటర్జీ, గ్యాన్ పాండే స్థిరంగా కొనసాగారు. కాబట్టి ఈ నలుగురిదీ జట్టు అనుకోవచ్చు. మొదట్లో మార్క్సిస్టు ఆలోచనలతో మావో, గ్రాంసీ, ఇ.పి. థాంప్సన్ తదాది నాయకుల ఉటంకింపులతో వ్యాసాలూ, విమర్శలూ అధ్యయనాలూ వచ్చేవి. ఎప్పుడైతే అంతర్జాతీయ ఖ్యాతి వచ్చి చేరిందో క్రమేపీ మార్క్సిజం నుండి తెగతెంపులు చేసుకుని ఐరోపా-అమెరికా ఆధునికానంతరవాదంతో అంటుకట్టుకుంది. (బహుశా ఇందుకేనా రంజిత్ గుహకు ఎడ్వర్డ్ సెయిడ్ 'వినిర్మాణవాది' అని కితాబిచ్చిందీ?) ఇది 1990ల నాటికి వచ్చేసరికి బాబ్రీ మసీదు విధ్వంసం, ఎన్నికల రాజకీయా లలో బిజెపి శరవేగంగా ఒక శక్తిగా ఎదిగి అధికారానికి చేరవవడంతో ఈ గ్రూపులోని పార్థా ఛటర్జీ, గ్యాన్ పాండేలు పచ్చి కమ్యూనిస్టు వ్యతిరేక నయా-సంప్ర దాయవాద కక్ష్యలోకి చేరిపోయారు. అప్పటికే ఆషిస్ నంది, టి.ఎన్. మదన్‌లు ఆ కక్ష్యలో తిరుగాడుతూ ఉన్నారు. 'అట్టడుగు తరగతుల అధ్యయనాల' (సబాల్టర్న్ స్టడీస్) తొలి సంపుటాలకు పనిచేసిన స్వపన్ దాస్‌గుప్తా ఆర్.ఎస్.ఎస్./బిజెపి భావజాల ప్రచార అధికారిక ప్రతినిధిగా మారిపోయాడు. వీటన్నిటిబట్టి 'సబాల్టర్న్ స్టడీస్' ఏ ఉద్దేశంతో మొదలయ్యాయో, జాతీయత, లౌకికవాదం, మతోన్మాదం వంటి అంశాలపై ఎటువంటి వైఖరులు తీసుకున్నాయో ఇప్పుడు మనం విశ్లేషిద్దాం.

'అట్టడుగు సెక్షన్ల చరిత్ర అధ్యయనాల' (సబాల్టర్న్ స్టడీస్) పేరిట 1982లో మొదటి ప్రచురణ వెలువడింది. ఈ అధ్యయనాల వ్యవస్థాపకుడు రంజిత్‌గుహ. 'వలస భారతదేశ చరిత్రకు సంబంధించిన కొన్ని పార్శ్వాలు' పేరిట ఒక వ్యాసాన్ని ఈ పుస్తకానికి జతచేస్తూ తమ ప్రాజెక్టు ఉద్దేశాలు ఏమిటో ఇలా వివరించాడు: 'భారత జాతీయోద్యమ చరిత్ర చాలాకాలంగా వలస ఆధిపత్యవర్గాల, బూర్జువా జాతీయోద్యమ ఆధిపత్యవర్గాల చేతుల్లో ఉండిపోయింది' అంటూ మొదలుపెట్టి తాను, తన సహచరులు మూడు దశాబ్దాలుగా కృషి చేసి ఈ అధ్యయనాలు వెలువరిస్తున్నట్లు ప్రకటించాడు. బ్రిటీష్ వలస పాలనమీదా, జాతీయోద్యమంమీదా అసలు మార్క్సిస్టు దృక్పథంతో చేసిన రచనలూ, అధ్యయనాలూ ఉన్నాయనే విషయాన్నే పట్టనట్లు రంజిత్ గుహ వ్యవహరించాడని అతని రాత లనుబట్టి మనం అర్థం చేసుకోవచ్చు. ఇటువంటి వారికి 'సబాల్టర్న్' అనే పదాన్ని ఉపయోగించుకునే హక్కు ఉందా అస్సలూ. ఈ పదాన్ని గ్రాంసీ రచనల నుండి అరువు తెచ్చుకున్నారు. గ్రాంసీ ఇటలీ కమ్యూనిస్టుపార్టీ వ్యవస్థాపకులలో ఒకరు. నాజీ పాలకులు ఖైదు చేస్తే జైలునుండే అద్భుతమైన మార్క్సిస్టు రచనలు చేశాడు. జైలు అధికారులు 'సెన్సార్' చెయ్యకూడదనే ఉద్దేశంతో గ్రాంసీ తన రచనల్లో కార్మికవర్గం (వర్కింగ్ క్లాస్) అనే మాటకు బదులు 'సబాల్టర్న్ క్లాస్' అనే పదాన్ని వాడాడు. 'కార్మికవర్గం, దోపిడీకి గురి కాబడినవర్గం' అనే పదాలకు ప్రత్యామ్నాయంగా మౌలిక వర్గాలు (ఫండమెంటల్ క్లాస్), సబాల్టర్న్ వర్గాలు' అనే పదాలువాడాడు. కాని రంజిత్‌గుహ, అతని సహచరులు మాత్రం సమాజాన్ని అర్థం చేసుకోవడంలో మార్క్సిస్టు అవగాహనకు తిలోదకాలు ఇచ్చేసి భారతీయ సమాజం ఉన్నత వర్గాలు, నిమ్న తరగతులు అన్న సాధారణ సూత్రీకరణకు కుదించేశారు. ఈ మాటను ఉపయోగిస్తూనే వెనువెంటనే ఉన్నతవర్గం పరిస్థితులను బట్టి నిమ్నవర్గంగానూ, ఇటు దటుగానూ మారవచ్చు. అని ఇంకో సూత్రీకరణా చేశారు. దానికో ఉదాహరణా చెప్పారు: భూమిగల రైతాంగం పల్లె పట్టుల్లోని పేద-నిమ్న వర్గాలతో పోలిస్తే సంపన్న వర్గమే. కానీ బడా భూస్వాములు - బూర్జువాలతో పోలిస్తే నిమ్నవర్గం కిందకే వస్తారు అన్నారు. ఇట్లాంటి సూత్రీకరణలకు ముగింపుగా భారత రాజకీయాలు సంపన్నవర్గాలు, నిమ్న తరగతులు అని రెండు 'డొమైన్'లుగా విభాజితమై ఉన్నాయి. నిమ్న తరగతుల వర్గం స్వయం ప్రతిపత్తి, తమదైన చైతన్యం, కార్యాచరణ కలిగి ఉంది అన్నారు. ఇప్పుడు మేం చేసేపని అటువంటి నిమ్న తరగతుల జనాభా చరిత్రను పునర్మూ ల్యాంకనం చెయ్యడమే అని ప్రకటించారు. విచిత్రం ఏంటంటే ఈ చరిత్రలో కార్మిక సంఘాలు, రైతుసంఘాలు, ఇతర అనేక ప్రజా సంఘాలు, కమ్యూనిస్టుపార్టీలు చేపట్టిన వైవిధ్య భరితమైన, సమరశీల ఆందోళనలు, పోరాటా లకు స్థానం లేకుండా పోయింది. మూడు దశా బ్దాలపాటు శ్రమకోర్చి వెలువరించిన 'సబాల్టర్న్' చరిత్రలో వర్గపోరాటాలకు స్థానం లేకుండా చేసిన విన్యాసమే తప్ప వీరు కొత్తగా చేసిందేమీ లేదు. దోపిడీకి గురికాబడిన వారి చరిత్ర అంటూనే వర్గ రాజకీయాల్నీ, వర్గాలనూ పూర్తిగా విస్మరించడం కేవలం పైకి అభ్యుద యం ముసుగుతో వర్గరహిత రాజ చలామణిలోకి తీసుకురావడానికే అనేది మనం గ్రహించవచ్చు.

తన సహచర మార్క్సిస్టు చరిత్రకారుల రచనలమీద రంజిత్‌గుహ ఎలాంటి దాడులకూ దిగలేదు. అలా అని కనీసం చర్చకు కూడా తీసుకోలేదు. తద్వారా భారతదేశ చరిత్ర పట్ల బూర్జువాలకూ, మార్క్సిస్టులకూ ఒకే రకమైన అవగాహన ఉందనే రీతిలో వ్యవహరించారు. కాని అదే రంజిత్ గుహ 'వలస పాలనమీద బ్రిటీష్ చరిత్రకారుల ఉదారవాద అంచనాలను కూడా భారత చరిత్రకారులు కనీసంగా పరిగణనలోకి తీసుకోలేదు' (సబాల్టర్న్ స్టడీస్, వాల్యూం-6, పేజ306) అని నిష్ఠూరమాడాడు.

సమాజంలో దోపిడీ చేసే వర్గం, దోపిడీకి గురికాబడే వర్గం అన్న రెండే వర్గాలు ఉంటాయి అన్న మార్క్సిస్టు సూత్రీకరణలను తిరస్కరిస్తూ బూర్జువా సామాజిక శాస్త్రం నుండి అరువు తెచ్చుకున్న కులీన తరగతులు, నిమ్న తరగతులు సిద్ధాంతాన్ని తలకెత్తుకుంది గాక హేతుబద్ధమైన సిద్ధాంతంమీద దాడికి దిగడం ద్వారా ఆధునికా నంతరవాద బాట పట్టాడు. కాబట్టి అణగారిన వర్గాల చరిత్ర (సబాల్టర్న్‌హిస్టరీ) పేరిట ఈయన గారూ, ఈయన సహచర బృందం తలకెత్తుకున్న ప్రాజెక్టు మార్క్సిస్టు మౌలిక సూత్రాల నుండి విడగొట్టుకోవడానికి ఉద్దేశించినదే.

1993లో దీపేష్ చక్రవర్తి ఒక వ్యాసం రాస్తూ 'నిమ్నవర్గాల' ప్రాజెక్టు అసలు స్వభావంలో ఇలాంటి మార్పుకు కారణమేంటో వివరించాడు. 'ఆర్థికవర్గాలకు కుదించే ధోరణిని వదిలిపెట్టి మార్క్సిస్టు చరిత్రలను మరింత మెరుగ్గా రాసేం దుకే'ఈ ప్రాజెక్టు చేపట్టాం అంటాడు. కాబట్టి 'సబాల్టర్న్ స్టడీస్' పేరిట రంగంమీదకి వచ్చిన నిమ్న తరగతుల చరిత్ర అధ్యయనాలు మౌలికంగా మార్క్సిస్టు మూలసూత్రాల తిరస్కరణ ప్రాతి పదికగా ముందుకొచ్చినవే అని మనకు మరో సారి రూఢీ అయ్యింది. 'ఆర్థిక వర్గాలకు కుదించే ధోరణి'ని వదులుకోవడం అంటే ఈ కింది నాలుగు సూత్రాలను వదులుకోవడమే:

(1) ఏ సమాజానికైనా ఆర్థిక వ్యవస్థయే వెన్నెముక.

(2) పెట్టుబడిదారీ వ్యవస్థ నడిచేందుకు మౌలికంగా అవసరమైన వర్గాలే ఆ సమాజంలో మౌలిక సామాజిక శక్తులుగా ఉంటాయి.

(3) వర్గ పోరాటాల చరిత్రయే మానవ చరిత్ర.

(4) శ్రామికవర్గ విప్లవాలే సమాజ మౌలిక మార్పుకు కీలకం అన్న నాలుగు మూల


epaper.prajasakti.com

సూత్రాలనూ విస్మరించడమే.

అమెరికన్ ఆధునికానంతరవాదం ఊపందుకున్న మలిదశలో ఈ 'సబాల్ట్రన్' వాదులు మార్క్సిస్టు సిద్ధాంతపు 'విశ్వజనీయత'నూ తిరస్క రించారు. ఆ విశ్వ జనీయ సూత్రాలు:

(అ) జాతి, మత, వర్గ భేదాలకు అతీతంగా ఉమ్మడి మానవీయత ఉంటుంది. పెట్టుబడిదారీ వ్యవస్థ జాతి, మత, వర్గ భేదాలతో నిమిత్తం లేకుండా దోపిడీ చేస్తూనే ఉంటుంది.

(ఆ) సమాజాన్ని ఈ దోపిడీనుండి విముక్తం చెయ్యనిదే శ్రామికవర్గ విముక్తి సాధ్యంకాదు

(ఇ)పెట్టుబడిదారీ వ్యవస్థ విశ్వవ్యాపిత మైనది కాబట్టి దీన్ని కూలదోసే సోషలిస్టు విప్లవమూ విశ్వజనీనం.

(ఈ) జాతి, మత, వర్గాలు నిస్సందేహంగా అస్థిత్వ నమూనాలే. కానీ ఈ అస్థిత్వాలకు అతీతంగా మెజార్టీ ప్రజానీకం పెట్టుబడిదారీ దోపిడీకి గురయ్యేవారే. దోపిడీకి గురికాబడే ప్రజానీకం అంతా ఏకమై తీరతారు.

> **"సమాజంలో దోపిడీ చేసే వర్గం, దోపిడీకి గురికాబడే వర్గం అన్న రెండే వర్గాలుంటాయి అన్న మార్క్సిస్టు సూత్రీకరణలను తిరస్కరిస్తూ బూర్జువా సామాజిక శాస్త్రం నుండి అరువు తెచ్చుకున్న కులీన తరగతులు, నిమ్న తరగతులు సిద్ధాంతాన్ని తలకెత్తుకుంది గాక హేతుబద్ధమైన సిద్ధాంతంమీద దాడికి దిగడం ద్వారా ఆధునికా నంతరవాద బాట పట్టాడు. అణగారిన వర్గాల చరిత్ర (సబాల్టన్ హిస్టరీ) పేరిట వీరు తలకెత్తుకున్న ప్రాజెక్టు మార్క్సిస్టు మౌలిక సూత్రాల నుండి విడగొట్టుకోవడానికి ఉద్దేశించినదే."**

ఈ మార్క్సిస్టు అవగాహననూ, మార్క్సిస్టు విశ్వజనీనతనూ తిరస్కరించాక-ఈ 'సబాల్ట్రన్' వాదులు గ్రాంస్కీని, మావోను మాటికి పది మాట్లు ఉదహరించినంత మాత్రన ఈ భాషా పటాలోపం వెనక ఉన్న అస్సలు ఉద్దేశాలు మరుగున పడిపోతాయా?

మార్క్సిజాన్ని తిరస్కరించి, ఆధునికానంత రవాద ఆలోచనలతో అంటుకట్టుకున్నాక లౌకికవాదం, మతోన్మాదం వంటి అంశాలపై వీరు తీసుకునే వైఖరి హిందూత్వ రాజకీయాలు కాకపోవచ్చుగానీ కచ్చితంగా మితవాద వైఖరులే. గ్యానేంద్ర పాండే ప్రధానంగా ఈ అంశాలమీద అనేక రచనలు చేశాడు. పార్థా ఛటర్జీ కూడా ప్రభావంతమైన రచనలే చేశాడు. గ్యానేంద్ర పాండే 1990లో 'వలస ఉత్తర భారతదేశం-మతోన్మాద నిర్మాణం' పేరిట ఒక పుస్తకం వెలువరించాడు. అందులో మతోన్మాద వ్యతిరేకత పేరిట లౌకికశక్తుల సమీకరణనూ విమర్శించాడు. 'అటు వలసవాదులు, ఇటు జాతీయవాదులూ ఇరువురూ ఒకే ఉదారవాద సిద్ధాంతం నుండి (పరస్పరాధారిత 'హేతువాదం' 'లౌకిక వాదం') నిర్వచించారు' అంటాడు.

మత ఘర్షణల వెనుక ఆర్థిక కారణాలు వెతకడం దండిగమారిపని, మతోన్మాదం అనేది అలివిమాలిన లౌకికవాదానికి ప్రతిస్పందనకు మించి మరేమీ కాదు అని సూత్రీకరించాడు. 'లౌకికవాద చరిత్ర సంప్రదాయాలను సృష్టించాలని చేసిన ప్రయత్నమే మత ఛాందసానికి ఊపిరులూదింది. లౌకికవాదాన్ని తలకెత్తుకో వడమే మొదట చేసిన తప్పు, దీనికి ప్రతిచర్యగానే మతోన్మాదం ముందుకొచ్చింది' అంటాడు. "లౌకికవాదాన్ని ఒక కొత్త 'మతం'గా 1920ల నుండి ముందుకు తీసుకువచ్చిన ఫలితమే మతోన్మాద రాక్షసి అవతరణ' అంటూ మరో సూత్రీకరణ కూడా చేశాడు. వలన పాలకులు, లౌకిక జాతీయవాదుల ఉమ్మడి కృషి మూలం గానే ఈ భూతం మనల్ని ఆవహించింది అని చివరికి తేల్చేశాడు.

ఇక పార్థా ఛటర్జీ కూడా ఇందులో తక్కువేం తినలేదు. 'లౌకికవాదం-(మత) సహనం' పేరిట రాసిన వ్యాసంలో ఆషిష్ నంది అభిప్రాయాలను సమర్థిస్తూ అనేక వాదనలు ముందుకు తెచ్చాడు. సంప్రదాయ మత సమూహాలకు అంతర్గతంగానే (పరమత) సహనశక్తి నిబిడీకృతమై ఉంటుంది. మత అసహనం అనేది ఆధునికత ఉత్పత్తి అంటాడు. దేశాన్ని లౌకికవాదంవైపు నడిపిం చాలనీ, లౌకిక చట్టాల ద్వారా మత ఘర్షణలను పరిష్కరించాలనీ జాతిరాజ్యం చేసిన ప్రయ త్నాలు బెడిసికొట్టి మతోన్మాదం తలెత్తింది. మతాన్ని ఆధునీకరించాలని రాజ్యం చేసిన ప్రయత్నాల మూలంగానే దానికి ప్రతిఘటనగా మతోన్మాదం ముందుకొచ్చింది అంటాడు. రాజ్యం మత విషయాల్లో జోక్యాన్ని ఎంతగా తగ్గించుకుంటే అంతగా భిన్నమతాలు, వాటికవే వాటిమధ్యన సంబంధాలను సర్దుబాటు చేసుకుంటాయి. అసలు ఏ మతమైనా దానంతట అదే తనని తాను సంస్కరించుకోవాలి కానీ వేరేశక్తులు ఏవో అందుకు పూనుకోవడం ఏమిటని నిలదీస్తాడు. దేశం ఏనాడయితే లౌకికవాదాన్ని వదులుకొని ఈగడ్డ భిన్నమతాల సమాహారమని గుర్తిస్తుందో, మత విషయాల్లో జోక్యం మానుకుంటుందో అప్పుడు మాత్రమే మత సామరస్యానికి చోటు దక్కుతుంది అని నిర్ధారించాడు.

సరే హిందువులూ, ముస్లింలు తమ ఇబ్బందులను తమకి తాముగా పరిష్కరించు కుంటారనే వాదననే అంగీకరిద్దాం. మరి అలాంటప్పుడు విశ్వహిందూపరిషత్, భజరంగ్ దళ్, శివసేన, ఇమాం బుఖారీ అండ్ కంపెనీల మాటేమిటి? వీటిని ఏం చెయ్యాలి? దీనికి మాత్రం పార్థా ఛటర్జీ దగ్గరగానీ, ఆషిష్ నంది దగ్గరగానీ సమాధానం లేదు.

ఛటర్జీ రచనలలో 'నెహ్రూ' మీద విషం చిమ్మడం ఎక్కువగా కనిపిస్తుంది. లౌకికవాదా నికి కట్టుబడి ఉండడం, రాజ్యం జోక్యందారీ విధానాలనూ, ప్రణాళికాబద్ధ ఆర్థిక విధానా లనూ అనుసరించడమే నెహ్రూమీద ఈ కంట గింపుకు కారణం.

స్వాతంత్ర్యానంతర భారతదేశంలో పెట్టు బడిదారీ ఆధునికతకు కావల్సిన బీజాలన్నీ నెహ్రూ హయాంలోనే పడ్డాయని, భారతదేశ ఆధునికానంతరవాద ధోరణల గురించి వివ రించే క్రమంలో ఈ వ్యాసంలో మొదట్లోనే నేను ప్రస్తావించాను. అందుకే ఇక్కడి ఆధునికా నంతర వాదులు, సబాల్ట్రన్ వాదులు భారత ఆర్థిక-రాజకీయ వ్యవస్థలను నయా ఉదారవాద విధానాల వాహకాలుగా తీర్చిదిద్దే క్రమంలోనే దేశం 'నెహ్రూహయాం'లో చరిత్రలో వేయ కూడని తప్పటడుగు వేసిందని నమ్మించడానికి శతథా ప్రయత్నిస్తున్నారు. రాజ్యం జోక్యం (ఇంటర్‌వెన్షన్) చేసుకునే విధానాలకు స్వస్తి చెప్పాలని వీరు ముక్తకంఠంతో కోరుకుంటున్నా రంటే అంతా మార్కెట్ శక్తులకు వదిలెయ్యమని డిమాండు చెయ్యడమే. సమాజం బాగోగులు, నడక, నడత అన్నీ మార్కెట్‌కే వదిలెయ్యమని చెప్పడమే. ఇది మార్కెట్ ఛాందసవాదం కాక మరేమిటి? ఒక్కమాటలో చెప్పుకోవాలంటే ఆధునికానంతర వాదుల, 'సబాల్ట్రన్' వాదుల మానసపుత్రిక 'నయా-ఉదారవాద ప్రపంచీ కరణ'. వారి రాతలు ప్రపంచీకరణ విధానాలకు కొలుపులు. మేధావులు, సమాజ హితైషులు దయచేసి ఆ ఉచ్చులో పడకండి.

**(అనువాదం: సత్యరంజన్)**




epaper.prajasakti.com

చరిత్ర

# మౌర్య సామ్రాజ్య స్థాపన

ఎంవిఎస్ శర్మ



రచయిత ప్రజాశక్తి మాజీ ఎడిటర్

అలెగ్జాండర్ భారత ఉపఖండంలో వాయవ్య ప్రాంతంలో తన అధికారాన్ని స్థిరపరచుకుని అక్కడి నుండి వెనక్కి మళ్ళాడు. ఇది క్రీ.పూ.327-325 మధ్య జరిగింది. తిరుగు ప్రయాణంలో క్రీ.పూ.323లో అలెగ్జాండర్ మరణించాడు.

అలెగ్జాండర్ వాయవ్య భారతాన్ని ఆక్రమించుకునే పనిలో ఉన్ననాటికే తూర్పున మగధ రాజ్యం మహాపద్మనందుని పాలనలో నడుస్తోంది. అంతకు ముందు మగధ ప్రాంతాన్ని పాలించినది శిశునాగ వంశస్థులు. వారిలో చివరివాడు మహానంది. ఇతనికి ఒక శూద్ర స్త్రీ ద్వారా జన్మించినవాడు మహాపద్మనందుడు. ఇతను రాజయ్యాక చుట్టుపక్కల ఉన్న క్షత్రియ పాలకులను నిర్మూలించి విశాలమైన మగధ రాజ్యాన్ని ఏర్పరిచాడు. నంద వంశ పాలన క్రీ.పూ. 344 నుండి 322 వరకూ సాగింది. మహాపద్మనందుడు, అతని తొమ్మిదిమంది కుమారులు ఈ కాలంలో పాలన సాగించారు. పాటలీపుత్రం రాజధానిగా ఉన్న మగధరాజ్యం పశ్చిమాన దిగువ గంగా పరీవాహక ప్రాంతం వరకూ, (పశ్చిమ యు.పి.) దక్షిణాన కళింగ ప్రాంతం వరకూ విస్తరించింది.

ఇంత సువిశాల రాజ్యాన్ని పాలించేందుకు నందులు చాలా పెద్ద సైన్యాన్నే ఏర్పాటు చేశారు. నందుల సైన్యంలో రెండు లక్షల మంది కాల్బలం, ఇరవై వేల మంది అశ్విక దళం, రెండు వేల రథాలు, మూడు నుండి నాలుగు వేల గజదళం ఉండేవని అలెగ్జాండర్‌కు గూఢచారులు నివేదికలు పంపారు. ఆ సంఖ్యలు కొంత అతిశయోక్తులు కావచ్చు. కాని ఆ కాలంలోని ఇతర దేశాల సైన్యాల సైజుతో పోల్చినప్పుడు నిస్సందేహంగా నందుల సైనిక బలగాలు చాలా ఎక్కువ. అలెగ్జాండర్ పంజాబ్ ప్రాంతంతో తన దండయాత్రను సరిపెట్టి వెనక్కి మళ్ళాలని నిర్ణయించుకోవడం వెనుక నందుల సైనిక శక్తి కూడా ఒక కారణం కావచ్చు.

మహా పద్మనందుడు, అతని కుమారులు పాలించిన తీరు చాలా క్రూరంగా, ప్రజలను పీడించే విధంగా సాగింది. చివరికి ఆ రాజ్యంలో " చేసే ఉద్యోగులలో, అధికారులలో కూడా నందుల పట్ల తీవ్ర వ్యతిరేకత నెలకొంది. ఆ వ్యతిరేకత నంద రాజ్య పతనానికి దోహదం చేసింది. చంద్ర గుప్తుని పాలనకు, మౌర్య సామ్రాజ్య స్థాపనకు దారి తీసింది.

చంద్రగుప్తుడు ఒక తక్కువ కులానికి చెందినవాడని, నందుడి సైన్యంలో ఒక చిన్న హోదా కల నాయకుడిగా పని చేశాడని, తన విధి నిర్వహణలో నందుడికి ఆగ్రహం తెప్పించినందువల్ల అతడి ప్రాణాలకే ముప్పు వాటిల్లిందని, తన ప్రాణాలను కాపాడుకునే క్రమంలోనే చంద్ర గుప్తుడు నందుడికి ఎదురు తిరిగాడని కొన్ని చారిత్రిక ఆధారాలు తెలియజేస్తున్నాయి. మొదట్లో ఓటములు చవి చూసినా, అంతిమంగా తగినంత బలాన్ని కూడగట్టుకుని నందుల పాలనను తుదముట్టించగలిగాడు చంద్రగుప్తుడు. ఈ ప్రయత్నంలో అతడికి తోడుగా వ్యవహరించిన వాడు చాణక్యుడు. ఇతడినే కౌటిల్యుడనే పేరుతో కూడా వ్యవహరిస్తారు. అత్యంత క్రూరంగా వ్యవహరించడంలో, విద్రోహాలకు పాల్పడడంలో, కుట్రలను పన్నడంలో చాణక్యుడికి ఎటువంటి అవధులూ లేవు. చంద్రగుప్తుడి కోసం తన మరో శిష్యుడైన పర్వతకుడికి ద్రోహం చేయడానికి సైతం చాణక్యుడు వెనుకాడలేదు.

మౌర్య అన్న పదం గురించి అనేక గాథలు ఉన్నాయి. బుద్ధుడికి చెందిన శాక్యగణాల్లో ఒక తెగగా ఉన్న మోరియ తెగకు చెందినవాడని చంద్రగుప్తుడి గురించి బౌద్ధ గాథల్లో ఉంది. ముర అనే పేరు గల దాసి కి పుట్టిన వాడని కూడా ప్రచారంలో ఉంది. ఆ కాలానికి చెందిన ఘట్టాలను తెలియజేసిన గ్రీకు గ్రంథాలలో గాని, మెగస్తనీసు రాసిన ఇండికా గ్రంథంలో గాని, అశోకుడి శాసనాలలో గాని ఎక్కడా ఈ మౌర్య అన్న పదం లేదు. క్రీ.శ. 150 నాటి జునాగఢ్ రాజు రుద్రదమనుడి శిలా శాసనాలలో మొదటగా మౌర్య అన్న పదాన్ని చంద్రగుప్తుడి పేరుకు, అశోకుడి పేరుకు చివరన చేర్చడం చూస్తాం.

క్రీ.పూ.322లో సామ్రాజ్యాన్ని ఏర్పరచిన చంద్రగుప్తుడు క్రీ.పూ.298 వరకూ పాలించాడు. తన సామ్రాజ్యాన్ని పశ్చిమ, పశ్చిమ-వాయవ్య దిశగా విస్తరించాడు. దక్కను ప్రాంతం వైపు కూడా విస్తరించడానికి కొన్ని దాడులు చేసినట్టు ఆధారాలు ఉన్నా, వాటి ఫలితాల సమాచారం అంత స్పష్టంగా లేదు.

పశ్చిమ-వాయవ్య భారతంలో అలెగ్జాండర్ మరణానంతర కాలంలో అతని ప్రతినిధులుగా వ్యవహరించిన వారు తాము ఎవరికి విశ్వసనీయులుగా ఉండాలో నిర్ధారించుకోలేని పరిస్థితులు వచ్చాయి. క్రీ.పూ. 323లో అలెగ్జాండర్ మరణించాక అతని సామ్రాజ్యంలోని ఆసియా భాగాలను పెరిడిక్కాస్ అనే సేనాని పర్యవేక్షించాడు. అతని మరణం తర్వాత బాధ్యతలలోకి వచ్చిన యాంటిపేటర్ ఆసియా భూ భాగాలలో సింధునదీ ప్రాంతం మీద, తక్షశిల వరకూ దాని పరిసరాలమీద పోరస్‌కు (పురుషోత్తముడికి)అధికారం అప్పజెప్పాడు. పంజాబ్ ప్రాంతపు అధికారం యూడెమస్ అనే సేనానికి అప్పజెప్పాడు. ఈ యూడెమస్ తర్వాత కాలంలో పోరస్ ను కుట్ర ద్వారా చంపించాడు. క్రీ.పూ.319లో యాంటిపేటర్ మరణం తర్వాత ఆయా ప్రాంతాలలోని సేనానుల మధ్య కలహాలు మరింత పెరిగాయి. ఈ క్రమంలో అలెగ్జాండర్ వద్ద సేనానిగా పని చేసిన సెల్యూకస్ బాబిలోన్ పై పట్టు సాధించాడు. అక్కడి నుంచి క్రమంగా తూర్పు వైపు తన పట్టు పెంచుకునే ప్రయత్నాలను సాగించాడు.

ఈ విధంగా గ్రీకు సేనానుల బలం తగ్గుతూ, వారి స్థానిక ప్రతినిధుల మధ్య అంతఃకలహాలు పెరిగి ఆ సామంతరాజ్యాలన్నీ


epaper.prajasakti.com

బ...తున్న నేపథ్యం చంద్రగుప్తుడి సామ్రాజ్య విస్తరణకు బాగా కలిసివచ్చింది. నందుల అధీనంలో ఉన్న రాజ్య ప్రాంతం మీద పూర్తి పట్టు సాధించాక పశ్చిమ దిశగా సింధునదీ తీరం వరకూ చంద్ర గుప్తుడు తన రాజ్యాన్ని వేగంగా విస్తరించాడు. క్రీ.పూ. 305 నాటికి తన బలాన్ని మధ్యఆసియా ప్రాంతంలో గట్టిపరుచుకున్న సెల్యూకస్ సింధునదీ ప్రాంతపు పరిసరాలకు వచ్చాడు. అక్కడ చంద్రగుప్తుడితో సెల్యూకస్ సంధి కుదుర్చుకున్నాడు. ఆ ఒప్పందంలో భాగంగా ప్రస్తుత ఆఫ్ఘనిస్తాన్ వరకూ గల ప్రాంతం మీద చంద్రగుప్తుడికి అధికారం ఉన్నట్టు అంగీకరించాడు. ఇరు పక్షాల మధ్య ఏ విధమైన యుద్ధమూ జరిగిన దాఖలాలు లేవు. ఆ సందర్భంగా ఇరువురి కుటుంబాల మధ్య వివాహ ఒప్పందం కూడా జరిగినట్లు కొన్ని కథనాలు ఉన్నాయి. ఐతే ఎవరు ఎవరిని వివాహమాడారన్నది ఎక్కడా ప్రస్తావన లేదు.

ఆ తర్వాత కాలంలో చంద్రగుప్తుడు తన సామ్రాజ్యాన్ని సౌరాష్ట్ర, మాళ్వ ప్రాంతాలకు కూడా ( ప్రస్తుత గుజరాత్) విస్తరించాడు.

సెల్యూకస్‌తో కుదిరిన ఒప్పందంలో భాగంగా గ్రీకు చరిత్రకారుడు మెగస్తనీసు భారత ఉపఖండానికి వచ్చి ఇక్కడి పరిస్థితులను రికార్డు చేశాడు. అతడు రచించిన ఇండికా అనే గ్రంథం ఆనాటి పరిస్థితులను వివరించే ఒక ముఖ్యమైన ఆధారంగా ఉంది. అందులో రికార్డు అయిన విషయాలన్నీ వాస్తవాలు కాకపోవచ్చు కాని ఆనాటి ముఖ్యమైన సామాజిక పరిస్థితులను, ఆచారాలను, పాలనావిధానాలను తెలుసుకునేందుకు మంచి ఆధారంగా ఇండికా ఉంది.

నందుల నిరంకుశ, క్రూర పాలనను ఎదిరించి అధికారం చేపట్టిన చంద్రగుప్తుడు కూడా తన పాలనా కాలంలో అవే నిరంకుశ పద్ధతులను అమలు చేశాడు. తనపై జరిగే కుట్రల నుండి కాపాడుకోడానికి నిరంతరం అప్రమత్తతతో, అనుచరులమీద అపనమ్మకంతో బతికాడు. యుద్ధాల సందర్భంలో తప్ప ఎన్నడూ తన కోటను వదిలి బైటకు వచ్చేవాడు కాదు. 24 సంవత్సరాల పాలన అనంతరం చంద్రగుప్తుడి స్థానంలో అతని కుమారుడు బిందుసారుడు అధికారం చేపట్టాడు. చంద్రగుప్తుడు అధికారాన్ని త్యజించి జైన సన్యాసులలో కలిసిపోయాడని, కొంతకాలం తర్వాత కర్నాటక ప్రాంతంలో తనకు తానుగా స్వయంమరణానికి పాల్పడ్డాడని జైన గాథలు తెలియజేస్తున్నాయి.

**హిందూత్వవాదుల అభూత కల్పనలు**

హిందూత్వ వాదుల చరిత్ర వక్రీకరణల ఫలితంగా, కొన్ని కాల్పనిక గాథలతో కూడిన సారస్వతం ప్రచారంలో ఉన్న కారణంగా మౌర్య సామ్రాజ్య స్థాపనకు సంబంధించి కొన్ని అభూత కల్పనలే చరిత్రగా చెలామణీ అవుతున్నాయి. క్రీ.శ.5వ శతాబ్దానికి గాని, ఆ తర్వాత కాలానికి గాని చెందిన విశాఖదత్తుడు 'ముద్రారాక్షసం' నాటకాన్ని మౌర్య సామ్రాజ్య స్థాపన ఇతివృత్తంగా రచించాడు. అందులో అత్యధిక భాగం కల్పనలతోనే నిండివుంది. అందులోని పాత్రలు చారిత్రిక వ్యక్తులు కావచ్చు కాని ఆ నాటకం వాస్తవ చరిత్రను చిత్రించినది కాదని చరిత్రకారులు భావిస్తున్నారు.




అదే విధంగా హిందూత్వవాదులు హైందవ ధర్మ పరిరక్షణ కోసం చాణక్యుడు చంద్రగుప్తుడిని ప్రోత్సహించి రాజ్యస్థాపనకు ప్రేరేపించినట్టు చిత్రీకరిస్తారు. పశ్చిమం నుండి యవనుల (గ్రీకులు) దాడుల నుండి ఈ ఉపఖండాన్ని రక్షించడానికే ఇంత సామ్రాజ్యం నిర్మించినట్టు చిత్రిస్తారు. కాని అలెగ్జాండర్ క్రీ.పూ. 325 నాటికే పశ్చిమ భారతం నుండే వెనక్కి మళ్ళాడు. ఆ తర్వాత గ్రీకుల ఆధిపత్యం తగ్గిపోతూ వచ్చిందే తప్ప. ఈ ఉపఖండం లోకి విస్తరించే ప్రయత్నాలు జరగనేలేదు. కనుక క్రీ.పూ.322 లో నందుల రాజ్యాన్ని కూలదోసిన చంద్రగుప్తుడు హైందవ ధర్మం కోసం కంకణం కట్టుకున్నట్టు చెప్పడం పూర్తి వక్రీకరణే. చాణక్యుడు పన్నిన దుర్మార్గమైన కుట్రలన్నీ ధర్మ రక్షణ పేరుతో సమర్థించడం కూడా అటువంటిదే.

ఇక సంఘపరివారం ఆరాధించే ప్రాచీన గ్రంథాలలో కౌటిల్యుడిచే రచించబడిన అర్థశాస్త్రం ఒకటి. ఈ గ్రంథంలో రాజులు తమ అధికారాన్ని ఏ విధంగా పదిలంగా నిలుపుకోవాలో, తమ సంపదలను ఏ విధంగా పెంచుకోవాలో, తమ ప్రత్యర్థులను ఏ విధంగా దెబ్బతీయవచ్చో, తమను ధిక్కరించేవారని ఏ విధంగా శిక్షించాలో వివరించారు. ఇది పాలకులకోసమే, వారి ఆధిపత్యం కోసమే రాయబడింది తప్ప ప్రజల ప్రయోజనాలతో దానికి నిమిత్తం లేదు.

ఈ గ్రంథంలో కౌటిల్యుడు 'ఇలా చెప్పాడు, అలా నిర్దేశించాడు' అని చెప్పారే తప్ప దీనిని కౌటిల్యుడే రాసినట్టు ఎక్కడా దాఖలా లేదు. విష్ణుగుప్తుడు అనేవాడు దీనిని రచించినట్టు ఉంది. ఎక్కడా చాణక్యుడు అన్న పేరు ప్రస్తావనకు రాలేదు. ఐతే మొత్తం గ్రంథాన్ని చూస్తే ఇందులో కౌటిల్యుడి అభిప్రాయాలే సాధికారికమైనవిగా అన్ని సందర్భాలలోనూ పరిగణించబడ్డాయి. కనుక ఇది కౌటిల్యుడి రచన అనే భావించాలి. ఈ పుస్తకంలోని వివిధ అధ్యాయాలను పరిశీలిస్తే అవి క్రీ.పూ. 4వ శతాబ్ద కాలం నుండి క్రీ.శ. 2వ శతాబ్ద కాలం మధ్యలో వివిధ సందర్భాలలో రాయబడ్డాయని నిర్ధారించవచ్చు. ఇందులో చంద్రగుప్తుడి కాలం నాటికి ఉనికిలో లేని అంశాలు కూడా ఉన్నాయి. ఉదాహరణకు శిలా శాసనాలను మొట్టమొదట రూపొందించింది అశోకుడి కాలంలో. (క్రీ.పూ. 260) అప్పటికే చంద్రగుప్తుడు కాని కౌటిల్యుడు కాని గతించారు. కాని కౌటిల్యుడి అర్థశాస్త్రంలో శిలాశాసనాల ప్రస్తావనలు ఉన్నాయి. చంద్రగుప్తుడి కాలంలో అమలులో లేని పాలనా పద్ధతుల ప్రస్తావనలూ ఉన్నాయి. క్రీ.పూ. 220 నాటికి కాని మన దేశానికి చైనా ప్రాంతంతో సంబంధాలు ఏర్పడలేదు, కాని కౌటిల్యుడి అర్థశాస్త్రంలో చీని చీనాంబరాల (చైనా నుండి వచ్చిన పట్టువస్త్రాలు) ప్రస్తావనలున్నాయి. కాబట్టి ఈ గ్రంథం కొన్ని శతాబ్దాల కాలంలో వివిధ వ్యక్తులచేత రాయబడిందని, ఆ యా కాలాల్లో పాలించిన వివిధ పాలకుల వర్గ ప్రయోజనాలను నెరవేర్చడానికే ఉపయోగించబడిందని, పలువురి ప్రమేయం వివిధ కాలాల్లో ఈ గ్రంథంలోని వివిధ భాగాల రచనలో ఉన్నదని నిర్ధారించవచ్చు. ప్రధానంగా ఇది పాలకవర్గాల ఆధిపత్యాన్ని సుస్థిరం చేయడం కోసమే ఉద్దేశించినది తప్ప ఏదో ఒక మతం రక్షణ కోసమో, హైందవ ధర్మ ఉద్ధరణ కోసమో రూపొందినది కానే కాదు. అటువంటి ఒక చర్చ కూడా ఆ కాలంలో జరిగిన దాఖలా ఆ పుస్తకంలో ఎక్కడా కానరాదు.

**బిందుసారుడు(క్రీ.పూ. 298 - 270)**

చంద్రగుప్తుడి అనంతరం రాజ్యాధికారం చేపట్టిన అతడి కుమారుడు బిందుసారుడు క్రీ.పూ. 298 నుండి 270 వరకూ పాలించాడు. 'అమిత్రఘాట' అనే బిరుదు స్వీకరించాడు. చంద్రగుప్తుడి నుండి సంక్రమించిన సామ్రాజ్యాన్ని నిలబెట్టడమే గాక దానిని దక్షిణాది దిశగా మరింత విస్తరింపజేశాడు.



epaper.prajasakti.com

ప్రధానంగా ఆంధ్రులను లొంగదీసుకున్నాడు. బలమైన రక్షణతో కూడిన కోటలు, దాదాపు ఒక లక్ష మంది సైనిక బలగం, 2000 ఆశ్విక దళాలు, 1000 గజదళాలు కలిగిన ఆంధ్ర ప్రాంతం మౌర్య సామ్రాజ్యానికి రక్షణ కల్పించడంలో ఒక ముఖ్య స్థానాన్ని కలిగివుంది. అటు వాయవ్యంలో తక్షశిల వరకూ బిందుసారుడి అధీనంలో కొనసాగింది. బిందుసారుడు రాజుగా ఉన్న కాలంలో అశోకుడిని తక్షశిల ప్రాంతంలో తలెత్తిన తిరుగుబాట్లను అణిచివేయడానికి పంపాడని, అశోకుడు అప్పుడు ఉజ్జయిని ప్రాంతానికి ప్రతినిధిగా వ్యవహరించేవాడని కొన్ని గాథల్లో పేర్కొన్నారు.

చంద్రగుప్తుడి కాలంలో గ్రీకు రాజ్యంతో నెలకొల్పిన స్నేహ సంబంధాలు బిందుసారుడి కాలంలో కొనసాగాయి. గ్రీకు దేశంతోబాటు ఈజిప్టును పాలించిన టోలెమీతో కూడా బిందుసారుడి రాజ్యానికి దౌత్య సంబంధాలు, వ్యాపార సంబంధాలు ఉండినట్టు గ్రీకు యాత్రికులు మెగస్తనీస్, అతని తర్వాత డైమాకస్ తదితరుల రచనలలో ఉంది.

**అశోకుడు (క్రీ.పూ. 270–234 )**

**తొలి దినాలు (కళింగ యుద్ధం వరకూ)**

అశోకుడు బిందుసారుడి మరణానంతరం అధికారాన్ని చేపట్టాడు. అందుకోసం తన పెద్ద సోదరుడు సుశిముడిని హత్య చేశాడని శ్రీలంక బౌద్ధ గాథలు (దీపవంశ, మహావంశ) తెలియజేస్తున్నాయి. రాజైన తర్వాత అశోకుడు దేవానాం ప్రియ, ప్రియదర్శి రాజ అనే బిరుదులను స్వీకరించాడు.

తొలి సంవత్సరాల్లో అశోకుడు అమిత క్రూరుడైన పాలకుడిగా వ్యవహరించాడు. రాజ్యవిస్తరణ కాంక్ష తో కళింగ ప్రాంతంమీదకు దండయాత్ర సాగించాడు. చంద్రగుప్తుడి కాలం నాటికే కళింగ (ప్రస్తుత ఒరిస్సా) రాజ్యం 60,000 మంది పదాతి దళాలు, 1000 మంది అశ్వికదళాలు, 700 గజదళాలను కలిగివుండేది. అశోకుడి కాలానికి అది మరింత బలపడివుండాలి. అంటే అశోకుడు ఆ దండయాత్రలో చాలా గట్టి ప్రత్యర్థి తోటే తలపడవలసి వచ్చింది.

అత్యంత రక్తసిక్తంగా సాగిన కళింగ యుద్ధం అశోకుడు రాజైన ఎనిమిదో సంవత్సరంలో జరిగింది. ఆ యుద్ధంలో చివరికి విజయం సాధించిన అశోకుడు ఒక లక్షమందిని ఊచకోత కోశాడని, లక్షా ఏభైవేల మందిని బందీలుగా పట్టుకున్నాడని, యుద్ధానంతర పరిణామాల్లో మరో లక్షమందివరకూ మరణించారని గాథలు తెలియజేస్తున్నాయి. ఈ అంకెల్లో కొంత అతిశయోక్తి ఉన్నా జరిగిన మానవ హననం ఎంత తీవ్రమైనదో అవి సూచిస్తున్నాయి.

ఈ యుద్ధంలోని రక్తపాతం చివరికి అశోకుడి దృక్పథాన్నే మార్చివేసింది. ఇకముందు రాజ్యవిస్తరణకు సైనిక దండయాత్రలు చేపట్టకూడదని అశోకుడు నిర్ణయించాడు.

అప్పటికే మౌర్య సామ్రాజ్యం సువిశాలమైనదిగా రూపొందింది. కాందహార్‌లో, లఘ్మాన్ లో ( ఇవి ఆఫ్ఘనిస్తాన్ [illegible])  లభించిన అశోకుడి శాసనాలను బట్టి మౌర్యసామ్రాజ్య సరిహద్దులు వాయవ్యప్రాంతంలో ఆఫ్ఘనిస్తాన్ వరకూ విస్తరించిందని స్పష్టం ఔతోంది. హిమాలయ పర్వతాల సానువుల వెంబడి దాదాపు కాశ్మీర్ వరకూ, సింధునదీ పరీవాహక ప్రాంతం వెంబడి దిగువన కొంకణ తీరం అంతా మౌర్య సామ్రాజ్యంలో భాగంగా ఉండేది. దక్షిణాన కళింగ ప్రాంతం కూడా అందులో అంతర్భాగమే. అశోకుడి శాసనాల ప్రకారమే, ఆంధ్ర, కర్నాటక ప్రాంతాలు కూడా మౌర్య సామ్రాజ్యంలో భాగంగా ఉండేవి. చోళ, పాండ్య, సాత్యపుత, కేరళపుత ( తమిళనాడు, కేరళ) రాజ్యాలు, ఆ దిగువన తామ్రపర్ణి (శ్రీలంక) తన సామ్రాజ్యానికి సరిహద్దు రాజ్యాలుగా ఉన్నట్టు అశోకుడి శాసనాలు తెలియజేస్తున్నాయి.

(చూ. మౌర్య సామ్రాజ్యం క్రీ.పూ. 260 నాటికి– మ్యాప్ 1.2)

ఇంతటి సువిశాల సామ్రాజ్యం ఆ తర్వాత మరి ఎప్పుడూ ఉనికిలో లేదు. మళ్ళీ స్వతంత్రం సాధించుకున్నాక మాత్రమే అంత పెద్ద దేశం ఉనికిలోకి వచ్చింది.

నేటికి దాదాపు 2275 సంవత్సరాల క్రితం ఏర్పడిన ఆ రాజ్యాన్ని ఆ కాలంలో ఏ విధంగా నిర్వహించారన్నది చాలా చారిత్రిక ప్రాధాన్యత కల అంశం.

**(తరువాయి వచ్చే సంచిక లో...)**

# గొప్ప మార్క్సిస్టు మేధావి, విప్లవకారుడు: ఐజాజ్

**(14వ పేజీ తరువాయి)**

సంక్షోభాలు వస్తూ ఉంటాయి. పెట్టుబడిదారీ విధానం మళ్ళీ తన ప్రయాణాన్ని కొనసాగిస్తుంది.

ప్రస్తుత సంక్షోభం 2008లో ప్రారంభమై ఇప్పటికీ కొనసాగుతున్నది. మధ్యలో కరోనా రావటంతో అది మరింత తీవ్రమైంది. ఇప్పుడు ఉక్రెయిన్ యుద్ధంతో అది ఇంకా పెరిగే పరిస్థితి ఉంది. కాబట్టి ఈ సంక్షోభం నుండి పెట్టుబడిదారీ విధానం ఇప్పుడిప్పుడే కోలుకుంటుందని చెప్పలేం. ఇటువంటి పరిస్థితులలో కమ్యూనిస్టులు, వామపక్షాలు ఉన్నచోటా, లేనిచోట్లా ప్రజలు ఉద్యమాలు, పోరాటాలలోకి వస్తున్నారు. ఎవరూ లేనిచోట్ల అభివృద్ధి నిరోధకశక్తులు, సిద్ధాంతాల మాటున వర్గ పోరాటాలతో, రకరకాల రూపాలలో ప్రజలు తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. కాబట్టి కమ్యూనిస్టులు నిర్వహిస్తేనే వర్గ పోరాటం అని అనుకోనవసరం లేదు. పోరాటాలు రకరకాల రూపాలలో జరుగుతుంటాయి. పైకి కనబడే రూపంలోనే అర్థం చేసుకుంటే అవి వర్గ పోరాటాలుగా ఉండవు. ఆ పోరాటాలను లోతుగా పరిశీలిస్తే వాటి పునాది, వర్గ సంఘర్షణ అర్థం అవుతుంది. దానిని అర్థం చేసుకొని, అటువంటి విప్లవ నిర్మాణాన్ని అభివృద్ధి చేసుకోవటంపై కేంద్రీకరించాలని ఆయన ప్రతి ఇంటర్వ్యూలోనూ స్పష్టంగా చెప్పాడు. వర్గం, వర్గ పోరాటం గురించి కూడా చాలా విషయాలు చెప్పాడు. విప్లవోద్యమాలకు తోడ్పాటునందించటం ద్వారా ఆయన తన జీవితాన్ని సార్థకం చేసుకున్నాడు. ఆయన రచనలు, వీడియోలు అద్భుతమైన విజ్ఞానగనులు. మార్క్సిజంపై గొప్పపట్టు కలిగి, సమకాలిన పరిస్థితులకు వర్తింపజేస్తూ రాసినవి మనకు గొప్ప సంపద. ఈ సంపదను వినియోగించుకోవటం ద్వారా మనం ప్రయోజనం పొందాలి. ఆయన ఇంటర్వ్యూలను వినటం, ఆయన పుస్తకాలను చదివటం చేస్తే ఆయన కృషి సార్థకమౌతుంది. మనం నేర్చుకోవటానికి, జీవితాంతం మార్క్సిజానికి కట్టుబడి ఉండటానికి ఉపయోగపడతాయి. ఇపుడు వామపక్ష ఉద్యమం గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్న సందర్భంలో మార్క్సిజంపై నమ్మకం కలగటంతో పాటు ఈ క్లిష్ట పరిస్థితులను అధిగమించటానికి కావలసిన శక్తిని ఇస్తాయి. అవకాశ ఉన్నవారందరూ ఈ సందర్భంలోనైనా ఆయన రచనలను చదివి, వీడియోలను చూసి అర్థం చేసుకుని, మన జీవితాలను సార్థకం చేసుకోవటానికి ప్రయత్నం చేయాలని కోరుతున్నాను.

❊



epaper.prajasakti.com



# సమకాలీన సామ్రాజ్యవాద సంస్కృతులు

అమరజీవి కామ్రేడ్ సుందరయ్య స్మారక ప్రసంగం కోసం నన్ను ఆహ్వానించడం ద్వారా సుందరయ్య విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు నాకిచ్చిన గౌరవానికి కృతజ్ఞతలు చెప్పేందుకు నాకు మాటలే లేవు. ఆయన భారత కమ్యూనిస్టు ఉద్యమ స్థాపకులలో ఒకరు. సాహసికుడు, దార్శనికుడు. ఇటీవలనే నేను, ఆయన రాసిన పత్రాలలో అందుబాటులో వున్నవాటిని చదివాను. ఆ సమయంలో ఆయన దూరదృష్టితో చేసిన విమర్శనాత్మక అంచనాలు నేటికి ఎంత విలువైనవా అని ఆశ్చర్య పోయాను. మన దేశ రాజకీయ, మేధారంగా లలో అత్యంత సమర్థులైన వ్యక్తులు ఇంతకు ముందు ఈ వేదికపై చేసిన స్మారక ప్రసంగాలు కూడా నేను చూశాను. ఈ సందర్భానికి న్యాయం చేయగల శక్తి నాకు వుందా, లేదా అన్నది చెప్పలేను. అయినా వున్నంతలో న్యాయం చేయడానికి శాయశక్తులా ప్రయత్నిస్తాను. నేను ఏదైనా లోపం చేస్తే మీరు దయతో సహించగలరని ఆశిస్తున్నాను.

'ప్రపంచీకరణ- సంస్కృతి' అన్న విషయమై మాట్లాడవలసిందిగా నన్ను కోరారు. అయితే నేను...నిర్దిష్టంగా చెప్పాలంటే 'సమకాలీన సామ్రాజ్యవాద సంస్కృతులు' అన్న ఇతి వృత్తం ఎంచుకున్నాను. మీకు తెలుసు ఇక్కడ నేను సంస్కృతి అన్న మాటను బహుళవచనగా ఎంచుకున్నానే గాని ఏక వచనంగా కాదు. నా ఉద్దేశంలో వర్గాలు, లింగభేదాలు, అలాగే ఇప్పుడు ఉపజాతిగా ప్రస్తావించబడుతున్న జాతి భేదాలు గల సమాజంలో, మన దేశం వలె బహుభాషలూ, బహు సంస్కృతులూ గల సమాజంలో సంస్కృతి అనేది ఏకరూపంగా వుండటం ఎప్పటికీ జరగదు. ఎప్పుడూ అనేక సంస్కృతులు వుంటాయి. వాటిలో కొన్నిటి మధ్య ఒద్దిక వుంటుంది. కొన్నిటి మధ్య వుండదు. అగ్రవర్ణాలు, నిమ్న వర్ణాలు కూడా ఒకే విధంగా పంచుకోగల సాంస్కృతిక రంగాన్ని కనుగొనడం కష్టం. లేదా బూర్జువా వర్గం తను అనుభవించే లాటి సాంస్కృతిక సరుకులను, ఉదాహరణకు వారు చదువుకునే ఉన్నత విద్యా సంస్థల సాంస్కృతిక జీవితాన్ని కార్మిక వర్గానికి అనుమతించడం ఊహకందని విషయం. అలాంటి వాటిని ఆ వర్గం తనకొరకే అట్టిపెట్టుకుంటుంది.

అయితే సంస్కృతి అనే మాట సామాజిక జీవితంలో అనేక అర్థాలతో వాడటం జరుగుతుంటుంది. మనం కళా సాహిత్యాలను సంస్కృతి అంటాము. అలాగే జనరంజక కళ గురించి కూడా మాట్లాడతాము. వర్గాల సరిహద్దులకు అతీతంగా జన బాహుళ్యపు జీవితాల్లో మాస్ మీడియా తెచ్చిన సాంస్కృతిక మార్పులనే మనం ఈ పేరుతో పిలుస్తుంటాము. అలాగే మనం హిందూ సంస్కృతి, ముస్లిం సంస్కృతి అంటుంటాము. మన సామాజిక, సాంస్కృతిక జీవితంలో ఏ అంశమూ సామ్రాజ్యవాద ప్రభావం నుంచి తప్పించుకోలేకపోయింది. అయితే సాంస్కృతిక రంగంలో సామ్రాజ్యవాద ప్రభావం విద్యా రంగం వంటి వాటిలో కన్నా, మత విషయాలలో కన్నా మాస్ మీడియాలో ఎక్కువగా వుంటుంది. మనం ఈ రంగాలన్నిటినీ వాటికవేగానూ, పరస్పర సంబంధంలోనూ పరిశీలించవలసి వుంటుంది. ఈ ప్రసంగంలో నేను ప్రధానంగా సామ్రాజ్యవాదపు తాజా ఘట్టంలో సంస్కృతులు ఎలాంటి రూపం తీసుకున్నాయనేదాన్ని చర్చిస్తాను. ఇంతకూ ఈ తాజా ఘట్టం అంటే ఏది? నేను సమకాలీన సామ్రాజ్యవాదం అని దేన్ని అంటున్నానో ముందు క్లుప్తంగా వివరిస్తాను.

భారత ప్రజానీకానికి సంబంధించినంత వరకూ, ఆసియా-ఆఫ్రికా దేశాల ప్రజలకు సంబంధించినంతవరకూ 1945లో రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిపోవడంతో కొత్తతరహా సామ్రాజ్యవాదం ఉనికిలోకి వచ్చింది. ఇది మార్క్సిస్టు ప్రామాణిక గ్రంథాలలో సైద్ధాంతీకరించబడిన సామ్రాజ్యవాదానికి చాలా భిన్నమైన స్వభావం కలిగింది. అప్పటివరకూ ఆసియా, ఆఫ్రికాలలోని దేశాలు అనేక ఐరోపా రాజ్యాల వలసలుగా వుండేవి. రెండవ ప్రపంచ యుద్ధానంతరం వాటి వలస సామ్రాజ్యాలు కూలిపోయాయి. వలసలు లేని ఒక కొత్త తరహా సామ్రాజ్యవాద యుగం ఇప్పుడు ప్రారంభమైంది. ఇక రెండో విషయం 1880-1945 మధ్య అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలు సామ్రాజ్యవాద అంతర్గత వైరుధ్యాలతో చిందరవందర అయ్యాయి. ఇది అనివార్యంగా ప్రత్యర్థుల మధ్య యుద్ధానికి దారితీసింది. దీనినే లెనిన్ తన కాలపు సామ్రాజ్యవాదపు మౌలిక లక్షణం అంతర్గత సామ్రాజ్యవాద శత్రుత్వం అని సరిగ్గానే వర్ణించాడు. అయితే రెండవ ప్రపంచ యుద్ధం అదివరకటి సంవత్సరాల శత్రుత్వాలన్నింటినీ బలహీనపరిచింది. అమెరికా, మిగిలిన ప్రధాన పెట్టుబడిదారీ దేశాలన్నింటినీ మించిపోయి అంచనాకు అందనంత శక్తిగా తయారైంది. అందువల్లనే అది మిగిలిన వాటన్నింటినీ తన నాయకత్వాన ఒక కూటమిగా ఏర్పరచగలిగింది. అదివరకున్న వలసలు, వలస సామ్రాజ్యాల నుంచి తన కోసం ఒక వలసేతర ప్రపంచ సామ్రాజ్యాన్ని నిర్మించుకోవడం ప్రారంభించింది. ఇది కొత్త విషయం. గతంలో ప్రపంచం... పోటీ పడుతున్న సామ్రాజ్యాల మధ్య విభజితమై వుండేది. ఇప్పుడు ఏకైక ప్రపంచ సామ్రాజ్యం రూపొందుతున్నది.

ఏమైనా ఇది నిజంగా ప్రపంచ సామ్రాజ్యం కాజాలదు. రెండవ ప్రపంచ యుద్ధం ఫలితంగా ఐరోపా ఆగ్నేయ భాగంలోనే అనేక కమ్యూనిస్టు దేశాలు ఉద్భవించాయి. వాటిననుసరించి చైనా విప్లవం, కొరియా యుద్ధం, క్యూబా విప్లవం సంభవించాయి. ఖండఖండాంతరాలలో విప్లవోద్యమాలు పెల్లుబికాయి. మొజాంబిక్, దక్షిణ ఎమెన్ వంటి సుదూర దేశాలలో సోషలిస్టు నమూనాలు ఏర్పడ్డాయి. ఇక వియత్నాంలోనూ తక్కిన ఇండో చైనా ప్రాంతంలోనూ అమెరికా ఓటమి గురించి చెప్పనవసరం లేదు. సామ్రాజ్యవాదుల అంతర్గత వైరుధ్యాలు అదృశ్యమై అత్యధిక పెట్టుబడిదారీ ప్రపంచంలో ఏకీకృత సామ్రాజ్యం రూపుదాల్చడం మొదలైంది. అదే సమయంలో భూగోళమే పెట్టుబడిదారీ,



epaper.prajasakti.com

కమ్యూనిస్టు వ్యవస్థల మధ్య విభజితమై ఖండఖండాంతరాల్లో మరింత వ్యవస్థీకృతమైన సంఘర్షణకు వేదిక అయింది. ఆ కాలానికి సంబంధించిన వివరాలన్నింటిలోకీ వెళ్ళేందుకు ఇది సందర్భం కాదు. పశ్చిమ యూరప్‌లో కమ్యూనిస్టు ప్రభుత్వాలు ఏర్పడే అవకాశాలు 1970ల మధ్య కాలం తరువాత అదృశ్యమైన పరిస్థితిని ఇప్పుడు గుర్తు చేసుకోవడం కూడా కష్టమే. ఆ సమయంలోనే పోర్చుగీసు విప్లవాన్ని వెనక్కు నెట్టడం, ఇటలీ కమ్యూనిస్టు పార్టీ ఎన్నికలలో విసిరిన సవాలును ఎదుర్కోవడం జరిగింది. లాటిన్ అమెరికాలోని ప్రధానమైన దేశాలన్నింటా 1950ల ఆఖరులోనూ, 1970లలోనూ వామపక్ష ప్రభుత్వాలను కూలదోసేందుకు సామ్రాజ్యవాదం క్రూరమైన సైనిక నియంతృత్వాలను రుద్దింది. ఆ ఖండంలో విప్లవోద్యమాలు విస్తరించకుండా అడ్డుకున్నది. ఇండోనేషియాలో 1960ల మధ్య కాలం వరకూ ప్రపంచంలోని మూడవ పెద్ద కమ్యూనిస్టు పార్టీ ఉండేది. అక్కడ కమ్యూనిస్టు విప్లవాన్ని అడ్డుకు నేందుకై 5 లక్షల మందిని ఊచకోత కోశారు. అందువల్ల అప్పట్లో ఘర్షణ జరిగింది...కేవలం అమెరికా సోవియట్ యూనియన్‌ల మధ్యనే కాదు ప్రపంచంలోని అనేక మూలల్లో జరిగింది. సామ్రాజ్యవాదం ప్రపంచంలోనే అత్యధిక ప్రాంతాల్లో విప్లవోద్యమాలను ఓడించడం లోనూ, కొత్తగా అవతరిస్తున్న సోషలిస్టు రాజ్యాలను కూలదోయడంలోనూ ఫలప్రదమైన తరువాతే సోవియట్ కమ్యూనిజం కూలిపోయింది.

ఇతర చోట్ల కూడా ముఖ్యంగా ఈజిప్ట్, ఇండియా వంటి దేశాల్లో ఇంకా మిగిలివున్న సామ్రాజ్యవాద వ్యతిరేక చైతన్యం తన ప్రభావం చూపింది. వలసవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్న కాలంలో పెరిగిన ఈ చైతన్యం దిగువ నుంచి వస్తున్న ప్రజా ఒత్తిడితోనూ, సోషలిస్టు కూటమి ఉనికి వల్ల కలిగిన అవకాశాలతోనూ సమ్మిళితమై ఉంది. ఈ అంశాలన్నీ కలగలసి అలీనోద్యమ మూలసూత్రాలకు ప్రాణం పోశాయి. అది, సాపేక్షంగా స్వతంత్రమైన పెట్టుబడిదారీ అభివృద్ధి అన్న భావనకు నవ స్వతంత్ర దేశాలలో అంకురార్పణ చేసింది. ఇందుకు సంస్కరణవాద బూర్జువా వర్గం నాయకత్వం వహించింది. ప్రభుత్వ రంగానికి పెద్ద పాత్ర కల్పించే మిశ్రమ ఆర్థిక వ్యవస్థలు ఇందుకు అవసరమైన బలం ఇచ్చాయి. సోషలిస్టు కూటమిని సామ్రాజ్యవాద కూటమికి వ్యతిరేకంగా ఉపయోగించుకున్నాయి. నెహ్రూ హయాంలో ఇండియా కూడా ఈ ఉద్యమంలో ప్రముఖ పాత్ర నిర్వహించింది.

ఆ విధంగా ఈ దశ సుమారుగా 1945 నుంచి 1975 వరకు అంటే రెండవ ప్రపంచ యుద్ధం నుంచి వియత్నాం యుద్ధం ముగింపు వరకు కొనసాగింది. ఈ కాలంలో సామ్రాజ్యవాదం రాజకీయంగా ఆత్మరక్షణ స్థితిలో పడిపోయింది. కానీ ఆర్థిక రంగంలో మాత్రం సామ్రాజ్యవాదం యొక్క మౌలిక పునాది ఎప్పుడూ తన బృహత్ శక్తిని కోల్పోయింది లేదు. ఏ దశలో కూడా సోవియట్, చైనాలతో సహా అన్ని సోషలిస్టు దేశాల జిడిపిని తీసుకున్నా అది నాటో దేశాల జిడిపిలో నాల్గవ వంతు కూడా చేరుకోలేకపోయింది. ఇదే కాకుండా బ్రహ్మాండమైన ఆర్థిక, శాస్త్ర, సాంకేతిక, సైనిక... ఆఖరుకు విద్యాపరమైన ఆధిక్యతను కూడా ప్రవర్ధిత పెట్టుబడిదారీ విధానం సాధించగలిగింది. శతాబ్దాల తరబడి సాగించిన వలస దోపిడీ, వలస సంపద పోగు పడడం ఇందుకు కారణమయ్యాయి. అన్ని అధికార రంగాలలోనూ బలా బలాలలో సామ్రాజ్యవాదులకు ఏర్పడిన ఈ ఆధిక్యత దీర్ఘకాలంలో తృతీయ ప్రపంచ బూర్జువా వర్గాన్నీ, దానిలోని సంస్కరణవాద విభాగంతో సహా సామ్రాజ్యవాదంవైపుకు తిరుగులేకుండా ఆకర్షించింది. ఇదే బలాబలాల పొందిక సాంకేతిక, సైనిక రంగాలతో సహా అన్ని రంగాలలోను సోషలిస్టు దేశాలపై కూడా రుద్దబడింది. ఈ పోరాటం జయించలేనిదిగా తయారైంది. దాంతో పాలక కమ్యూనిస్టు పార్టీలలో అంతకంతకూ ఎక్కువమంది సభ్యులు తమ ఆర్థిక వ్యవస్థలలో మార్కెట్ తరహా సంస్కరణల కోసం పాకులాడ్డం మొదలు పెట్టారు. సారాంశంలో ఇది పెట్టుబడిదారీ పరివర్తనే. వెనక్కు తిరిగి చూస్తే బహుశా 1978లో చైనాలో డెంగ్ ప్రవేశపెట్టిన సంస్కరణలు ఈ క్రమానికి ప్రారంభమను కోవాలి. ఉత్తరోత్తరా అవే సోవియట్ యూనియన్ తూర్పు యూరప్‌లలో కమ్యూనిజం కూలిపోవడానికి దారితీశాయి. ప్రపంచ పెట్టుబడిదారీ విధానంలో చైనా కూడా ఇమిడిపోగలిగింది. ఈ పద్ధతిలోనే చైనా ఆర్థిక నిల్వలు అమెరికా ఆర్థిక వ్యవస్థలోకి ప్రవహించి దాని డాలర్ ఇంకా సుస్థిరంగా ఉండటానికి దోహదపడే ఒక ప్రధానాంశమయ్యాయి.

సాపేక్షంగా ఒక స్వతంత్రతో పెట్టుబడిదారీ విధానాన్ని నిర్మించాలనే జాతీయ బూర్జువా పథకం కూడా 1970ల ఆఖరు కాలానికి ముగిసిపోయింది. అనేక విభిన్న కారణాలు ఇందుకు దోహదం చేశాయి. ఇతర దేశాలలో ఇదెలా జరిగిందో నేను వివరంగా చెప్పలేను. భారత్‌లో మాత్రం ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ ప్రకటించడం నెహ్రూ నిర్మించిన భారతదేశానికి చావుదెబ్బ అని చెప్పగలను. రాజకీయ వ్యవస్థలో చోటు చేసుకున్న ఆర్థిక సంక్షోభానికి అది శక్తివంతమైన సంకేతం. మతోన్మాద శక్తుల బలం తదుపరి కాలంలో దేశంలోని అన్ని బూర్జువా పార్టీలలోనూ పెరగడమూ, ఆర్థిక వ్యవస్థపై నయా ఉదారవాద విధానాల ప్రభావం పడడమూ ఈ శిథిలాల నుంచే పుట్టుకొచ్చాయి. ఈ కాలంలో చాలా శక్తివంతమైన ఒక జాతీయ బూర్జువా వర్గం రాజ్యం యొక్క సంరక్షణలో, ప్రభుత్వ రంగ సహకారంతో పెంపొందింది. ఈ బూర్జువా వర్గం క్రమక్రమంగా సంపదలు పోగు పోసుకొని తానే నిర్మించిన రాజ్యాన్ని విచ్ఛిన్నం చేసింది. తద్వారా సామ్రాజ్యవాదానికి చాలా చాలా జూనియర్ భాగస్వామి అయింది.

ఇటీవలి సామ్రాజ్యవాద దశ అరవిచ్చుకున్న నేపథ్యం ఇది. సోవియట్ యూనియన్, దాని మిత్ర రాజ్యాల పతనం ఇందులో ప్రధాన ఘటన. 500 సంవత్సరాల చరిత్రలో మొట్టమొదటిసారిగా పెట్టుబడిదారీ విధానం, ప్రబలమైన ఉత్పత్తి విధానంగానే గాక సార్వత్రిక ఉత్పత్తి విధానంగా తయారై కూర్చుంది. ప్రపంచీకరణ గురించిన ఎలాంటి చర్చకైనా ఇది ప్రారంభ వాచకం కావాలని నా నమ్మిక. పెట్టుబడిదారీ తరహా ఉత్పత్తి విధాన ప్రపంచీకరణ వల్లనే ద్రవ్య పెట్టుబడి ప్రపంచం అన్ని మూలలకూ నిరాఘాటంగా సంచరించగలుగుతున్నది. వరుసగా ఒక్కో దేశంలో నయా ఉదారవాదం విజయవంత మవుతున్నది. సమాచార, వినోద, సాంకేతిక పరిజ్ఞానం ప్రపంచవ్యాపితంగా చొచ్చుకురాగ లుగుతున్నది. అమెరికా ప్రపంచ సైనికవాదం, డబ్ల్యుటిఓ పెరుగుదల కూడా విలక్షణమైన, సరళమైన పెట్టుబడిదారీ తరహా ప్రపంచ ప్రభుత్వాన్ని తలపిస్తున్నాయి.

సామ్రాజ్యవాదం పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత రూపమన్న లెనిన్ నిర్వచనం ఎప్పటికన్నా ఇప్పుడు ఎక్కువగా వర్తిస్తుంది. మన కాలంలోని పెట్టుబడిదారీ విధానంలో సంస్కృతుల గురించి అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నామంటే ఏకకాలంలో రెండు అంశాలను తెలుసుకోవడానికి ప్రయత్నిస్తున్నామన్న మాట. సామ్రాజ్యవాద కేంద్రాలు, ముఖ్యంగా అమెరికా... ప్రపంచ సంస్కృతులను రూపొందించడంలో ప్రత్యక్షంగా జోక్యం చేసుకుంటున్నది అన్న విషయం మొదటిది. అలాగే మొత్తంగా సమకాలీన పెట్టుబడిదారీ యుగంలో అన్ని రంగాలలోనూ సంస్కృతి ఎలా చొరబడుతున్నదనేది రెండవది.

ఇప్పుడు నేను సంస్కృతి గురించిన చర్చను ప్రారంభిస్తాను. అసలు ఈ మాటకు ఉన్న కొన్ని


epaper.prajasakti.com

నిర్వచనాల పరిశీలనతో ఈ చర్చ ప్రారంభించాలి. ఆ తర్వాత పెట్టుబడిదారీ విధానమూ, సామ్రాజ్యవాదమూ సంస్కృతికి సంబంధించిన రంగాలను ఎలా మార్చివేస్తాయన్నది చూడాలి. పెట్టుబడిదారీ విధానంలో సంస్కృతులు బలవమైన రూపాలు తీసుకుంటాయని నేను గట్టిగా చెప్పదలిచాను. అయితే అన్ని సాంస్కృతిక కార్యకలాపాలనూ పెట్టుబడిదారీ విధానమే నిర్ణయిస్తుందని నేను అనుకోను. అలాగే సాంస్కృతిక రంగంలో పెట్టుబడిదారీ ఒత్తిళ్ళకు ప్రతిఘటన అదృశ్యమైపోతుందని కూడా భావించను. నా అభిప్రాయం అందుకు భిన్నంగా ఉంది. మన అస్తిత్వాన్నే ప్రభావితం చేసేందుకు పెట్టుబడిదారీ విధానం చేసే ప్రయత్నాలను ప్రతిఘటించడంలో సంస్కృతి ఒక కీలక రంగంగా కూడా వుంటుందని నమ్ముతాను. పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద రాజకీయాల ఆధునిక రూపాలు సంస్కృతిని ఒక ముఖ్యమైన ఆయుధంగా వినియోగించుకుంటాయి. ఆ క్రమంలో దానికి సంబంధించిన ప్రతి రంగాన్నీ పూర్తిగా రాజకీయమయం చేస్తాయి. సంస్కృతికి సంబంధించిన సమస్యలను సృజించకుండా ఎలాంటి గట్టి రాజకీయ ప్రతిఘటనా సాధ్యం కాదు. అయితే ఇప్పుడు ఈ ప్రసంగం ఇతివృత్తం వేరుగా వున్నందున నేను ఆ వివరాలలోకి పోవడం లేదు. సామ్రాజ్యం, పెట్టుబడి అన్న అంశాలను నేను తీసుకున్నాను. వాటిపైనే ఎక్కువగా మాట్లాడతాను.

ఇప్పుడు మనం సంస్కృతి గురించి మాట్లాడటం ప్రారంభిస్తున్నాం. ఇంగ్లీషు భాషలోని అతి కష్టమైన పదాలలో సంస్కృతి (కల్చర్) అన్నది ఒకటి. వాస్తవంగా ఈ పదం నామవాచకం కాదు. క్రియా పదం. కల్టివేషన్ (సేద్యం) అన్న క్రియ నుంచి ఇది ఉత్పన్నమైంది. భూమిని చదును చేసి దున్నటం, నాట్లు వేయడం, నీరు పెట్టడం, పైరు కోయడం వగైరాలన్నీ ఇందులో భాగాలే. ఈ అర్థంలో సంస్కృతి అన్నది ఒక సమిష్టి పాదార్థిక కార్యాచరణగా భావించవచ్చు. ఇందులో ప్రతివారూ తమ వంతు శ్రమ చేస్తారు. మేధో శ్రమ కూడా అందులో భాగమే. కానీ దీన్ని ఒక వర్గ రహిత సమాజంలో మాత్రమే ఊహించగలం. కనీసం విశ్రాంతి వర్గాలూ, శ్రామిక వర్గాలుగా విభజించబడని సమాజమైన కావాలి. సంస్కృతిని గురించిన ఈ సమభావన ఎంతో కాలం కొనసాగలేదు. సంస్కృతి అన్న పదమే క్రమంగా ఒక పాదార్థిక కార్యాచరణగా కాక బౌద్ధికమైన, సౌందర్యాత్మకమైన, తాత్వికమైన నగిషీలకు లోనైంది. ఫలితంగా సంస్కృతి అన్నది ఒక సాధారణ మానవ

"ఇంగ్లీషు భాషలోని అతి కష్టమైన పదాలలో సంస్కృతి (కల్చర్) అన్నది ఒకటి. వాస్తవంగా ఈ పదం నామవాచకం కాదు. క్రియా పదం. కల్టివేషన్ (సేద్యం) అన్న క్రియ నుంచి ఇది ఉత్పన్నమైంది. భూమిని చదును చేసి దున్నటం, నాట్లు వేయడం, నీరు పెట్టడం, పైరు కోయడం వగైరాలన్నీ ఇందులో భాగాలే. ఈ అర్థంలో సంస్కృతి అన్నది ఒక సమిష్టి పాదార్థిక కార్యాచరణగా భావించవచ్చు. ఇందులో ప్రతివారూ తమ వంతు శ్రమ చేస్తారు. మేధో శ్రమ కూడా అందులో భాగమే."

క్రియగా కాక ప్రత్యేక సామర్థ్యంగా పరిగణనలోకి వచ్చింది. ఉన్నత స్థాయి అభ్యాస సంస్థలు, కళలతో దాన్ని ముడివేసి చూడటం ప్రారంభమైంది. కవులు, కథా రచయితలు, చిత్రకారులు, మతాధిపతులు, బోధకులు, శాస్త్రజ్ఞులు, చలనచిత్ర ప్రయోక్తల వంటి వారికి మాత్రమే సంబంధించిన అంశంగా చూడటం రివాజుగా మారింది. సాంస్కృతిక ఉత్పత్తులు చేసేవారూ, వాటిని ఆస్వాదించే సంస్కారవంతులూ ఒకవైపు – సంస్కృతి రూపకల్పనలో గాని, అలాగే దాని ఆస్వాదనలో గాని ఏ పాత్ర లేని అత్యధిక ప్రజానీకం మరోవైపుగా ఈ వర్గ సమాజం విభజించి వేసింది. ఈ రెండవ తరహాకు చెందినవారు గొప్ప నవలలు చదవడం, తత్వవేత్తల భావాలు గ్రహించడం చేతకానట్లు భావించబడింది. ఈ విభజనలతో పాటే సంస్కృతిలో కూడా పలు దొంతరలు సృష్టించబడ్డాయి. ప్రభువర్గ సంస్కృతి, జనసామాన్య సంస్కృతి అని రెండు విభజనలు వచ్చాయి. లలిత కళలు, జానపద కళలు, శాస్త్రీయ సంగీతం, జనాకర్షక సంగీతం వగైరాలుగా విడిపోయింది.

ఈ విధమైనటువంటి అర్థ మార్పిడులు చిరకాలం నిలిచేవి కావు. కాని ఈ మార్పులతో పాటే సంస్కృతి అన్న పదం చాలా విస్తృతమైన అర్థంలో వినియోగంలోకి వచ్చింది. దాన్ని మొత్తం జీవన విధానం అన్నట్లుగా నిర్వచించడం మొదలైంది. ఇక్కడ ప్రాతిపదిక ఒకటే. ప్రజలు వర్గం, కులం, లింగం వగైరాల ప్రాతిపదికన విభజింపబడి వుండవచ్చు. కానీ వారు తరాల పర్యంతం అదే సమాజంలో జీవనం సాగిస్తున్నారంటే వారి ఆలోచనలూ, ఆచరణలలో మౌలికమైన సారూప్యతలు కొన్ని ఉన్నాయన్నమాట. ఆచారాలు, ఇంద్రియానుభూతులు, మంచి చెడ్డలు వగైరాలకు సంబంధించిన ఒక ప్రపంచం ఏర్పడి వుందన్న మాట. అది ఆ సమాజంలోని వారందరూ పాటిస్తూ వుంటారు. కానీ ఆ సామాజిక విభాగం వెలుపల ఉన్నవారికి దానితో నిమిత్తం ఉండదు. ఈ అర్థంలోనే మనం హిందూ సంస్కృతి, ముస్లిం సంస్కృతి, తమిళ సంస్కృతి, బెంగాలీ సంస్కృతి అంటూ వుంటాం. ఆధునిక జాతి రాజ్యాలు పెంపొందిన తర్వాత జాతీయ సంస్కృతి అన్నది కూడా ఆవిర్భవించింది. దీన్ని బ్రిటిష్ సంస్కృతి లేదా భారతీయ సంస్కృతి అంటూ వుంటారు. ఇక్కడ నేనిచ్చిన కొన్ని ఉదాహరణల్లో వేర్వేరు సందర్భాల్లో సంస్కృతి అన్న మాట వేర్వేరు అర్థాల్లో వాడటం మీరు చూడవచ్చు. తమిళ సంస్కృతి అన్నప్పుడు అది భాషా సంబంధమైంది. ముస్లిం సంస్కృతి అన్నప్పుడు మతానికి వర్తిస్తుంది. భారతీయ సంస్కృతి అన్నప్పుడు భౌగోళిక ప్రాంతానికి వర్తిస్తుంది.

సంస్కృతితో పాటు ఎప్పుడూ వినియోగించబడుతున్న నాగరికత (సివిలిజేషన్) అన్న మాటతో పరిస్థితి మరింత క్లిష్టంగా తయారవుతుంది. అసలు ఈ మాటకే అనేక విభిన్న అర్థాలు ఉన్నాయి. ఇందులో మూడు ప్రధానమైనవి. ఇప్పుడు జాతీయత పరిధిలో చూస్తున్న సంస్కృతి కన్నా నాగరికత అన్నది పెద్దది, విస్తారమైనది. ఉదాహరణకు మనం బ్రిటిష్ సంస్కృతి, ఫ్రెంచ్ సంస్కృతి అంటూ వుంటాం. వీటన్నిటితో పాటు, వీటన్నిటి పైనా యూరోపియన్ నాగరికత అన్నది ఉంటుంది. ఇది స్వాభావికంగానే ఆసియా నాగరికతకు భిన్నంగా ఉంటుంది. అదేవిధంగా క్రైస్తవ, హిందూ, ముస్లిం, కన్ఫ్యూషియస్ నాగరికతలు ఉన్నాయి. వీటిలో ప్రధానాంశం ఏమంటే ఒక్క భౌగోళిక పరిధిగానీ, సాంస్కృతిక విభాగం గానీ లేకపోవడం. ఉన్నదల్లా మతమే. లేదా ఒక విశ్వాసాల సముదాయం. దీనంతటితో పాటు నాగరిక, అనాగరికతల మధ్యతేడా కూడా వుంటుంది. వలసవాద ఊహ ప్రకారమే గనుక చూస్తే ఐరోపా నాగరికమైంది. మిగిలిన


epaper.prajasakti.com

> "సంస్కృతితో పాటు ఎప్పుడూ విని యోగించబడుతున్న నాగరికత (సివిలిజేషన్) అన్న మాటతో పరిస్థితి మరింత క్లిష్టంగా తయారవుతుంది. జాతీయత పరిధిలో చూస్తున్న సంస్కృతి కన్నా నాగరికత అన్నది పెద్దది, విస్తారమైనది. ఉదాహరణకు మనం బ్రిటిష్ సంస్కృతి, ఫ్రెంచ్ సంస్కృతి అంటూ వుంటాం. వీటన్నిటితో పాటు, వీటన్నిటి పైనా యూరోపియన్ నాగరికత అన్నది ఉంటుంది. ఇది స్వాభావికంగానే ఆసియా నాగరికతకు భిన్నంగా ఉంటుంది."

ప్రపంచంపై వలసాధిపత్యం నాగరికతను విస్తరింపచేసే కార్యక్రమం అయింది.

రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ఒకవైపున వలస విధానం రద్దు అయినప్పటికీ మరోవైపున పెట్టుబడిదారీ చరిత్ర క్రమం తీవ్రతరం కావడం వల్ల మనమిప్పుడు చెప్పే ప్రపంచీకరణ అన్నది తలెత్తింది. వీటితో పాటే పరస్పరం ఎడంగాఉండకుండా క్రియాశీలతతో. అన్యోన్యతతో మెలిగే సంస్కృతి, నాగరికతల భావన కూడా పెంపొందింది. ఇవి పరస్పర సహకారపూర్వకమైనవి కావచ్చు, విరుద్ధమైనవి కావచ్చు. మతం, రాజకీయాలు అలా వుంచి సంస్కృతి, కమ్యూనికేషన్, కళల విషయంలో అలాంటి పరిణామం వల్ల కలిగిన ఫలితాలను చెప్పేందుకు నేను కొన్ని ఉదాహరణలు ఇస్తాను.

హాలీవుడ్ చిత్రాలకు అమెరికాలో కన్నా మిగిలిన ప్రపంచమంతటా ఎక్కువ మార్కెట్ ఉంటుంది. వాటిని భూగోళం అన్ని మూలలా ప్రదర్శిస్తారు. అలాగే అనేక భారతీయ చిత్రాలను కూడా దేశం వెలుపల చిత్రీకరిస్తారు. లగాన్, మిషన్ కాశ్మీర్ వంటి హిట్ చిత్రాల డివిడిలు ప్రపంచంలోని ఏ పెద్ద నగరంలోనైనా లభిస్తాయి. ఉత్పత్తి సాంకేతికత, వస్తువు మార్కెట్ కంటే ఎక్కువగా అంతర్జాతీయా కరించబడింది. అంటే బొంబాయిలో అయినా, టోక్యోలో అయినా సినిమా పరిశ్రమ, సంస్కృతి, ఉత్పత్తుల ప్రక్రియలు, పరికరాలు ప్రపంచమంతటా ఒకే విధంగా ఉంటాయి. ఈ సాంకేతిక ప్రక్రియలు తటస్థంగా ఉండటం ఎంతమాత్రం జరగదు. పైగా అవి సామాజిక బృందాల ఆవిర్భావంపై అతి తీవ్ర ప్రభావం ప్రసరిస్తాయి. ప్రపంచంలోని 12 భాషలలో చిత్ర నిర్మాణానికి, అదేవిధమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తే అప్పుడు తయారయ్యేది చిత్రాలు మాత్రమే కాదు అసంఖ్యాకమైన చిత్ర దర్శకులు, సాంకేతిక నిపుణులు, కళా దర్శకులు తదితరులు కూడా తయారవుతారు. ప్రపంచమంతటా విస్తారమైన ప్రేక్షక సందోహం రూపొందుతుంది. వీరికి సినిమా సౌందర్య శాస్త్రం పట్ల ఒకే విధమైన అభిరుచులు పెంపొందుతాయి. ఒకే విధమైన అంచనాలతో వారు ఎదురుచూడ్డం మొదలుపెడతారు. సాంస్కృతిక అభిరుచి ప్రపంచీకరణ ప్రపంచం లోని అతి శక్తివంతమైన సాంస్కృతిక సాధనాలలో ఒకటని చెప్పాలి.

టెలివిజన్ విషయంలో ఈ అంతర్జాతీయాకరణ మరింత స్పష్టంగా, మరింత తక్షణంగా కన్పిస్తుంది. మీరు చూస్తున్న టివి సెట్ ఒక బహుళ జాతి కంపెనీ ఈ దేశ భూభాగంపై తయారు చేస్తుంది. లేదా ఇంకా అనేక దేశాల నుంచి కొనుగోలు చేసిన విడి భాగాలతో ఒక భారతీయ సంస్థ దాన్ని కూర్పు చేయవచ్చు. అందులో కొన్ని బహుళ జాతి సంస్థలు కూడా ఉండవచ్చు. ఉదాహరణకు చైనాలో ఉత్పత్తి అయిన ట్యూబ్‌ను కొరియన్ సంస్థ శాంసంగ్ నుంచి ఒనిడా అనే భారతీయ సంస్థ కొనుగోలు చేయవచ్చు. ఒక మీట నొక్కడం ద్వారా మీరు హిందీ సినిమా నుంచి ఇంగ్లీషు సినిమాకు లేదా అమెరికన్ పాప్ సంగీతానికి అలా అలా తరలిపోతుంటారు. డిడి వార్తల నుండి బిబిసికి లేదా హిందీ వార్తా ఛానల్‌కు వెళ్ళవచ్చు. ఈ ఛానల్‌కు సిగ్నల్ హాంగ్‌కాంగ్ నుంచి అందుతుంటుంది. ఆస్ట్రేలియా మీడియా తిమింగలం మర్డోక్ దాని యజమానిగా ఉంటాడు. అతనికి ప్రతిష్టాత్మకమైన లండన్ టైమ్స్‌తో సహా వందలాది పత్రికలపై కూడా యాజమాన్యం ఉంటుంది. మీరు సిఎన్ఎన్ నుంచి దాని భాగస్వామ్యంతో నడిచే మరో భారతీయ ఛానల్‌కు వెళ్ళవచ్చు. ఈ ఛానల్ నడిపించే ప్రధాన యాంకర్ రాజ్‌దీప్ సర్దేశాయ్ ఎబిసి, ఎన్‌బిసి వంటి వివిధ అమెరికా ఛానళ్ళు అదే పనిగా చూసి వాటిలోని హావభావ విన్యాసాలనన్నింటినీ వంటబట్టించుకున్నవాడై వుంటాడు. ఆ విధంగా అతడు ఇంగ్లీషు తెలిసిన భారతీయులు కోట్లాది మందిలో వార్తా ప్రచారానికి సంబంధించిన ఒక అభీష్ట ప్రమాణాన్ని ప్రవేశపెడతాడు. అసలు ఈ ప్రమాణమే అమెరికాలో ఉత్పన్నమైనదై ఉంటుంది. అదిప్పుడు అంతర్జాతీయమై పోయింది. ఇలాగే ఇతర వార్తా ఛానళ్ళ గురించి, యాంకర్ల గురించి కూడా చెప్పుకోవచ్చు. ఈ విధంగా చూసేట్లయితే రాజకీయ వార్తలు, వాతావరణ జోస్యాలు, క్రీడా సమాచారం, ఫ్యాషన్ కబుర్లు వగైరాలతో చక్కగా కలిసిపోయి ఉంటాయి. ప్రతి విభాగంలోనూ చిన్న చిన్న అంశాలుంటాయి. ప్రతిదీ చకచకా నడిచి పోతుంది. ఈ ప్యాకేజీ మధ్యలో కూడా పదే పదే అడ్వర్టయిజ్‌మెంట్లు ప్రసారమవు తాయి. అవి వచ్చినప్పుడు శబ్దం విపరీతంగా పెరుగుతుంది. అంటే అసలైన ప్రాధాన్యత అడ్వర్టయిజ్‌మెంట్లకేనని, వార్తలు కేవలం అందుకు ఒక సాకు మాత్రమేనని స్పష్టమై పోతుంది.

అందువల్ల ఇప్పుడు అసంఖ్యాకులైన ప్రజల రాజకీయ అభిప్రాయాలను మలచడంలో ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన సాధనమై కూర్చుంది. ఏం జరిగేది తాము చూస్తున్నాము గనుక అది తమకు తెలుసునని వారు భావిస్తారు. కానీ టివి అన్నది పెద్ద వ్యాపారం. దాని ప్రసార రూపాలు కనుగొన్నదే అమెరికాలో. దాన్నే ప్రపంచమంతా అనుసరిస్తున్నది. అందుకు భారీ పెట్టుబడులు కావాలి. కార్పొరేట్ సంస్థలకు మాత్రమే ఆ శక్తి ఉంటుంది. వామపక్షానికి ఉండదు. అంటే ప్రస్తుత సాంస్కృతిక పరిశ్రమలో స్వతహాగానే వామ పక్షానికి అననుకూలత ఇమిడి వుంది. ప్రారంభ పెట్టుబడి మాట అటుంచి కార్పొరేట్ స్పాన్సర్‌షిప్ లేనిదే టివిలో ఏ కార్యక్రమంతో కూడా చోటు సంపాదించలేదు. కార్యక్రమంలో భాగం పంచుకునే ప్రతి ఒక్కరికీ తాము ఆ స్పాన్సరర్ల మనసు నొప్పించకూడదని బాగా తెలుసు. అయినా ఏదో స్వాతంత్ర్యంలాంటి ప్రదర్శన సాగాలి. చర్చల వంటివి జరగాలి. ఉదారవాద ప్రజాస్వామ్యం గురించిన కల్పనలను కాపాడేందుకై ఈ తతంగమంతా తప్పనిసరి. కార్పొరేట్ స్పాన్సరర్‌కు సంతృప్తి కలిగించేందుకై టివి నిర్వాహకులే అవసరమైన సెన్సారింగ్ చేస్తారు గనుక వేరే లాంఛన ప్రాయమైన సెన్సార్ వ్యవస్థ అవసరమే ఉండదు. అందువల్ల ఒక పెద్ద వ్యాపారంగా మారిన సాంస్కృతిక పరిశ్రమ కార్యక్రమ సారాన్ని మాత్రమే గాక ఆ పరిశ్రమలో పనిచేసేవారి మనస్తత్వాలను, వర్గానుబంధాలను కూడా నిర్దేశిస్తుంది. వారు ఆ మనస్తత్వాన్నే కోట్లాది


epaper.prajasakti.com

మంది ప్రేక్షకులకు ప్రసారం చేస్తారు. అడ్వర్టయిజ్‌మెంట్‌కు అంత ప్రాబల్యం ఉండటమంటే వార్తా ఉత్పత్తి ప్రక్రియ వివిధ రకాలైన కార్పొరేట్ సరుకుల అమ్మకానికి వేదికగా మారుతుంది. నయా ఉదారవాద ప్రైవేటీకరణలు మీడియాలో ఈ విధమైన పరివర్తనకు చాలా కీలకమైనవి. ఈ పరివర్తనలు తదుపరి దశలో ప్రపంచమంతటా వర్గాల కతీతంగా ప్రజల మనస్తత్వాలను మార్చివేస్తాయి. కనీసం పట్టణ ప్రాంతాలలోనైనా ఈ ప్రభావం ఉంటుంది.

ఈ విధమైన వార్తల వాణిజ్యీకరణలో అంతర్జాతీయాకరణ రూపాలను, మహా వాణిజ్యంగా మారిన క్రీడారంగంలో కూడా గమనించవచ్చు.

**(అనువాదం : తెలకపల్లి రవి)**

---

# పోరాట స్ఫూర్తి మల్లు స్వరాజ్యం

**(2వ పేజీ తరువాయి...)**

స్వరాజ్యం తరచూ చెపుతుండేవారు. గెరిల్లా పోరులో భాగంగా ప్రజలు ఒకరోజు భూస్వాముల గడీలపై దాడిచేసి ధాన్యం పంచుకొన్నారు. ఆ దాడికి కామ్రేడ్ స్వరాజ్యం నాయకత్వం వహించారు. అనంతరం సమీపంలోని అడవిలో ఒక గిరిజన గ్రామంలో తలదాచుకొన్నారు. విషయం తెల్సిన పోలీసులు చుట్టుముట్టారు. అప్పుడు స్వరాజ్యం గారున్న ఇంటి గిరిజన మహిళ సైదమ్మ పోలీసులతో ఘర్షణకు దిగింది. ఆమెకూడా స్వరాజ్యం గారి లాగా ఒడ్డూ-పొడుగూ ఉన్న మహిళే. పోలీసులు ఆమెనే స్వరాజ్యం అనుకొన్నారు. ఆమె పసిబిడ్డ తల్లి. బిడ్డను వదలి పెట్టి గట్టిగా ఘర్షణకు దిగింది. పోలీసులు ఆమెతో ఘర్షణ పడుతుంటే స్వరాజ్యం గారు తప్పిచ్చుకోవచ్చని సైదమ్మ ఆలోచన. పసిబిడ్డను తీసుకొని వస్తానన్నా వినకుండా పోలీసులు ఆమెను లాక్కుపోయి వ్యానులో పడేశారు. బిడ్డ గురించి చెప్పడం నాటకమన్నారు. వారం రోజులు వదలకుండా చిత్రహింసలు పెట్టారు. చివరకు వాస్తవం తెలుసుకొని వదలి పెట్టారు. ఇక్కడ పసిబిడ్డ అనారోగ్యం పాలైంది. బ్రతికించడం కోసం ఆ గ్రామ ప్రజలు, స్వరాజ్యం తీవ్రమైన ప్రయత్నం చేశారు. కానీ చనిపోయింది. సైదమ్మను చూసిన స్వరాజ్యం గారు భోరున విలపించారు. అప్పుడు సైదమ్మ "ఎందుకమ్మా పసిబిడ్డ కోసం అంతలా ఏడుస్తావు. ఎదిగిన బిడ్డ అయిన నిన్ను కన్నది కూడా అమ్మే కదా! మీ అమ్మ మా కోసం నిన్ను పంపలేదా? చావుకు తెగించి నువ్వు పోరాడుతున్నావు కదా. నీ కోసం ఆ మాత్రం త్యాగం చెయ్యలేమా? మరో బిడ్డను కంటాం. బాధపడకు" అన్నదట. ఆ పోరాటంలో ఇలాంటి ఘటనలు లెక్కలేనన్ని జరిగాయి.

పోరాటానంతరం 1954లో ఉద్యమ సహచరుడు మల్లు వెంకటనర్సింహారెడ్డితో ఆదర్శ వివాహం జరిగింది. దేవులపల్లి వెంకటేశ్వరరావు, చండ్ర రాజేశ్వరరావు, బద్దం ఎల్లారెడ్డి ఈ వివాహ కార్యక్రమం నిర్వహించారు. ఆయుధపోరు ఆగిపోయినా ప్రజా పోరాటంలో బాధ్యతలు చేపట్టారు. "ప్రజలే చరిత్ర నిర్మాతలు. ప్రజలే పోరాడాలని" ఆమె ఎప్పుడూ అంటుండేవారు. "తమ సమస్యలపై ప్రజలు కదిలితేనే ప్రజా పోరాటం ప్రారంభమవుతుంది. మేము కూడా ప్రజలు కదిలాకనే ఆయుధాలు పట్టాం. ఆయుధాలతో విధానాలు మారవు, ప్రజలను పోరుకు సిద్దం చేసే చైతన్యాన్ని కలిగించడానికి కమ్యూనిస్టులు కృషి చేయాలని" చెప్పేవారు. ఆ కృషి ఆమె జీవితాంతం కొనసాగించారు. మహిళా సమస్యలు, మద్యం సమస్య, భూమి సమస్యలతో పాటు అనేక పోరాటాలకు ఆమె నాయకత్వం వహించారు.

వినోభాబావే భూదానోద్యమంలో భూములిచ్చినట్లు నాటకమాడి, తర్వాత పేదల నుండి లాగేసుకొని అనుభవిస్తున్న భూస్వాములకు వ్యతిరేకంగా రైతులను సమీకరించి పోరాటం నిర్వహించారు. అలాంటి ఒక పోరాటంలో భూస్వామి రైతులపై తుపాకీ కాల్పులు జరిపితే, ఆ తూటాలను తీసుకువెళ్ళి శాసనసభలో పెట్టి "మీరు చేస్తున్నది ప్రజాపాలనా, రౌడీ పాలనా? మీకు చేతనైతే రాజ్యాంగం ప్రకారం పాలించండి. లేకుంటే మా పోరు మేము చేయాల్సి వస్తుంది" అని చెప్పారు. "ఈ తూటాలను మేము చిన్నప్పుడే ఉపయోగించాం. మీ నాయకుడికి తుపాకీ ఉంది కానీ, గురిపెట్టి పేల్చటం కూడా రాదు. అదే మేమైతే గురి తప్పదు. జాగ్రత్తగా ప్రవర్తించండి" అని హెచ్చరించింది. ఉమ్మడి నల్గొండ జిల్లాలో నాలుగువేల ఎకరాల భూదానోద్యమ భూములు పంపిణీ చేయించారు.

1978లో హైదరాబాద్‌లో నల్లకుంట పోలీసు స్టేషన్‌లో నలుగురు పోలీసులు రమీజాబీ అనే యువతిని హింసించి, ఆమెపై అత్యాచారం చేశారు. ఆమె భర్తను స్టేషన్‌లోనే కొట్టి చంపారు. ఆనాడు మహిళా సంఘం నేతగా, శాసన సభ్యురాలిగా ఉన్న స్వరాజ్యం రాష్ట్ర వ్యాపిత ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, మహిళల హక్కుల కోసం ప్రత్యేక చట్టాలు కావాలని, పై ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని పోరాటం సాగింది. స్వరాజ్యం పిలుపునందుకొన్న ప్రజలు వేలాదిగా కదిలారు. ప్రభుత్వం దోషుల పట్ల కఠినంగా వ్యవహరించక తప్పని పరిస్థితి ఏర్పడింది. మహిళల రక్షణ కోసం ప్రత్యేక చట్టం చేయాల్సి వచ్చింది.

80వ దశకంలో మద్యం ఒక తీవ్రమైన సమస్యగా ముందుకు వచ్చినప్పుడు మద్యనిషేధ ఉద్యమకారులతో కల్సి రాష్ట్రమంతా పర్యటించారు. మద్యపానాన్ని నిషేధించాలని, మద్యం మృతులకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, బెల్టుషాపులు రద్దుచేయాలని పోరాటం నిర్వహించారు. ఉమ్మడి రాష్ట్రమంతా కదిలిన మహిళాలోకం స్పందనను గమనించి ఆనాటి పాలకులు మద్యనిషేధ నిర్ణయం తీసుకోవటం జరిగింది.

ఇలా అనేక సమస్యలపై తాను పనిచేయడంతో పాటు తన కుటుంబ సభ్యులను కూడా ఉద్యమంలోకి నడిపించారు. చిన్న కుమారుడు నాగార్జునరెడ్డి సూర్యాపేట జిల్లా కార్యదర్శిగా పని చేస్తున్నారు. కోడలు మల్లు లక్ష్మి పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలిగా, మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శిగా పని చేస్తున్నారు. పెద్ద కుమారుడు గౌతం రెడ్డి మిర్యాలగూడెం వన్‌టౌన్ కార్యదర్శిగా పని చేస్తున్నారు.

ఆమె పరిపూర్ణ విప్లవ జీవితం గడిపారు. భూస్వామ్యవర్గంలో పుట్టినా, పీడితవర్గం కోసం జీవిత పర్యంతం పని చేశారు. ఎటువంటి త్యాగానికైనా సిద్ధపడ్డారు. ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నారు. మరెన్నో నిర్బంధాలు చవిచూశారు. ఆదర్శ వివాహం చేసుకొన్నారు. ప్రజాప్రతినిధిగా పీడితుల గొంతై నినదించారు. కుటుంబాన్నీ విప్లవబాటలో నడిపించారు. నిరాడంబర జీవితాన్ని గడిపారు. ఇలా అన్ని విషయాలలో ఆదర్శప్రాయమయిన అమ్మ స్వరాజ్యం 91సం॥ల వయసులో మార్చి 19వ తేదీన హైదరాబాద్‌లో అనారోగ్యంతో కన్ను మూశారు. సంతాపసభలో రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ మంచి కమ్యూనిస్టు ఎలా ఉండాలి అంటే మల్లు స్వరాజ్యంలా ఉండాలి అనే జీవితాన్ని గడిపారు అని తన సంతాపం తెలిపారు. ఆ మంచి కమ్యూనిస్టుకు విప్లవ జోహార్లు. ఆమె ఆశయసాధనకు పార్టీ శ్రేణులన్నీ కదలటమే ఆమెకు అర్పించే నివాళి. ◆



epaper.prajasakti.com

Date of Publication : 30th of every month. Date of Posting : 5th & 7th of every month. మార్క్సిస్టు
Postal Regd. No. D/VJ/172/2021-23, Marxistu Monthly Magazine, Volume: 16, issue : 11 Vijayawada
RNI Reg. No. APTEL/2006/17554 - Ra. 15/- Total Pages : 36

# ఆధునికానంతరవాదం: పూర్వాపరాలు

(20వ పేజీ తరువాయి)

మధ్య చెప్పుకోదగ్గ తేడాలున్నాయి. అమెరికన్ ఆధునికానంతర వాదాన్ని ప్రచారంలోకి తెచ్చిన వాళ్ళలో కొంత మంది మాజీ కమ్యూనిస్టులు, ట్రాట్స్కీయిస్టులు ఉన్నా మొత్తంగా చూస్తే ఆ దేశంలో మార్క్సిస్టు సిద్ధాంతానికీ, కమ్యూనిస్టు రాజకీయాలకూ బలమైన పునాది లేదు. ఉదారవాదానిదే పై చెయ్యిగా ఉండేది. ఈ ఉదారవాదులు ఎలాంటి తటపటాయింపులు లేకుండా పెట్టుబడిదారీ విధానాన్ని బలపరచ డానికీ, బూర్జువా ప్రజాస్వామ్యాన్ని కీర్తించడానికీ ముందుండేవారు. కాని ఫ్రాన్స్ పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉండింది. ఆ దేశంలో కమ్యూనిస్టు రాజకీయాలు బలంగా, విస్తృతంగా సాగాయి. ఇక్కడ ఆధునికానంతర వాదులుగా చెప్పుకునే వారు 1968 సమరశీల ఉద్యమాల నేపథ్యం కలిగినవాళ్లు. నేడు అంగ్లో – సాక్సన్ ఉదారవాదాన్ని తలకెత్తుకున్న క్రిస్టేవా ఒకప్పటి మావోయిస్టు. నిజానికి ఈవిడ ఫ్రాన్స్ దేశస్థురాలు కూడా కాదు. బల్గేరియా నుండి వచ్చి అక్కడ స్థిరపడిన రష్యన్ దేశస్తురాలు. లైయోతార్ అతివాద కమ్యూనిస్టు నేపథ్యం నుండి వచ్చినవాడు. మితవాద సోషలిస్టు పార్టీలో భాగం కావడానికి ముందు 'లగ్జెంబరిస్టు'గా ఉండేవాడు. ఇక 'పోకాల్ట్'కి యువ ప్రాయంలో కమ్యూనిస్టు పార్టీతో దగ్గర సంబంధాలు ఉన్నాయి. కమ్యూనిస్టు పార్టీ సభ్యుడో కాడో ఇదమిద్ధంగా చెప్పలేం. పోతే 'దెరిడా' ఆధునికానంతర వాదంలోనే 'వినిర్మాణవాదం' అంటూ కొత్త సిద్ధాంతాన్ని తీసుకొచ్చాడు. మార్క్సిజాన్ని మరింతగా సమరశీలంగా చెయ్యడమే తన ఉద్దేశ్యం అని చెబుతాడు. మార్క్సుని కీర్తిస్తూ ఒక పుస్తకం కూడా రాసాడు. ఇందులో మార్క్సుని తను విశ్లేషించిన తీరులో కమ్యూనిస్టు అనేవాడు ఎవరూ ఏకీభవించరనుకోండీ అది వేరే సంగతి. అయితే వీళ్ళంతా ఆధునికానంతర వాదాన్ని మార్క్సిజం కంటే సమరశీలమైన, సమాజిక మార్పుకు దారి తీసే సిద్ధాంతంగా చెప్పుకొస్తుంటారు.

ప్రపంచం చాలా మారిపోయింది. ఇప్పటి పరిస్థితులకు మార్క్స్ ప్రవచిత కమ్యూనిస్టు సిద్ధాంతం నప్పదు, అది అందరూ అనుకునేంత విప్లవకర సిద్ధాంతం కాదు, నేడు సామాజిక విప్లవాన్ని తీసుకురావాలంటే కొత్త తరహా రాజకీయాలు అవసరం, అధునికానంతర వాదం ఆ అవసరాన్ని తీరుస్తుంది అని చెబుతుంటారు. ఇవి పూర్తిగా తప్పుడు వాదనలు.

**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**

**చందా వివరాలు**
విడిపత్రిక: **రూ.15,** సంవత్సర చందా:**రూ.150,** పోస్టు ద్వారా **రూ. 180**
పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చందాదారుని చిరునామా**

**పోస్టు స్టాంపు**

ఇంటి నెంబరు...........................................
వీధి...........................................
గ్రామం...........................................
మండలం లేదా పట్టణం...........................................
జిల్లా...........................................

email: marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 9490098977.
Editor : S. Venkatarao,



epaper.prajasakti.com